ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 04.09.2026 | సంపుటి :13 సంచిక : 46 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV
జనంసాక్షి tv JANAMSAKSHI

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# మంత్రివర్గం నుంచి కొండా సురేఖ బర్తరఫ్

## సీఎం రేవంత్ సిఫారసుకు గవర్నర్ ఆమోద ముద్ర



లోక్‌భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి..చిత్రంలో మంత్రులు పొన్నం, అజారుద్దీన్

- సీఎం నిర్ణయానికి హైకమాండ్ ఓకే..
- చిన్నారెడ్డి పైనా కాంగ్రెస్ పార్టీ వేటు

హైదరాబాద్,సెప్టెంబర్3(జనంసాక్షి): తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఊహించిన పరిణామమే చోటుచేసుకుంది. కొండా సురేఖ రాజీనామాకు నిరాకరించడంతో, ఆమెను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆమెను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసేందుకు ప్రతిపాదించిన అధికారిక సిఫార్సు లేఖను సీఎంఓ ఇప్పటికే గౌరవ గవర్నర్‌కు పంపించింది. కొంత కాలంగా కొండా సురేఖ వ్యవహారశైలి ప్రభుత్వానికి, పార్టీకి ఇబ్బందికరంగా మారింది. సీఎం రేవంత్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. చివరికి సీఎం కుటుంబసభ్యులను టార్గెట్ చేయడం, కొండా సురేఖ కుమార్తె సీఎంపై వ్యక్తిగత విమర్శలు చేయడంతో పరిస్థితి చేయి దాటిపోయింది. పీసీసీ క్రమశిక్షణా కమిటీ పదవుల నుంచి తప్పించాలని సిఫారసు చేయడంతో హైకమాండ్ ఈ నిర్ణయం తీసుకుంది. మిగతా 2లో..

# ఆది నుంచి అన్నీ వివాదాలే..



## మహబూబాబాద్ నుంచి కేబినెట్ ఉద్వాసన దాకా!

### తెలంగాణ ఉద్యమం ఉధృతంగా ఉంటే.. జగన్ వెంట అడుగులు..

- మంత్రి పదవికి రాజీనామా.. పరకాలలో పరాజయం..
- పార్టీ మార్పులు.. వివాదాస్పద వ్యాఖ్యలు..
- ఇప్పుడు కుమార్తె రాజకీయ ప్రకటనతో కేబినెట్ నుంచి ఉద్వాసన
- ఓర్పు, నేర్పు కంటే దూకుడే ఎక్కువ..
- రాజకీయ నిర్ణయాల్లో పదేపదే ఎదురుదెబ్బలు

రాజకీయాల్లో దూకుడు ఒక్కటే సరిపోదు. ప్రజల మనోభావాలను అర్థం చేసుకునే ఓర్పు, పరిస్థితులకు తగ్గట్టుగా వ్యవహరించే నేర్పు, రాజకీయ పరిణతి కూడా అవసరం. కొండా సురేఖ రాజకీయ ప్రస్థానాన్ని పరిశీలిస్తే.. ఈ లక్షణాల కంటే దూకుడే ఎక్కువగా కనిపించిందన్న విమర్శలకు ఎన్నో సందర్భాలు బలం చేకూరుస్తాయి.

జనంసాక్షి స్పెషల్ స్టోరీ, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం కోసం ప్రజలు ఉధృతంగా ఉద్యమిస్తున్న సమయంలో.. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా సమైక్యవాద వైఖరితో ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట సురేఖ నిలవడం ఆమె రాజకీయ జీవితంలో కీలకమైన ప్రతికూల మలుపుగా మారింది. ఆ నిర్ణయం తెలంగాణలో ఆమెపై తీవ్ర వ్యతిరేకతకు కారణమైంది. అనంతర పరిణామాలు ఆమె రాజకీయ ప్రయాణంలో వరుస ఎదురుదెబ్బలకు దారితీశాయి.

**మహబూబాబాద్.. తొలి పెద్ద వివాదం**

2010లో జగన్ చేపట్టిన 'ఓదార్పు యాత్ర'లో భాగంగా మహబూబాబాద్‌కు రావడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. తెలంగాణవాదులు జగన్ పర్యటనను అడ్డుకోవడంతో రైల్వేస్టేషన్ పరిసరాలు ఘర్షణలతో అట్టుడికాయి.సురేఖ, ఆమె భర్త కొండా మురళిపై రాళ్ల దాడి జరిగినట్లు అప్పటి నివేదికలు పేర్కొన్నాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు భద్రతా సిబ్బంది కాల్పులు జరపడంతో పలువురు గాయపడ్డారు.అదే ఘటనలో సురేఖ తెలంగాణ ఉద్యమకారులపై రాళ్లు విసురుతున్న దృశ్యాలు గా అప్పట్లో పలు పత్రికల్లో ఫోటోలు ప్రచురితమయ్యాయి. ఈ ఘటన తెలంగాణ ఉద్యమ వర్గాల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమైంది.

**జగన్ కోసం పదవులు వదిలారు.. పరకాలలో ప్రజల తీర్పు**

వైఎస్ రాజశేఖరరెడ్డి మరణం తర్వాత జగన్‌ను ముఖ్యమంత్రిగా చేయాలన్న డిమాండ్‌తో 2009లో సురేఖ మంత్రి పదవికి రాజీనామా చేశారు. మిగతా 2లో..

# కేబినేట్‌లో బీసీ వర్గానికి ప్రాధాన్యత

- సురేఖ, చిన్నారెడ్డి స్థానంలో కొత్త వారికి చాన్స్
- ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గా గద్వాల విజయ లక్ష్మి

**హైదరాబాద్,సెప్టెంబర్3(జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం రెండు కీలక పదవుల్లో కూడా మార్పులు చేసింది. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుండి జి. చిన్నారెడ్డిని తొలగించి, ఆ స్థానంలో హైదరాబాద్ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని నియమించారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన ఛైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద నియమితులయ్యారు. తెలంగాణ కాంగ్రెస్‌లో క్రమశిక్షణకు సంబంధించిన వివాదం మిగతా 2లో..

# హైకమాండ్‌ను సీఎం రేవంత్ బ్లాక్‌మెయిల్ చేశారు



- నా కుమార్తె వ్యాఖ్యలకు నన్నెలా బాధ్యురాలిని చేస్తారు
- రాజీనామా చేయమని నన్నెవరూ అడగలేదు: కొండా సురేఖ

హైదరాబాద్,సెప్టెంబర్3(జనంసాక్షి): మంత్రి పదవి నుంచి తనను తొలగించడంపై కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడ్డారని ఆరోపించారు. సురేఖను తొలగించకపోతే తాను తప్పుకొంటానని అధిష్ఠానాన్ని రేవంత్ బెదిరించారని ఆమె వ్యాఖ్యానించారు. లోక్‌భవన్ నుంచి అధికారిక ప్రకటన ఇంకా వెలువడకముందే.. తన బర్తరఫ్‌ను ఆమె ధ్రువీకరించారు. ఈ సందర్భంగా మిగతా 2లో..

## సీఎంకు బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరమేంటి?

2లో

- అది ఆమె స్వయం కృతాపరాధం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

# సాగర్ నీళ్లివ్వండి.. లేదంటే పాదయాత్ర చేస్తా

## నీటి షెడ్యూల్ ప్రకటించాల్సిందే • కేటీఆర్ డిమాండ్



మిర్యాలగూడ (జనంసాక్షి): నాగార్జున సాగర్ ప్రాజెక్టు కింద సెప్టెంబర్ 14న వినాయకచవితిలోపు నీటి విడుదల షెడ్యూల్ ప్రకటించకపోతే కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. కేసీఆర్ పదేళ్ల పరిపాలనను, మిర్యాలగూడలో గురువారం సాయంత్రం నిర్వహించిన రైతు ధర్నాలో ఆయన మాట్లాడా రు.ఎన్ని తడులకు నీళ్లు ఇస్తారు.. ఎప్పుడెప్పుడు ఇస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సాగర్‌లో నీళ్లున్నా మంత్రులకు సోయి లేదని విమర్శించారు. శ్రీశైలంలో 537 అడుగుల నీరు ఉందని కేటీఆర్ అన్నారు. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా.. సాగర్‌లో నీళ్లు ఉన్నా జిల్లాలోని మంత్రులకు సోయి లేదని విమర్శించారు. సాగర్‌లో నీళ్లు ఉన్నా ఇద్దరు మంత్రులు శనిలాగా దాపురించారని వ్యాఖ్యానించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలంగాణ రైతుల కళ్లలో కన్నీళ్లు పెట్టిస్తున్నారని ఆరోపించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నీళ్లలో వాటర్ కలిస్తే సొరంగం కూలిపోయిందని అంటున్నారని విమర్శించారు. కళ్లు ఉండి చూడలేని మంత్రులుగా వ్యవహరిస్తున్నారని, శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో నీళ్లు ఉన్నా చూడడం లేదని అన్నారు. శ్రీశైలంలో జలవిద్యుత్ ఉత్పత్తి ద్వారా 40 నుంచి 50 టీఎంసీల నీరు సాగర్‌లోకి వచ్చిందని కేటీఆర్ తెలిపారు. శ్రీశైలంలో గేట్లు తెరిచేలోపే సాగర్‌లోకి నీళ్లు వచ్చాయని, సాగర్‌లో రెండు మిగతా 2లో..



# భారత ఆర్థికవృద్ధితో ప్రపంచానికి కొత్త అవకాశాలు

- భారత ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు
- మోదీ, బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ మధ్య చర్చలు
- భారత్, బెల్జియం మధ్య పలు కీలక ఒప్పందాలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 3(జనంసాక్షి): ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక, ఆర్థిక అనిశ్చితులు కొనసాగుతున్న వేళ భారత్, బెల్జియం ద్వైపాక్షిక సంబంధాలను మరింత వ్యూహాత్మక స్థాయికి తీసుకెళ్లాలని నిర్ణయించాయి. ప్రధాని నరేంద్ర మోదీ, బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ మధ్య గురువారం విస్తృత మిగతా 2లో..

# బెదిరిస్తే భయపడను

## స్నేహంతోనే నన్ను గెలవగలరు



- ఎన్నికలు వస్తుంటాయి.. పోతుంటాయి.. గెలుపోటములు సహజం
- ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ
- పాతబస్తీలో భారీ స్టీల్ ఫ్లైఓవర్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్
- రేవంత్‌ను చూసి కాంగ్రెస్‌కు మద్దతు: ఎంపీ అసదుద్దీన్

హైదరాబాద్(జనంసాక్షి): తననెవరూ బెదిరించవద్దని.. బెదిరిస్తే భయపడనని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పాతబస్తీలోని నల్గొండ ఎక్స్ రోడ్డు నుంచి ఒవైసీ జంక్షన్ వరకు నిర్మించిన భారీ స్టీల్ ఫ్లైఓవర్‌ను సీఎం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి సీఎం పాల్గొని మాట్లాడారు. "బెదిరిస్తే భయపడను. స్నేహంతోనే నన్ను గెలవగలరు. నేను ఎవరికీ గులామ్‌ను కాదు.. దోస్తీకి మాత్రమే గులామ్‌ను. ఎన్నికలు వస్తుంటాయి.. పోతుంటాయి.. గెలుపోటములు సహజం" అని వ్యాఖ్యానించారు.

**ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ**

ఈ వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వం సకాలంలో నిధులు ఇవ్వలేదని సీఎం విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేసి త్వరగా వంతెన పూర్తిచేసిందని చెప్పారు. తమ ప్రాంత అభివృద్ధి కోసం అసదుద్దీన్ ఒవైసీ ప్రభుత్వంతో పోరాటానికైనా సిద్ధంగా ఉంటారన్నారు. "ఈ ప్రాంతమంతా ఓల్డ్ సిటీ కాదు.. ఇది ఒరిజినల్ సిటీ. పాతబస్తీలో అణువణువూ మిగతా 2లో..





# చట్టబద్ధతోనే దత్తత ప్రక్రియ

- అక్రమ దత్తతకు వీలులేదు
- హైకోర్టు కీలక తీర్పు

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలో బాలల సంరక్షణ కేంద్రాలు, సంక్షేమం, పునరావాసానికి సంబంధించిన వ్యవస్థల పనితీరుకు సంబంధించిన వివరాలపై హైకోర్టు బుధవారం ఆరా తీసింది. అక్రమ దత్తతకు సంబంధించిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా చట్టబద్ధ దత్తత ప్రక్రియ తప్పనిసరని మిగతా 2లో..

# యువత గొంతు నొక్కితే ప్రజలకు సమాధానం చెప్పాల్సిందే

## బీజేపీపై రాహుల్‌గాంధీ ఫైర్



న్యూఢిల్లీ(జనంసాక్షి): బిహార్‌లో పరీక్షా వ్యవస్థలో అవకతవకలు, ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత కోసం ఆందోళన చేస్తున్న విద్యార్థులకు కాంగ్రెస్ అగ్రనేత, లోక్?సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ మద్దతు తెలిపారు. ఆందోళనకారులపై పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా తప్పుబట్టారు. యువత గొంతును అణచివేసే ఏ ప్రభుత్వమైనా చివరికి ప్రజలకు సమాధానం చెప్పాల్సిందేనని బీజేపీని ఉద్దేశించి హెచ్చరించారు. పరీక్షల్లో అక్రమాలు, నియామక ప్రక్రియలో పారదర్శకత కోరుతూ పోలీసుల చర్యలను ఎదుర్కొన్న బిహార్ విద్యార్థులు, యువతను రాహుల్‌గాంధీ కలిశారు. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తన స్పందనను వెల్లడించారు. విద్యార్థులు తమ హక్కుల కోసం పారదర్శకమైన పరీక్షా విధానం కోసం మాత్రమే ఆందోళన చేశారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అయితే వారిపై లాఠీచార్జ్‌తో పాటు ఏకే-47, పిస్టళ్లతో కాల్పులు జరిగాయని మిగతా 2లో..

# మా వస్తువులకు తక్కువ టారిఫ్‌లను ప్రతిపాదిస్తేనే!

- అమెరికాతో ట్రేడ్ డీల్‌పై భారత్ కీలక షరతు
- పోటీ దేశాల కంటే మెరుగైన టారిఫ్ రేట్లు ఇవ్వాలని అమెరికాకు స్పష్టం
- అనుకూల నిబంధనలు ఖరారైన వెంటనే బీటీఏ తుది వివరాలు ప్రకటిస్తాం: పీయూశ్ గోయల్ వెల్లడి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై కేంద్రమంత్రి పీయూశ్ గోయల్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇతర దేశాల ఉత్పత్తుల కంటే భారత్ వస్తువులకు తక్కువ టారిఫ్‌లను ప్రతిపాదిస్తే అమెరికాతో వెంటనే ఒప్పందం కుదుర్చుకుంటామని అన్నారు. బీటీఏ తుది వివరాలను అప్పుడే ప్రకటిస్తామని తెలిపారు. గురువారం ఢిల్లీలో నిర్వహించిన 'లీవరేజింగ్ ఎఫ్‌టీఏస్ అవుట్‌రీచ్' జాతీయ వర్క్‌షాప్‌లో పీయూశ్ గోయల్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఇప్పటికే భారత్ కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు దేశీయ వ్యాపారులకు గణనీయమైన మిగతా 2లో..



# సుప్రీంకోర్టులోనూ ట్రంప్‌కు ఎదురుదెబ్బ

## జన్మతః పౌరసత్వ ఆంక్షల ఆదేశాలు నిలిపివేత
## పౌరసత్వ కొత్త విధానానికి కోర్టు బ్రేకులు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 3(జనంసాక్షి):** జన్మతః పౌరసత్వంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మరోసారి న్యాయస్థానంలో చుక్కెదురైంది. అమెరికాలో జన్మించే విదేశీ వలసదారుల పిల్లలకు సహజంగా లభించే పౌరసత్వంపై ఆంక్షలు విధించేందుకు ట్రంప్ జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వుల అమలును యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టు నిలిపివేసింది. 'బర్త్ టూరిజం'ను అడ్డుకోవడంతో పాటు, అక్రమ వలసదారులు, తాత్కాలిక వీసాలపై ఉన్నవారి పిల్లలకు జన్మతః పౌరసత్వం లభించకుండా పరిమితులు తీసుకురావాలని ట్రంప్ ఇటీవల కొత్త ఉత్తర్వులపై సంతకం చేసిన విషయం తెలిసిందే. ఇదే అంశంపై ఇటీవల ట్రంప్‌నకు సుప్రీంకోర్టులోనూ ఎదురుదెబ్బ తగిలింది. అమెరికాలో జన్మించిన పిల్లలకు వారి తల్లిదండ్రుల వలస స్థితితో సంబంధం లేకుండా పౌరసత్వ హక్కు కల్పించే రాజ్యాంగ నిబంధనలను ట్రంప్ పరిమితం చేయాలని ప్రయత్నించారు. అయితే ఆంక్షలపై న్యాయపరమైన వివాదం కొనసాగుతుండగా, ఆయన తీసుకొచ్చిన తాజా ఉత్తర్వులపైనా కోర్టు జోక్యం చేసుకుంది. దీంతో విదేశీ వలసదారుల పిల్లలకు జన్మతః పౌరసత్వాన్ని మిగతా 2లో..

# హర్మూజ్ పేరును 'ట్రంప్' జలసంధిగా మారుస్తాం

- అది అమెరికా కంట్రోల్ లోనే ఉంది : ట్రంప్
- ఇరాన్‌ను అణుశక్తిగా మారకుండా నిరోధిస్తాం
- ఇరాన్‌కు సాయం చేసే దేశాలపై ఆంక్షలు విధిస్తాం
- ఆ దేశంతో వాణిజ్యంపై భారత్‌కు అమెరికా హెచ్చరిక!
- మోదీ, ఇరాన్ అధ్యక్షుడు భేటీ నేపథ్యంలో వ్యాఖ్యలు

2లో..

జనంసాక్షి www.janamsakshi.org | శుక్రవారం 04.09.2026

## చట్టబద్ధతోనే దత్తత ప్రక్రియ

రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. 2 మాసాల నుంచి మూడేళ్ల వయసున్న చిన్నారులు అక్రమ దత్తతకు గురైనట్లుగా ఆరోపణలతోపాటు నమోదైన ఎఫ్ఐఆర్‌లలో అసలైన తల్లిదండ్రులను గుర్తించడంలో పోలీసుల వైఫల్యాన్ని న్యాయస్థానం ప్రశ్నించింది. ఈ మేరకు డీఎన్ఏ శాంపిల్స్ సేకరణ వంటి శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలంటూ హోంశాఖకు ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలతో వారంలోగా నివేదికను దాఖలు చేయాలని ఆదేశించింది. 2023లో దత్తత తీసుకున్న ఓ చిన్నారిని పోలీసులు స్వాధీనం చేసుకుని స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు అప్పగించడాన్ని సవాల్ చేస్తూ నల్గొండ జిల్లా సూరారం మండలానికి చెందిన ఎం.వెంకన్న దంపతులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. దీనిపై విచారించిన సింగిల్ జడ్జి రూల్స్?కు విరుద్ధంగా జరిగిన దత్తతను అనుమతించలేమంటూ పిటిషన్‌ను కొట్టివేయడంతో వెంకన్న అప్పీల్ చేశారు. ఈ పిటిషన్?పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా హోంశాఖ ముఖ్యకార్యదర్శి శిఖా గోయల్?తో పాటు మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రుతి ఓజా, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేందిర బోయిలు వర్చువల్?గా హాజరై సమాధానాలిచ్చారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి నివేదిక సమర్పించేందుకు సీనియర్ న్యాయవాది బి.మయూర్‌రెడ్డిని అమికస్ క్యూరీగా హైకోర్టు నియమిస్తూ విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. ఈ సందర్భంగా హైకోర్టు ధర్మాసనం ప్రశ్నలకు మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రుతి ఓజా సమాధానమిస్తూ అనాథలను గుర్తించి సాయం అందిస్తున్నామని తెలిపారు. అన్ని జిల్లాల్లో సీడబ్ల్యూసీ కమిటీలను 2 నెలల్లో పూర్తిచేస్తామని కోర్టుకు విన్నవించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 291 బాలల సంక్షేమ గృహాలుండగా, అందులో ప్రైవేటు ఆధ్వర్యంలో 231, ప్రభుత్వ ఆధ్వర్యంలో 60 నడుస్తున్నాయన్నారు. నేరాలకు పాల్పడిన, శిక్ష పడిన బాలల కోసం ప్రత్యేకంగా 35 సంరక్షణ కేంద్రాలున్నాయని శ్రుతి ఓజా కోర్టుకు తెలిపారు. ఆరేళ్లలోపు పిల్లల కోసం ప్రత్యేక దత్తత కేంద్రాలు 17 ఉన్నాయని శ్రుతిఓజా వివరించారు. అనాథలుగా, ఎవరైనా అప్పగించడం ద్వారా దొరికిన చిన్నారులను సీడబ్ల్యూసీ ముందు హాజరుపరచి, ప్రత్యేక దత్తత కేంద్రాల్లో ఉంచుతామన్నారు. నిబంధనల ప్రకారం సామాజిక దర్యాప్తు జరిపించి దత్తతకు అర్హులైనవారి వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తామని ఆమె న్యాయస్థానానికి వివరించారు. పిల్లల సంక్షేమాన్ని శిశు సంక్షేమ శాఖ చూసుకుంటుందని, కేసుల్లో దర్యాప్తును మాత్రమే తాము చేపడతామంటూ హైకోర్టుకు శిఖాగోయల్ తెలిపారు. తమ శాఖలో ఎస్సీ, ఎస్టీ పిల్లల సంక్షేమాన్ని చూస్తామని విజయేందిర బోయి వివరించారు.

## కేబినేట్ లో బీసీ వర్గానికి ప్రాధాన్యత..

నడుస్తున్న తరుణంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే టి. మేఘా రెడ్డిపై చేసిన వ్యాఖ్యల కారణంగా చిన్నారెడ్డి కూడా విమర్శల పాలయ్యారు. కొండా సురేఖ తన పైన చర్యల సమయంలో బీసీ కార్డు తెర మీదకు తెచ్చారు. దీంతో.. చిన్నారెడ్డి పైనా చర్యలు వెంటనే తీసుకున్నారు. ఇదే సమయంలో బీసీ వర్గానికి ప్రాధాన్యత ఇస్తూ వీరి స్థానం లో కొత్త నియామకాలు చేపట్టారు. చిన్నారెడ్డి స్థానంలో సీనియర్ నేత కేకే కుమార్తె గద్వాల విజయ లక్ష్మికి ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గా బాధ్యతలు అప్పగించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద ను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సురేఖ ను బర్తరఫ్ చేయటం తో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (కుడా) ఛైర్ పర్సన్ గా నియమించారు. ఇక.. సురేఖ స్థానంలో కేబినెట్ లోకి బీసీ వర్గానికి చెందిన మహిళకు అవకాశం ఇవ్వనున్నారు. ఈ స్థానంలో కొత్త మంత్రి గా ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆసక్తి గా మారింది. ఇక.. ఢిల్లీ కేంద్రంగా జరిగిన చర్చల్లో వీరిద్దరి పైనా చర్యలు తీసుకోవాలని రేవంత్ పట్టు బట్టినట్లు తెలుస్తోంది. ఫలితంగా హైకమాండ్ ఆమోదంతో వేటు వేసారు.

## హర్మూజ్ పేరును 'ట్రంప్' జలసంధిగా మారుస్తాం

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 3(జనంసాక్షి): ఇరాన్‌తో యుద్ధం కొనసాగుతున్న వేళ హర్మూజ్ జలసంధి పేరును ట్రంప్ జలసంధిగా మారుస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో ఓ పోస్ట్ పెట్టారు. హర్మూజ్ జలసంధి ఇప్పుడు అమెరికా నియంత్రణలో ఉందని, దానిపేరును ట్రంప్ జలసంధిగా మారిస్తే ఎలా ఉంటుందని అన్నారు. అమెరికా మాదిరిగా అది కూడా మునుపటి కంటే మరింత హాట్‌గా మారుతుందని ట్రంప్ వ్యాఖ్యానించారు. హర్మూజ్ జలసంధిపై సార్వభౌమాధికారం అమెరికాదేనని కొంతకాలంగా ప్రకటనలు చేస్తున్న ట్రంప్ దాన్ని అమెరికాలో కొత్త భూభాగంగా చూపుతూ ఇటీవల సోషల్ మీడియాలో ఓ మ్యాప్‌ను పోస్ట్ చేశారు. ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్‌తో కలిసి ట్రంప్ ప్రారంభించిన యుద్ధానికి ప్రతీకారంగా ప్రపంచ చమురు రవాణాకు కీలకంగా ఉన్న హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేసింది. దీంతో అంతర్జాతీయ చమురు సరఫరాపై ప్రభావం పడే పరిస్థితి ఏర్పడింది. భౌగోళిక ప్రాంతాల పేర్లను మార్చటం ట్రంప్‌నకు ఇదే కొత్తకాదు. కెనడాతో వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో సరిగ్గా వారంక్రితమే లేక్ అంటారియోను లేక్ అమెరికాగా మార్చుస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. అంతకుముందు అమెరికా అధ్యక్షునిగా రెండోసారి అధికారం చేపట్టిన మొదటిరోజే గల్ఫ్ ఆఫ్ మెక్సికోను గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మార్చారు. మరోవైపు ఇరాన్‌పై ప్రారంభించిన యుద్ధం ఎక్కుగా కాలం కొనసాగుతుందని తాను భావించడం లేదని ట్రంప్? అన్నారు. స్థానిక కాలమానం ప్రకారం బుధవారం ఓవల్ ఆఫీస్‌లో మీడియాతో మాట్లాడిన ట్రంప్, హర్మూజ్ జలసంధి చుట్టూ ఇరాన్ ఏర్పాటు చేసిన సైనిక వ్యవస్థలను అమెరికా ధ్వంసం చేసిందని చెప్పారు. హర్మూజ్ జలసంధి వెంబడి రాడార్?, క్షిపణి సంబంధిత వ్యవస్థలతో సహా కొత్తగా ఏర్పాటు చేసిన సైనిక పరికరాలను లక్ష్యంగా చేసుకుని, అమెరికా గత రాత్రి ఇరాన్?పై చాలా తీవ్రమైన దాడి చేసిందని తెలిపారు. అలాగే హర్మూజ్? జలసంధిపై అమెరికాకు బలమైన నియంత్రణ ఉందని అన్నారు. .

## సుప్రీంకోర్టులోనూ ట్రంప్‌నకు ఎదురుదెబ్బ

నిరాకరించాలన్న ట్రంప్ ప్రభుత్వ ప్రయత్నాలకు మరోసారి అడ్డంకి ఏర్పడింది. వాషింగ్టన్ డిసి ఫెడరల్ కోర్టులో జరిగిన ఈ విచారణలో జడ్జి డెబోరా బోర్డ్‌మన్ కీలకమైన అంశాలను ప్రస్తావించారు. ట్రంప్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ నూతన విధానం గత వేసవిలో అమెరికా సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పునకు విరుద్ధంగా ఉందని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు గతంలో స్పష్టం చేసిన మార్గదర్శకాలను ఉల్లంఘించేలా ఈ తాజా ఉత్తర్వులు ఉన్నాయని, ఇవి రాజ్యాంగబద్ధంగా నిలబడే అవకాశం లేదని అభిప్రాయపడ్డారు. అయితే, ఈ తీర్పులో కోర్టు ఒక వెసులుబాటు కూడా కల్పించింది. భవిష్యత్తులో విధానాల అమలుపై ఫెడరల్ ఏజెన్సీలు తమ అంతర్గత మార్గదర్శకాలను సిద్ధం చేసుకోవడానికి మాత్రం అభ్యంతరం చెప్పలేదు. ఈ నిలుపుదల ఉత్తర్వులు ఈ కేసులో పిటిషనర్లుగా పోరాడుతున్న అర్హులైన వర్గానికి మాత్రమే వర్తిస్తాయని కోర్టు స్పష్టం చేసింది. ఒకవేళ ఈ ఉత్తర్వులను నిలిపివేయకపోతే, సుప్రీంకోర్టు గతంలో పౌరులుగా గుర్తించిన చిన్నారులు సైతం జన్మహక్కు పౌరసత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని న్యాయమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, ఈ జడ్జిని మాజీ అధ్యక్షుడు జో బైడెన్ నియమించడం గమనార్హం. అమెరికాలో జన్మించే ప్రతి ఒక్కరికీ పౌరసత్వం కల్పించే 14వ సవరణ నిబంధనలను పరిమితం చేయాలన్నది డొనాల్డ్ ట్రంప్ ఆలోచన. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ అంశాల్లో అజెండాలో ప్రధానాంశంగా పెట్టుకున్నారు. తల్లిదండ్రుల వలసదారుల హోదాతో సంబంధం లేకుండా అమెరికా గడ్డపై పుట్టిన ప్రతీ శిశువుకు పౌరసత్వం లభించే ఈ చట్టానికి పరిమితులు విధించాలని ట్రంప్ మొదటి నుంచీ ప్రయత్నిస్తున్నారు.

# మంత్రివర్గం నుంచి కొండా సురేఖ బర్తరఫ్

ఇదే సమయంలో పరిపాలనాపరమైన, నామినేటెడ్ పదవుల్లో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్‌గా ఉన్న డాక్టర్ జి. చిన్నారెడ్డి నియామకాన్ని రద్దు చేస్తూ సీఎం నిర్ణయం తీసుకున్నారు. ఆయన స్థానంలో గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్, కేకే కుమార్తె గద్వాల్ విజయలక్ష్మిని ప్రణాళికా సంఘం నూతన వైస్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. మహిళా సంబంధిత రంగాలు, అభివృద్ధి సంస్థలకు కూడా నూతన సారథులను ప్రకటిస్తూ ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద నియామకానికి సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన సీనియర్ నేత శారదకు ఈ కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా ఆ వర్గానికి పెద్దపీట వేసినట్లయింది. మరోవైపు ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి సంబంధించి కీలకమైన కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పీఠాన్ని కూడా భర్తీ చేశారు. మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కుడా ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. కొండా సురేఖను తప్పించినందున ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయంలో సుధారాణికి ఈ ప్రాధాన్యత ఇచ్చారు.

కేబినెట్ నుంచి కొండా సురేఖ తొలగింపు మరియు నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ రాష్ట్ర రాజకీయంలో సంచలనంగా మారింది. ప్రభుత్వ నిర్ణయంపై కొండా సురేఖ వర్గీయుల ప్రతిస్పందన ఎలా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారగా, రేవంత్ రెడ్డి మాత్రం తన నిర్ణయాలతో పాలనపై మరియు పార్టీపై తనకున్న పూర్తి పట్టును స్పష్టం చేశారు. రాజీనామా చేయాలని అధిష్టానం సూచించినా వెనక్కి తగ్గని కొండా సురేఖపై నేరుగా బర్తరఫ్ వేటు వేయడం, అదే సమయంలో కీలక నామినేటెడ్ పోస్టులను నింపడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన రాజకీయ, అదే సమయంలో కీలక నామినేటెడ్ పోస్టులను నింపడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన రాజకీయపరిపాలనా ముద్రను బలంగా చాటుకుంది. సురేఖ న్యూఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి, తనపై తీసుకున్న క్రమశిక్షణా చర్యలను తీవ్రంగా ప్రశ్నించిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకుంది. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలపై పార్టీ చర్య తీసుకోవాలనుకుంటే, ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే 'షో-కాజ్ నోటీసు' (వివరణ కోరే నోటీసు) జారీ చేయాలని ఆమె వాదించారు. ముఖ్యమంత్రి, ఇతర కాంగ్రెస్ నాయకులపై సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో, సురేఖపై చర్యలు తీసుకుంది. ఈ వ్యవహారం ఇప్పుడు ముఖ్యమంత్రికి, కొండా కుటుంబానికి మధ్య ప్రత్యక్ష ఘర్షణగా మారింది. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఢిల్లీ పర్యటన ముగించుకుని ఈ సాయంత్రం హైదరాబాద్‌కు తిరిగి వస్తున్నారు. ఆయన శంషాబాద్ విమానాశ్రయం నుండి నల్గొండ క్రాస్ రోడ్స్‌కు చేరుకుని, అక్కడ చంచల్‌గూడ-సంతోష్ నగర్ స్టీల్ ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తారు. అనంతరం అక్కడే జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు.

### కొండా సురేఖ బర్తరఫ్‌కు ఆమోదం

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మంత్రి కొండా సురేఖ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై కాంగ్రెస్ అధిష్ఠానం వేటు వేసింది. ఈ మేరకు హైకమాండ్ నిర్ణయం తీసుకుంది. క్యాబినెట్ నుంచి సురేఖను తొలగించేందుకు అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో సీఎం రేవంత్‌రెడ్డి గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు లేఖ పంపారు. ఆమెను తక్షణమే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీఎం సిఫార్సు చేశారు. గురువారం రాత్రి లోక్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌తో సీఎం రేవంత్ భేటీ అయ్యారు. అనంతరం సీఎం సిఫార్సును గవర్నర్ ఆమోదించారు.

## నన్ను బెదిరిస్తే భయపడను

నాకు తెలుసు. మీరాలం ట్యాంక్‌పై రూ.500 కోట్లతో కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తున్నాం. అది పూర్తయితే పర్యాటకంగా, రవాణాపరంగా ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఇప్పటికే ఆరాంఘర్, మూసారాంబాగ్ వంతెనల నిర్మాణం పూర్తిచేశాం. పాతబస్తీ మెట్రోను పూర్తిచేస్తామని చెప్పాం.. చేసి చూపిస్తాం. నాలాలపై ఆక్రమణలను తొలగించి మురుగు సమస్య లేకుండా చేస్తాం. ఎక్కడైనా పేదల ఇళ్లు తొలగిస్తే.. ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి ఆదుకుంటాం. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తోంది. ప్రతి నెలా రేషన్‌కార్డులపై సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం"అని రేవంత్ అన్నారు.

**రేవంత్‌ను చూసి కాంగ్రెస్‌కు మద్దతు: అసదుద్దీన్**

అంతకుముందు అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ హైదరాబాద్ అభివృద్ధికి అన్నివిధాలుగా సహకరిస్తామని చెప్పారు. సీఎం రేవంత్ నేతృత్వంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలన్నారు. రేవంత్‌ను చూసి కాంగ్రెస్‌కు మద్దతిస్తున్నామని వ్యాఖ్యానించారు. ఆయన తనదైన పంథాలో పరిపాలన చేయాలన్నారు.



# హైకమాండ్‌ను సీఎం రేవంత్ బ్లాక్‌మెయిల్ చేశారు

టీవీ9తో మాట్లాడిన సురేఖ పలు కీలక విషయాలను వెల్లడించారు. తనను తొలగించే ముందు కనీసం ఒక్క మాట కూడా చెప్పలేదని సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. తన వివరణ కూడా తీసుకోలేదని, రాజీనామా చేయాలని కూడా ఎవరూ చెప్పలేదన్నారు. అధిష్ఠానం నుంచి తనకు ఎలాంటి సమాచారం రాలేదని చెప్పారు. తనతో మాట్లాడి వివరణ తీసుకుని ఉండాల్సిందని అన్నారు. తనపై వేం నరేందర్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, కొండల్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి కుట్ర చేశారని సురేఖ ఆరోపించారు. అయితే తదుపరి కార్యాచరణపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. తాను తప్పు చేశాననే భావన లేదన్నారు. తన కుమార్తె కొండా సుస్మిత మాట్లాడిన మాటలను పొంగులేటి సుధాకర్‌రెడ్డి రాజకీయంగా ఉపయోగించుకున్నారని ఆరోపించారు. సుస్మిత స్వతంత్ర వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి అని, ఆమె అభిప్రాయాలను తాము ఖండించాల్సిన అవసరం లేదన్నారు. ఆమెతో తాము మాట్లాడించలేదని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డిని చాలామంది విమర్శిస్తున్నా.. తన విషయంలోనే ఎందుకు ఇంత తీవ్రంగా స్పందించారో సీఎం ఆత్మపరిశీలన చేసుకోవాలని సురేఖ అన్నారు. రేవంత్



పీసీసీ అధ్యక్షుడు కావాలని కోరుకున్నవారిలో తామే ముందున్నామని గుర్తుచేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తర్వాత తాను ఎక్కువగా అభిమానించింది రేవంత్‌రెడ్డినేనని చెప్పారు. ప్రస్తుతం పార్టీ మారే ఆలోచన లేదని సురేఖ స్పష్టం చేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై తమకు అభిమానం ఉందన్నారు. 2018లో కూడా ఇదే "దుష్టశక్తులు" తనకు టికెట్ రాకుండా అడ్డుకున్నాయని, అందుకే అప్పట్లో బీఆర్ఎస్ వైపు చూడాల్సి వచ్చిందని చెప్పారు. అన్ని విషయాలను కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు వివరించినట్లు వెల్లడించారు. ఉరిశిక్ష పడిన ఖైదీని కూడా చివరి కోరిక అడుగుతారన్న కొండా సురేఖ తనను మాత్రం ఏ వివరణ అడగకుండానే తొలగించారని, తనను ఇలా ఏకపక్షంగా తొలగించటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తనను తొలగించడం అధిష్ఠానానికి కూడా ఇష్టం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పట్టుబట్టి తనని బర్తరఫ్ చేయిస్తున్నారని, 'బర్తరఫ్ చేస్తారా? నన్ను వెళ్లిపోమ్మంటారా' అని అధిష్ఠానాన్ని బ్లాక్‌మెయిల్ చేశారని ఆమె ఆరోపించారు. తన మీద, తన మాజీ ఓఎస్డీ మీద కుట్రలు చేస్తున్నారని, దీని వెనక వేం నరేందర్‌రెడ్డి, పొంగులేటి, కొండల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మరికొందరు ఉన్నారన్నారు. అందరూ కలిసి కావాలని కక్షగట్టి నన్ను, సుమంత్ కుటుంబాన్ని వేధించారని విమర్శించారు. సుమంత్‌పై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## సీఎంకు బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరమేంటి?

హైదరాబాద్(జనంసాక్షి): మంత్రి పదవి నుంచి కొండా సురేఖ బర్తరఫ్ ఆమె స్వయం కృతాపరాధమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఆమెకు కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం అనేక అవకాశాలు ఇచ్చినట్లు చెప్పారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో విడుదల చేశారు. "కుటుంబ సభ్యులను కొండా సురేఖ అదుపులో పెట్టుకోలేకపోయారు. ఈ విషయంలో ఆమె విఫలమయ్యారు. సీఎం రేవంత్ రెడ్డిపై పదేపదే విమర్శలు చేసి ప్రభుత్వాన్ని, పార్టీని బలహీనపర్చే ప్రయత్నం చేశారు. కొండా సురేఖ వ్యవహార శైలిని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేతలు సోనియా, రాహుల్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సమగ్రంగా పరిశీలించారు. క్రమశిక్షణారాహిత్యాన్ని సహించవద్దనే ఈ నిర్ణయం తీసుకున్నారు. అధిష్ఠానాన్ని సీఎం రేవంత్ బ్లాక్‌మెయిల్ చేశారని కొండా సురేఖ అబద్ధాలు చెబుతున్నారు. సీఎంకు ఆ అవసరమేంటి? ఆమెకు ఇచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేదు. పదే పదే తప్పులు చేశారు. ముఖ్యమంత్రిపై కుటుంబసభ్యులు తీవ్ర ఆరోపణలు చేస్తుంటే కనీసం వారించలేదు. గతంలోనూ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే సీఎం సర్దుకుపోయారు. ఇప్పుడు కూడా నోటికొచ్చినట్లు మాట్లాడినా సీఎం ఎక్కడా బయటపడలేదు. సోనియా, రాహుల్‌పై గౌరవముంటే కాంగ్రెస్‌ను బలహీనపర్చే పనులు ఎందుకు చేశారు? కొండా సురేఖతో పాటు సీనియర్ నేత చిన్నారెడ్డిని కూడా పదవి నుంచి తప్పించారు. సీఎంకు చిన్నారెడ్డి చాలా ఇష్టమైన నాయకుడు. కానీ పార్టీకి నష్టం కలిగిస్తే ఎవరైనా ఒక్కటేనని సీఎం రేవంత్ భావించారు. పార్టీ, ప్రభుత్వాన్ని బలహీనపర్చే చర్యలను ఉపేక్షించబోమని అధిష్ఠానం స్పష్టం చేసింది" అని ఆది శ్రీనివాస్ అన్నారు.

## మా వస్తువులకు తక్కువ టారిఫ్‌లను ప్రతిపాదిస్తేనే!

ఎగుమతి అవకాశాలను తెరుస్తున్నాయని పీయూశ్ గోయల్ తెలిపారు. రానున్న నెలలు, సంవత్సరాల్లో మరిన్ని దేశాలతో వాణిజ్య ఒప్పందాలను పూర్తి చేసుకునే దిశగా భారత్ ముందుకు సాగుతోందన్నారు. ఈ క్రమంలో కెనడా, మెక్సికో, చిలీ, బ్రెజిల్ నేతృత్వంలోని మెర్కోసూర్ కూటమి, సదరన్ ఆఫ్రికన్ కస్టమ్స్ యూనియన్ గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ), ఇజ్రాయెల్ తదితర దేశాలు, కూటములతో వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. తొమ్మిది దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల ప్రపంచ వాణిజ్యంలో దాదాపు మూడింట రెండొంతుల మార్కెట్‌లోకి భారత్ వస్తువులకు నేరుగా ప్రవేశం లభిస్తోందని వెల్లడించారు.

**కీలక అంశాలపై చర్చలు**

భారత్, అమెరికా కొంతకాలంగా పరస్పర ప్రయోజనకరమైన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుపుతున్నాయి. ఇటీవల అమెరికా వాణిజ్య ప్రతినిధి అంబాసిడర్ జేమీసన్ గ్రీర్ జూన్ 22 నుంచి 24 వరకు దిల్లీ పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా పీయూశ్ గోయల్‌తో కలిసి బీటీఏకు సంబంధించిన కీలక అంశాలను సమీక్షించారు. ఇరు దేశాల మధ్య మార్కెట్ యాక్సెస్, డిజిటల్ వాణిజ్యం, సరఫరా వ్యవస్థ స్థిరత్వం, నాన్-టారిఫ్ అడ్డంకుల తగ్గింపు, వ్యూహాత్మక రంగాల్లో సహకారం వంటి అంశాలపై చర్చలు జరిగాయి. చర్చల్లో గణనీయమైన పురోగతి సాధించినట్లు ఇరు దేశాల ప్రతినిధులు పేర్కొన్నారు. వ్యాపారులు, రైతులు, కార్మికులు, వినియోగదారులకు స్పష్టమైన ప్రయోజనాలు చేకూరేలా సమతుల్యమైన, వాణిజ్యపరంగా అర్థవంతమైన ఒప్పందాన్ని కుదుర్చుకోవాలన్న నిబద్ధతను ఇరు దేశాలు పునరుద్ఘాటించాయి.

**ఫిబ్రవరిలోనే ఒప్పందానికి ఫ్రేమ్‌వర్క్**

భారత్, అమెరికా ఈ ఏడాది ఫిబ్రవరిలో పరస్పర ప్రయోజనకరమైన వాణిజ్యానికి సంబంధించిన ఇంటరిమ్ అగ్రిమెంట్ కోసం ఒక ఫ్రేమ్‌వర్క్‌ను ప్రకటించాయి. అదే సమయంలో విస్తృత స్థాయిలో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం దిశగా చర్చలు కొనసాగించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి. జూన్‌లో అమెరికా వాణిజ్య ప్రతినిధి నేతృత్వంలోని బృందం భారత్‌కు రావడంతో చర్చలు మరింత ముందుకు సాగాయి. అయితే తుది ఒప్పందం విషయంలో భారత్ తన పోటీ దేశాలతో పోలిస్తే మెరుగైన సుంక ప్రయోజనాలపై పట్టుబడుతున్నట్లు గోయల్ తాజా వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

## సాగర్ నీళ్లివ్వండి.. లేదంటే పాదయాత్ర చేస్తా

పంటలకు నీళ్లు వచ్చాయని అన్నారు. ఈ సీజన్‌లో నాగార్జునసాగర్‌లో 180 టీఎంసీల నీరు ఉన్నదని, ఆ నీటిని విడుదల చేయడానికి సంపూర్ణ అవకాశం ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనను తెలంగాణ ప్రజలు చూశారని కేటీఆర్ అన్నారు. వెయ్యి రోజుల దుష్టపరిపాలన నిన్నటితో పూర్తయిందని, కేసీఆర్ పాలనలో రైతుల పరిస్థితి ఎలా ఉండేదో ఇప్పుడు ఎలా ఉందో ప్రజలు గమనించాలని కోరారు.

# ఆది నుంచి అన్నీ వివాదాలే..

అనంతరం ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేసి వైఎస్సార్ కాంగ్రెస్ తరఫున పరకాల ఉప ఎన్నికలో పోటీ చేశారు. అయితే తెలంగాణ ఉద్యమం పతాకస్థాయిలో ఉన్న సమయంలో సమైక్యవాద రాజకీయ వైఖరితో బరిలోకి దిగడం ఆమెకు తీవ్ర ప్రతికూలంగా మారింది. టీఆర్ఎస్ అభ్యర్థి చేతిలో ఓటమి పాలయ్యారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు దూరంగా తీసుకున్న రాజకీయ నిర్ణయానికి పరకాల ఫలితం ఒక గట్టి రాజకీయ గుణపాఠంగా మారింది.

**పార్టీ మార్పులు.. తిరిగి అధికారంలోకి**

వైఎస్సార్ కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చిన సురేఖ 2014లో టీఆర్ఎస్‌లో చేరి వరంగల్ తూర్పు నుంచి విజయం సాధించారు. 2018లో టీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. అదే ఏడాది పరకాల నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2023లో వరంగల్ తూర్పు నుంచి విజయం సాధించి కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా వివాదాలు ఆమెను వీడలేదు.

**మంత్రిగా ఉన్నా.. వ్యాఖ్యల వివాదాలు**

2024లో సమంత నాగచైతన్య విడాకుల అంశాన్ని రాజకీయంగా ప్రస్తావిస్తూ కేటీఆర్‌ను ఉద్దేశించి సురేఖ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. సినీ రంగానికి చెందిన పలువురు ఆమె వ్యాఖ్యలను తప్పుబట్టారు. అనంతరం వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నప్పటికీ.. వివాదం న్యాయస్థానం వరకు వెళ్లింది. మంత్రిగా ఉన్న వ్యక్తి బహిరంగ వ్యాఖ్యల్లో సంయమనం పాటించాల్సిన అవసరంపై ఈ వ్యవహారం చర్చకు దారితీసింది. మాజీ ఓఎస్డీ సుమంత్ చుట్టూ చోటుచేసుకున్న పరిణామాలు కూడా రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. ఆయనపై నమోదైన కేసులు, ప్రభుత్వ చర్యలు తదితర అంశాలు సురేఖ చుట్టూ మరోసారి రాజకీయ చర్చకు కారణమయ్యాయి.

**కుమార్తె వ్యాఖ్యలు.. కేబినెట్‌కు గుడ్‌బై**

ఇప్పుడు సురేఖ కుటుంబం కేంద్రంగా మరో వివాదం తెరపైకి వచ్చింది. గీసుకొండలో జరిగిన కార్యక్రమంలో ఆమె కుమార్తె కొండా సుస్మిత పటేల్ సీఎం రేవంత్‌రెడ్డిపై అసంతృప్తి వ్యక్తం చేయడంతోపాటు.. పరకాల నుంచి తానే పోటీ చేస్తానని, పార్టీ టికెట్ ఇవ్వకపోయినా స్వతంత్రంగా బరిలోకి దిగుతానని ప్రకటించారు. ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకత్వం తీవ్రంగా పరిగణించినట్లు పరిణామాలు సూచిస్తున్నాయి. టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ వ్యవహారంలోకి రావడం, అనంతరం సురేఖను కేబినెట్ నుంచి తప్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించినట్లు సమాచారం రావడం రాజకీయంగా కలకలం రేపింది. సెప్టెంబర్ 3న సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు సిఫారసు పంపినట్లు సమాచారం. గవర్నర్ ఆమోద ప్రక్రియ పూర్తయితే ఆమె కేబినెట్ నుంచి వైదొలగడం అధికారికం కానుంది.

**ఓర్పు లేని దూకుడు..**

**వరుస రాజకీయ ఎదురుదెబ్బలు**

కొండా సురేఖ రాజకీయ ప్రస్థానంలో మలుపులు అనేకం. కానీ వాటిలో చాలావరకు వివాదాలతోనే ముడిపడి ఉన్నాయి. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా ఉన్న సమయంలో ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా జగన్ వెంట నిలవడం.. మహబూబాబాద్ ఘర్షణ.. పరకాల ఓటమి.. పార్టీ మార్పులు.. సమంత?నాగచైతన్య వ్యవహారంలో వ్యాఖ్యలు.. ఓఎస్డీ వివాదం.. ఇప్పుడు కుమార్తె రాజకీయ ప్రకటనతో కేబినెట్ సంక్షోభం.. రాజకీయాల్లో ఓర్పు, సంయమనం, సమన్వయం ఎంత ముఖ్యమో ఆమె ప్రయాణం మరోసారి గుర్తుచేస్తోంది. తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడుతున్న కీలక సమయంలో వారి ఆకాంక్షలకు దూరంగా జగన్ రాజకీయ వైఖరిని ఎంచుకోవడం ఆమె రాజకీయ జీవితంలో చెరగని ప్రతికూల ముద్రగా మిగిలింది. ఆ తర్వాత కూడా వివాదాస్పద నిర్ణయాలు, వ్యాఖ్యలు, కుటుంబ రాజకీయ పరిణామాలు ఆమెకు ఇబ్బందులు తెచ్చిపెట్టాయి. జగన్ కోసం ఒకప్పుడు మంత్రి పదవిని వదిలిన సురేఖ.. ఇప్పుడు కుటుంబ రాజకీయ పరిణామాల కారణంగా అదే మంత్రివర్గం నుంచి బయటకు వెళ్లే పరిస్థితికి చేరుకోవడం ఆమె రాజకీయ ప్రస్థానంలో అత్యంత వ్యంగ్యమైన మలుపుగా మారింది.

## భారత ఆర్థిక వృద్ధి వల్ల ప్రపంచానికి కొత్త అవకాశాలు

చర్చలు జరిగాయి. అందులో వాణిజ్యం, రక్షణ, కీలక ఖనిజాలు, క్లీన్ ఎనర్జీ, అధునాతన సాంకేతికత వంటి అంశాలపై ప్రధానంగా చర్చించారు. రెండు దేశాల మధ్య సహకారాన్ని మరింత విస్తరించేందుకు పలు నిర్ణయాలు తీసుకున్నారు. చర్చల అనంతరం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోదీ ప్రపంచ పరిస్థితులు, భారత్ ఆర్థిక ప్రగతి, శాంతి-భద్రత వంటి అంశాలపై మాట్లాడారు. ప్రస్తుతం ప్రపంచం తీవ్ర మార్పులు, అనిశ్చితితో కూడిన పరిస్థితులను ఎదుర్కొంటోందని అన్నారు. ఆహారం, ఇంధనం, సరఫరా వ్యవస్థల నుంచి దాదాపు ప్రతి రంగంపైనా అంతర్జాతీయ పరిణామాల ప్రభావం పడుతోందని మోదీ పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో ఘర్షణలు కొనసాగుతున్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ తన వేగాన్ని కొనసాగిస్తోందని చెప్పారు. ఇటీవల ముగిసిన త్రైమాసికంలో భారత్ 7.8 శాతం ఆర్థిక వృద్ధిని నమోదు చేసిందని వెల్లడించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో భారత్ వృద్ధి కొనసాగడం సానుకూల పరిణామమని పేర్కొన్నారు. దేశ ఆర్థిక ప్రగతి ఇప్పుడు ప్రపంచానికి విశ్వాసాన్ని కలిగించడంతో పాటు కొత్త అవకాశాలకు దారితీస్తోందని మోదీ అన్నారు. ఇక ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న యుద్ధాలు, ఉద్రిక్తతలపైనా ఇరువురు నేతలు చర్చించారు. ఉక్రెయిన్, పశ్చిమాసియా ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులపై భారత్ వైఖరిని మోదీ మరోసారి స్పష్టం చేశారు. అంతర్జాతీయ వివాదాలకు చర్చలు, దౌత్యం, న్యాయపాలన ఆధారంగా పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉందన్నారు. ఉక్రెయిన్ లేదా పశ్చిమాసియా అయినా ఘర్షణలు త్వరగా ముగిసి శాంతి నెలకొనేందుకు చేపట్టే ప్రయత్నాలకు భారత్?, బెల్జియం మద్దతు ఇస్తాయని తెలిపారు. ఉగ్రవాదంపై కూడా ఇరుదేశాలు ఒకే వైఖరిని కలిగి ఉన్నాయని మోదీ చెప్పర్లు. ఉగ్రవాదాన్ని ఏ రూపంలో ఉన్నా నిర్మూలించేందుకు కలిసి పనిచేయడం రెండు దేశాల ఉమ్మడి బాధ్యతగా పేర్కొన్నారు. భారత్?, బెల్జియం మధఅయ భవిష్యత్ సహకారంలో క్లీన్ ఎనర్జీ, సురక్షితమైన సరఫరా వ్యవస్థలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. పునరుత్పాదక ఇంధన రంగానికి సంబంధించి ఇరుదేశాల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఇది సుస్థిర ఇంధన రంగంలో ద్వైపాక్షిక భాగస్వామ్యానికి మరింత ఊతమిస్తుందని మోదీ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా కీలక ఖనిజాలకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ రంగంపైనా ఇరుదేశాలు దృష్టి సారించాయి. ఖనిజాల ప్రాసెసింగ్, రీసైక్లింగ్‌లో సహకారాన్ని పెంచుకోవాలని నిర్ణయించినట్లు ప్రధాని తెలిపారు. సరఫరా వ్యవస్థలను బలోపేతం చేసేందుకు ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. అధునాతన సాంకేతిక రంగంలోనూ భారత్, బెల్జియం మధ్య సహకారానికి విస్తృత అవకాశాలున్నాయని ప్రధాని మోదీ చెప్పారు. ముఖ్యంగా సెమీకండక్టర్ రంగంలో బెల్జియం సాంకేతిక నైపుణ్యం, భారత్ వద్ద ఉన్న విస్తృత స్థాయి ఉత్పత్తి సామర్థ్యం ఒకదానికొకటి అనుకూలంగా ఉంటాయని పేర్కొన్నారు. రక్షణ రంగంలోనూ భాగస్వామ్యాన్ని పెంచుకునేందుకు ఇరుదేశాలు ఆసక్తి చూపాయి.

## .యువత గొంతు నొక్కితే ప్రజలకు సమాధానం చెప్పాల్సిందే

ఆరోపించారు. ఈ ఘటనల్లో పలువురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలని కలలు కన్న ఓ యువకుడి కాలికి ఏకే-47 బుల్లెట్ తగిలిందని పేర్కొన్నారు. ఆ బుల్లెట్ అతడి కాలినే కాకుండా జీవితాంతం కన్న సైనికుడిగా మారాలన్న కలను కూడా ఛిద్రం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

'ఇంతటి బలప్రయోగం ఎందుకు?'

విద్యార్థుల కోరింది న్యాయమైన అవకాశాలు, పారదర్శకమైన పరీక్షా వ్యవస్థ, తమ హక్కులేనని రాహుల్ గాంధీ అన్నారు. ఇలాంటి డిమాండ్లతో నిరసన చేస్తున్న యువతపై లాఠీలు, తుపాకీ కాల్పులు జరపాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఈ ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. కేవలం కొందరు కింది స్థాయి అధికారులపై నిందలు వేసి ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పించుకోలేదని స్పష్టం చేశారు. ఇంతటి తీవ్ర బలప్రయోగం ఉన్నతస్థాయి ఆదేశాల ఫలితమైనా, లేదా పరిపాలనా వ్యవస్థ పూర్తిగా విఫలమైందనడానికి నిదర్శనమైనా కావచ్చని వ్యాఖ్యానించారు. బిహార్ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా ఆందోళన చేస్తున్న యువతకు తాను అండగా ఉంటానని తెలిపారు. వారికి అవసరమైన ప్రతి సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నానని హామీ ఇచ్చారు. యువత గొంతును అణచివేసే ఏ పాలన అయినా చివరకు ప్రజలకు సమాధానం చెప్పాల్సిందేనని, ఆ రోజు ఎంతో దూరంలో లేదంటూ వ్యాఖ్యలు చేశారు.

# ల్యాండ్ మైన్ పేలి గిరిజనుడు మృతి

- వెంకటాపురం మండలంలో విషాదం



**నూగూర్ వెంకటాపురం సెప్టెంబర్ 03 (జనం సాక్షి) :** ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో విషాద ఘటన చోటు చేసుకుంది. చూడకుండా ల్యాండ్ మైన్ పై కాలు వేయడంతో ఓ గిరిజనుడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. నూగూరు గ్రామ పంచాయతీ పరిధిలోని కంచె కాలనీ గ్రామానికి మడకం గ్రామానికి చెందిన మడకం నాగేశ్వరావు 55సంవత్సరాలు,అనే గిరిజనవ్యక్తి కర్రె గుట్టలపై అడవిలోకి వెదురు బొంగుల కోసం వెళ్లిన సమయంలో అనుకోకుండా ల్యాండ్ మైన్ పై కాలు వేశాడు. దీంతో ఒక్కసారిగా మైన్ పేలి తీవ్ర గాయాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు.అతడి వెంట ఉన్న మరో ముగ్గురు వ్యక్తులు క్షత గాత్రున్ని డోలి మోతతో గుట్ట పై నుండి ఇంటి వద్ద కు తీసుకొచ్చే వరకు రాత్రి 3:00గంటల సమయం పట్టిందని తెలిపారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకుని విషాదంలో మునిగిపోయారు. గతం లో మావోయిస్టులు అమర్చిన మైన్ అయి ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అటవీ ప్రాంతంలో ఇంకా ఇలాంటి పేలుడు పదార్థాలు ఉండవచ్చని, గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ ముత్యం రమేష్ తెలిపారు . మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# ప్రతిష్ఠాత్మక తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారం అందుకున్న గవర్నర్ సంయుక్త కార్యదర్శి



**హైదరాబాద్, సెప్టెంబర్ 3 (జనంసాక్షి) :** ప్రముఖ కవి, తెలంగాణ గవర్నర్ సంయుక్త కార్యదర్శి, సీనియర్ గ్రూప్-1 అధికారి శశికిరణ్ కొమాండూర్ రచించిన పద్య మహాకావ్యం 'శ్రీమద్రామాయణం' ప్రతిష్ఠాత్మక 2024 సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారాన్ని అందుకుంది. హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం డాక్టర్ ఎన్‌టిఆర్ కళాభవన్‌లో గురువారం నిర్వహించిన పురస్కార ప్రదానోత్సవంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ డా. నందిని సిధారెడ్డి శ్రీ శశికిరణ్ కొమాండూర్‌కు పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మరో తొమ్మిది మంది ఉత్తమ రచయితలకు కూడా సాహితీ పురస్కారాలను అందజేశారు. రామాయణ ఇతివృత్తాన్ని పద్య మహాకావ్యంగా మలిచిన 'శ్రీమద్రామాయణం'కు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించడం తెలుగు సాహిత్య రంగంలో విశేష గుర్తింపుగా నిలిచింది.

# బీసీ మహిళ కాబట్టే వేటు వేశారు

- సురేఖ బర్తరఫ్ పై శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబర్3 (జనంసాక్షి) :** తెలంగాణ కేబినెట్ నుంచి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను బర్తరఫ్ చేయాలనే అంశంపై ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకత్వం తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ఒక బీసీ మహిళా మంత్రిని పదవి నుంచి తొలిగించాలనుకోవడం దారుణమని, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 1000 రోజుల పాలనకు నిరసనగా నారాయణపేట జిల్లా కోస్గిలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన 'బీఆర్ఎస్ రైతు గర్జన' సభలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో ఎంతోమంది ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు నిత్యం ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా బహిరంగంగానే మాట్లాడుతు న్నారని, కానీ కేవలం ఓ బీసీ మహిళా నాయకురాలిని మాత్రమే లక్ష్యంగా చేసుకుని పదవి నుంచి తొలగించడం కాంగ్రెస్ వైఖరికి అద్దం పడుతోందని శ్రీనివాస్ గౌడ్ మండిప డ్డారు. సొంత పార్టీ మంత్రుల్లో కొందరికి ఒక న్యాయం, కొండా సురేఖకు మరొక న్యాయమా? అని నిలదీశారు. ప్రస్తుత కేబినెట్‌లోని పలువురు మంత్రులపై అవినీతి, కమీషన్ల ఆరోపణలు వెల్లువెత్తు తున్నా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోని ప్రభుత్వం, సురేఖ విషయంలో మాత్రం ఇంత కఠినంగా వ్యవహరించడం వెనుక బీసీ వ్యతిరేక ఆలోచనా ధోరణి ఉందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీసీలను అనేక రకాలుగా మోసం చేస్తూ వస్తోందని, పదవుల తొలగింపులోనూ బడుగు, బలహీన వర్గాల నేతలనే బలిపశువులను చేస్తున్నారని విమర్శించారు. కొండా సురేఖ ఉద్వాసన కాంగ్రెస్ పార్టీ అంతర్గత విషయమైనప్పటికీ, బీసీ నాయకురాలికి జరిగిన ఈ అన్యాయాన్ని ప్రజలు, బీసీ వర్గాలు గమనిస్తున్నాయని అన్నారు.

# పంజాబ్ సీఎంపై బీజేపీ సంచలన ఆరోపణలు

- 5 కోట్లకు రేప్ కేసులు సెటిల్ చేస్తున్నారు
- ఆడియో క్లిప్‌లను విడుదల చేసిన బీజేపీ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2 (జనంసాక్షి) :** పంజాబ్ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేగింది. ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఆయన భార్య గురుప్రీత్ కౌర్‌పై బీజేపీ సంచలన ఆరోపణలు చేసింది. మధ్యవర్తుల ద్వారా అత్యాచారం కేసులను రూ.5 కోట్లకు సెటిల్ చేస్తున్నారని ఆరోపించింది. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ గురువారం మీడియా సమావేశంలో ఈ ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా కొన్ని ఆడియో క్లిప్‌లను కూడా భండారీ విడుదల చేశారు. అందులో ఓ వ్యక్తి తన రాజకీయ పలుకుబడిని ప్రస్తావిస్తూ అత్యాచారం, ఇతర క్రిమినల్ కేసులను పరిష్కరించగలమన్నట్లు మాట్లాడుతున్నారని బీజేపీ తెలిపింది. అయితే ఈ ఆడియోలో భగవంత్ మాన్, గురుప్రీత్ కౌర్ పేర్లు ఎక్కడా ప్రస్తావనకు రాలేదు. ఆ క్లిప్‌ల ఆధారంగానే సీఎం పాత్రపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని బీజేపీ పేర్కొంది. ఈ వ్యవహారం ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లుయెన్సర్ గుర్విందర్ సింగ్ చాహల్ కేసుతో ముడిపడి ఉంది. ఓ మహిళను అపహరించి అత్యాచారం చేశారనే ఆరోపణలపై చాహల్‌ను పంజాబ్ పోలీసులు కొన్ని నెలల క్రితం అరెస్టు చేశారు. అయితే ఈ వారం ప్రారంభంలో ఆయన్ను పోలీసులు విడుదల చేశారు. దీనిపై కూడా రాజకీయ విమర్శలు వెల్లువెత్తాయి. "భగవంత్ మాన్, ఆయన భార్య మధ్యవర్తుల ద్వారా డబ్బులు వసూలు చేస్తూ కేసులను సెటిల్ చేస్తున్నారని" భండారీ ఆరోపించారు. రూ.5 కోట్లకు అత్యాచారం కేసులను పరిష్కరిస్తున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి నివాసం నుంచే ఇలాంటి వ్యవహారాలు నడుస్తున్నాయా? అని బీజేపీ ప్రశ్నించింది. ఈ ఆరోపణలపై పంజాబ్ ప్రభుత్వం, భగవంత్ మాన్ నుంచి తక్షణ స్పందన వెలువడినట్లు సమాచారం లేదు. దీంతో ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో మరింత చర్చకు దారితీసింది.

# నల్సార్ యూనివర్సిటీ విద్యార్థులకు భారీ ఊరట

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3 (జనంసాక్షి) :** న్యాయ విద్యార్థులపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే చట్టపరమైన అధికారం భారత బార్ కౌన్సిల్ (బీసీఐ)కు లేదని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. ఈ మేరకు నల్సార్ యూనివర్సిటీ విద్యార్థులకు భారీ ఊరటనిస్తూ కీలక తీర్పు వెలువరించింది. బీసీఐ అధికార పరిధి కేవలం న్యాయవాదులుగా నమోదైన వారికి మాత్రమే పరిమితమని, విద్యార్థి దశలో ఉన్నవారికి ఇది వర్తించదని ధర్మాసనం తేల్చి చెప్పింది. నల్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ కొందరు విద్యార్థులు లేఖ రాశారు. ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించిన బీసీఐ ఛైర్మన్ మనన్ కుమార్ మిశ్రా, మూడు రోజుల్లోగా నివేదిక సమర్పించాలని నల్సార్ వైస్-ఛాన్సలర్‌ను ఆదేశించారు. అంతటితో ఆగకుండా, నల్సార్ 2026 బ్యాచ్‌కు చెందిన ఏ విద్యార్థినీ న్యాయవాదిగా నమోదు చేసుకోవద్దని దేశంలోని రాష్ట్రాల బార్ కౌన్సిళ్లకు సర్క్యులర్ జారీ చేశారు. ఈ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు రావడంతో మనన్ కుమార్ మిశ్రా ఆ ఉత్తర్వులను ఉపసంహరించుకున్నారు. అయినప్పటికీ, ఈ అంశాన్ని సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టింది.

# ఉచిత శిక్షణతో యువత ఉద్యోగ కలలకు తోడ్పాటు

- విజయం సాధించే వరకు ప్రయత్నం చేయాలి
- ప్రజలకు భరోసానిచ్చే పోలీస్ అధికారులుగా ఎదగాలి
- మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 03(జనంసాక్షి) :** నిరుద్యోగ యువత ఉద్యోగ కలలను సాకారం చేసేందుకు ఉచిత శిక్షణ ద్వారా తోడ్పాటు అందిస్తున్నామని, అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పోలీస్ ఉద్యోగాలు సాధించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం ములుగు ఆర్డీఓ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి అనసూయ సీతక్క కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాలకు ఉచిత శిక్షణ పొందనున్న అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ చదువుకొని ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతీ యువకులకు తగిన ప్రోత్సాహం, శిక్షణ అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఉద్యోగ ప్రకటన వెలువడిన వెంటనే జిల్లా ఎస్పీతో చర్చించి ఉచిత శిక్షణ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. శిక్షణ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లలో పూర్తి సహకారం అందించిన జిల్లా కలెక్టర్‌ను అభినందించారు. టాస్క్ సౌజన్యంతో అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించేందుకు ముందుకొచ్చిన విశ్వనాథ్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులను మంత్రి అభినందించారు. పోలీస్ ఉద్యోగాల ఎంపికలో శారీరక ప్రమాణాలు కీలకమైనందున అభ్యర్థులు కష్టపడి సిద్ధమైన తర్వాత కొలతల కారణంగా అనర్హులు కాకుండా ముందుగానే పరిశీలన చేపట్టినట్లు తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక శారీరక కొలతలు పరిశీలించి శిక్షణకు ఎంపిక చేసిన 250 మంది అభ్యర్థులను అభినందించారు. శిక్షణ పొందుతున్న ప్రతి ఒక్కరూ పట్టుదలతో చదివి ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించాలన్నదే తన ఆకాంక్ష అని పేర్కొన్నారు. ములుగు నియోజకవర్గ పరిధిలోని ఇతర జిల్లాలకు చెందిన యువతకు కూడా శిక్షణ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలోని గంగారం, కొత్తగూడ మండలాల యువత కోసం అక్కడి కలెక్టర్, ఎస్పీతో మాట్లాడామని, ఆ జిల్లాలో కూడా శిక్షణ ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. భూపాలపల్లి జిల్లాలో ఉన్న నియోజకవర్గ పరిధిలోని ఐదు గ్రామాల యువతకు కూడా అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు గతంలో ఉద్యోగ మేళా నిర్వహించామని, ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విజయం సాధించే వరకు ప్రయత్నం కొనసాగించాలని, రాత పరీక్షలోనైనా, శారీరక సామర్థ్య పరీక్షల్లోనైనా ఆశించిన ఫలితం రాకపోతే నిరుత్సాహపడకుండా మళ్లీ ప్రయత్నించాలని సూచించారు. కుటుంబ బాధ్యతలకు సమయం కేటాయిస్తూనే చదువుకు, శారీరక సాధనకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పోషకాహారం తీసుకుంటూ క్రమం తప్పకుండా సాధన చేయాలని, శిక్షణ సమయంలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తనకు లేదా డీఎస్పీకి తెలియజేయాలని సూచించారు. ఇప్పుడు కష్టపడి ఉద్యోగం సాధిస్తే భవిష్యత్తులో కుటుంబానికి అండగా నిలవగలుగుతారని తెలిపారు. పోలీస్ ఉద్యోగానికి మార్కులు, శారీరక దృఢత్వంతోపాటు మానసిక సామర్థ్యం, క్రమశిక్షణ, మంచి ప్రవర్తన కూడా అవసరమని మంత్రి పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలు తమకు రక్షణ, భరోసా లభిస్తుందనే నమ్మకంతో ఉండేలా సేవలందించాలన్నారు. అందుకు అవసరమైన మానవీయ దృక్పథాన్ని శిక్షణ దశ నుంచే పెంపొందించుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని, ప్రజలకు భరోసానిచ్చే పోలీస్ అధికారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో విజయానికి ప్రతిభతోపాటు నిరంతర సాధన, పట్టుదల ఎంతో అవసరమని అన్నారు. అభ్యర్థులు తొలి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో పూర్తి స్థాయిలో కృషి చేయాలని సూచించారు. ప్రతిరోజూ తమ అభ్యసన పురోగతిని పరిశీలించుకుంటూ, నిరుత్సాహాన్ని అధిగమించి సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. గత పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలను పరిశీలించి, వాటికి అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా సాధన చేయాలని, చదివిన అంశాలను పునశ్చరణ చేయాలని సూచించారు. ఉద్యోగం సాధించిన తర్వాత కూడా ఇదే క్రమశిక్షణ, నిలకడను కొనసాగించాలని, అభ్యర్థులకు జిల్లా యంత్రాంగం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీ, స్థానిక పోలీస్ అధికారుల సహకారంతో పోలీస్ శాఖ నిబంధనల ప్రకారం 300 మంది అభ్యర్థుల శారీరక కొలతలను పరిశీలించగా, 250 మంది శిక్షణకు ఎంపికైనట్లు వెల్లడించారు. అభ్యర్థులకు అధ్యయన సామగ్రితోపాటు రాత పరీక్ష, శారీరక సామర్థ్య పరీక్షలకు అవసరమైన శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులను రెండు బృందాలుగా విభజించి శిక్షణ ఇస్తామని, దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి, స్థానికంగా వసతి లేని వారికి వసతి సౌకర్యం కల్పిస్తామని మంత్రి తెలిపారు. అందిస్తున్న శిక్షణకు అభ్యర్థుల సొంత సాధన, కృషి తోడైతే విజయాన్ని అందుకోగలుగుతారని అన్నారు. ప్రతి ఒక్కరూ ఉద్యోగం సాధించి కుటుంబాలకు అండగా నిలవడంతోపాటు ప్రజల రక్షణలో భాగస్వాములు కావాలని ఆకాంక్షిస్తూ అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్, ములుగు సీఐ, పసర సీఐ, పోలీస్ సిబ్బంది, అభ్యర్థులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కుట్టు మిషన్ల పథకం వేగవంతం కావాలి



- బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష
- దోభీ ఘాట్ ల ఏర్పాటుకు అధికారులకు ఆదేశం

**హైదరాబాద్, సెప్టెంబర్ 3 (జనంసాక్షి) :** తెలంగాణా రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చెయ్యాలని తెలంగాణా సర్కార్ సంకల్పించింది. ఈ క్రమంలో మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు అనేక కీలక నిర్ణయాలను తీసుకుంటుంది. ఈ క్రమంలోనే తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం బీసీల కోసం అమలు చేస్తున్న కుట్టు మిషన్ల పథకం వేగవంతం కావాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో ప్రభుత్వ పథకాలు, కీలక అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన, ప్రొక్యూర్‌మెంట్ ప్రక్రియను ఈ నెల 7వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.ఈ పథకం కింద ఇప్పటికే సుమారు 1.80లక్షల దరఖాస్తులు వచ్చినట్లు మంత్రి వెల్లడించారు. దరఖాస్తుల స్వీకరణ గడువు 15వ తేదీ వరకు కొనసాగుతుందని గుర్తు చేశారు. అర్హులైన మహిళలకు త్వరితగతిన కుట్టుమిషన్లు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇదే సమయంలో కల్యాణలక్ష్మి పథకంపై హైకోర్టు విధించిన స్టే ఇటీవల ఎత్తివేయడంతో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని కూడా మంత్రి ఆదేశించారు. బీసీ గురుకుల సొసైటీ పరిధిలో 327 గురుకులాలు ఉన్నాయని, వాటిలో కేవలం 22 పాఠశాలలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. మిగిలిన గురుకులాలకు అవసరమైన స్థలాలు, భవనాల వివరాలపై సమగ్ర నివేదికను ఈ నెల 15లోగా సమర్పించాలని ఆర్సీవోలను ఆదేశించారు. ప్రతి గ్రామంలో గీత కార్మికుల రక్షణ కోసం కనీసం 10 రక్షణ కిట్లు అందుబాటులో ఉండేలా చూడాలని మంత్రి సూచించారు. అలాగే ప్రతి నియోజకవర్గానికి ఒక దోబీ ఘాట్ ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. తొలి దశలో హుస్నాబాద్, హుజూరాబాద్, చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాల్లో ఈ ఘాట్‌లను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బీసీ సంఘాల సంక్షేమం, మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం చేపట్టిన పథకాలు సకాలంలో ఫలితాలు ఇచ్చేలా పని చెయ్యాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.



# శంషాబాద్‌లో నకిలీ కరెన్సీ ముఠా అరెస్టు

**హైదరాబాద్, సెప్టెంబర్3 (జనంసాక్షి) :** హైదరాబాద్ లో నకిలీ కరెన్సీని తయారు చేస్తున్న గ్యాంగ్స్ నిత్యం పెరిగిపోతున్నాయి. పోలీసులు, అధికారులు పటిష్ఠమైన చర్యలు చేపట్టినా ఈ ఫేక్ కరెన్సీ ముఠా ఆగడాలు మాత్రం తగ్గడం లేదు. తాజాగా శంషాబాద్ లో నకిలీ కరెన్సీ తయారు చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. సామాజిక మాధ్యమాల్లో ముఖ్యంగా యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ లో చూసి నకిలీ నోట్లు తయారు చేస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిని తాజాగా అరెస్టు చేశారు. వీరిలో మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. నిందితుల నుంచి రూ.2.91 లక్షల విలువ జేసే నకిలీ కరెన్సీ స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు ప్రింటర్, స్కానర్, లామినేటర్ తదితర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కుటుంబం నకిలీ రూ. 500, రూ. 200, రూ. 100 నోట్లు తయారీ చేస్తున్నారని.. ఎక్కువగా రాత్రివేళల్లోనే నకిలీ నోట్లు చెలామణి చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. మద్యం దుకాణాలు, పాన్ డబ్బాల వద్ద నకిలీ నోట్లు ఇస్తున్నట్లు తెలుసుకున్నారు. నిందితుల్ని చింతల్ తండా, వడ్డిపట్లకు చెందిన రమావత్ రాము అలియాస్ మహ్మద్ (36), రమావత్ మోతీలాల్ (35), రమావత్ గాంధీ (19) లుగా గుర్తించారు. వీరిలో రాము ఫుడ్ డెలివరీ ఉద్యోగి కాగా మోతీలాల్ ర్యాపిడో డ్రైవర్ గా, గాంధీ ఆటో డ్రైవర్ గా పనిచేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. అలాగే వీరికి సహకరించిన మరో నిందితుడు నాగోల్-బండ్లగూడకు చెందిన సుధీర్ జాన్ చెలా అలియాస్ వంశీ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇక షామీర్ పేట్, బాలాపూర్ పరిధిలో నకిలీ కరెన్సీ చలామణి చేస్తున్నారన్న సమాచారంతో హైదరాబాద్ కమిషనర్ టాస్క్ ఫోర్స్ (షామీర్ పేట జోన్) పోలీసులు, బాలాపూర్ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నకిలీ నోట్ల తయారీ వ్యవహారం బయటపడింది. మరోవైపు నకిలీ కరెన్సీ తయారీ వెనుక మరెవరైనా ఉన్నారా..? ఈ నోట్లు ఎక్కడెక్కడ చలామణి అయ్యాయి..? అనే కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నారు. అలాగే పరారీలో ఉన్న సుధీర్ జాన్ కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

# ఉత్పత్తి కన్నా ఉద్యోగుల భద్రతే ప్రధానం

- ప్రమాద రహిత సింగరేణి కోసం అన్ని రకాల చర్యలు
- రక్షణ పెంపుదలకు ఆధునిక సాంకేతికత వినియోగం
- 50వ త్రైపాక్షిక భద్రత సమీక్షా సమావేశంలో సీఎండీ డా. బుద్ధప్రకాష్ జ్యోతి
- పాల్గొన్న డీజీఎంఎస్ అధికారులు, సింగరేణి అధికారుల, గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాలు, యాజమాన్య ప్రతినిధులు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి కన్నా ఉద్యోగుల భద్రతకే అధిక ప్రాధాన్యత ఇస్తామని, ప్రమాదరహిత సింగరేణి కోసం తగు చర్యలు తీసుకుంటామని, కార్మిక సంఘాల వారు చేసిన సూచనలను పరిగణలోకి తీసుకుంటామని సింగరేణి ఛైర్మన్, ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. గురువారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో జరిగిన 50వ త్రైపాక్షిక భద్రత సమీక్షా సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సమావేశంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ అధికారులు, సింగరేణి అధికారుల సంఘం, గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాల నాయకులు, యాజమాన్య ప్రతినిధులు సింగరేణి గనుల్లో రక్షణ చర్యల పైన సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు ఏ విధంగా అమలు అవుతున్నాయి, జరిగిన పొరపాట్లు మళ్లీ జరుగుతున్నాయా? ప్రమాద రహిత మైనింగ్ కొరకు అందుబాటులో ఉన్న ఆధునిక టెక్నాలజీ ఏమిటి? అనే అంశాల పైన పరిశీలించి తగు నిర్ణయాలు తీసుకుంటామన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు వెల్లడించిన సూచనలపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ డాక్టర్ సగేష్ కుమార్ మాట్లాడుతూ సమావేశంలో కార్మిక సంఘాలు ఎన్నో విలువైన సూచనలు చేశారని, రక్షణ పై సింగరేణి యాజమాన్యం కార్మిక సంఘాలు నిబద్ధతతో పనిచేయడం సంతోషకరమన్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది ప్రాణాపాయ ప్రమాదాల సంఖ్య బాగా తగ్గటం అభినందనీయమన్నారు. ఓపెన్ కాస్ట్ గనుల్లో సింగరేణి ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్ కార్మికులు కూడా ఒకే చోట బయోమెట్రిక్ విధానంలో హాజరును నమోదు చేసే పద్ధతిని వెంటనే అమలు చేయాలని సూచించారు. సింగరేణి ఉద్యోగుల రక్షణ పెంపుదలలో తగిన శిక్షణ ఇవ్వడానికి తాము ఎప్పుడూ సంసిద్ధంగా ఉంటామని వెల్లడించారు. ఈ సమావేశంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ గుర్తింపు కార్మిక సంఘం యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, కార్యదర్శి రాజ్ కుమార్, ప్రాతినిధ్య కార్మిక సంఘం ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎస్ నరసింహా రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షులు తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్, ప్రధాన కార్యదర్శి పెద్ది నరసింహులు పాల్గొన్నారు. వీరితో పాటు వివిధ ఏరియాల నుంచి హాజరైన ప్రతినిధులు సింగరేణి వ్యాప్తంగా రక్షణ పెంపుదలకు, ఆరోగ్య వైద్య సేవలు పెంపుదలకు పలు సూచనలు చేశారు. తమ గనుల్లో గల పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సిబ్బంది కొరతను తగ్గించాలని, ఆధునిక వైద్య సేవలు అందించాలని, కాంట్రాక్టు కార్మికులకు కూడా తగిన శిక్షణ ఇప్పించాలని, నాణ్యమైన బూట్లు సరఫరా చేయాలని, గనుల్లో అవసరమైన సూపర్ వైజర్లు, సిబ్బంది మరియు అధికారులను నియమించాలని, స్పేర్ పార్ట్ లు అందుబాటులో ఉంచాలని సూచించారు. దీనిపై యాజమాన్యం తరఫున తగు చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు హామీ ప్రకటించారు. సమావేశానికి జనరల్ మేనేజర్ (సేఫ్టీ) సాయిబాబు స్వాగతం పలికారు. ముందుగా ఇటీవలి ప్రమాదాలలో మృతి చెందిన కార్మికులకు సమావేశం సంతాపం తెలిపింది. అనంతరం గత ఏడాది త్రైపాక్షిక సమావేశంలో తీసుకున్న నిర్ణయాల పైన చర్చించారు. సుహృద్భావ వాతావరణంలో సమావేశం కొనసాగింది. ఈ సమావేశంలో సంస్థ ఛైర్మన్‌తోపాటు డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్య నారాయణ, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) శ్రీ కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (పర్సనల్ మరియు ఫైనాన్స్) గౌతమ్ పోట్రు, డైరెక్టర్ (ఈ అండ్ ఎం) ఎమ్.తిరుమల రావు, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్ మరియు మార్కెటింగ్) శ్రీ తాడబోయిన శ్రీనివాస్, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు, కార్పోరేట్ జనరల్ మేనేజర్లు, డీజీఎంఎస్ నుంచి డైరెక్టర్స్ ఆఫ్ మైన్ సేఫ్టీ డాక్టర్ సగేష్ కుమార్, డాక్టర్ ఐ. సత్యనారాయణ, రాజ్ కుమార్, కె మహేశ్వరరెడ్డి, పంకజ్ కుమార్ జైన్, డిప్యూటీ డైరెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# త్యాగమే బౌద్ధం.. ఆశ కాదు ఆశయం

సంపాదకీయం

మతం అంటే గుడ్డిగా నమ్మడమా? ఎవరో చెప్పారు కాబట్టి నమ్మడమా? గ్రంథంలో రాశారు కాబట్టి ప్రశ్నించకుండా ఆచరించడమా? బౌద్ధం మాత్రం అందుకు భిన్నమైన మార్గాన్ని చూపించింది. "నేను చెప్పానని నమ్మకు.. నీ గురువు చెప్పాడని నమ్మకు.. గ్రంథంలో ఉందని నమ్మకు.. పూర్వీకులు చెప్పారు కాబట్టి నమ్మకు.. నీ అనుభవంలో అది నిజమని తెలుసుకున్నప్పుడు మాత్రమే స్వీకరించు" అనే బుద్ధుని బోధన మనిషిని ఆలోచించమంటుంది.

అదే బౌద్ధ తత్వంలోని అసలైన ప్రత్యేకత. ప్రశ్నించు.. పరిశీలించు.. అనుభవించు.. ఆ తర్వాత నమ్ము. అందుకే బౌద్ధం కేవలం ఆధ్యాత్మిక మార్గం మాత్రమే కాదు.. మనిషిలో తార్కిక, పరిశీలనా దృక్పథాన్ని పెంపొందించే జీవన తత్వం.

బుద్ధుడు చెప్పిన మార్గం ఆశలను పెంచుకోవడం కాదు.. ఆశయాల వైపు నడవడం. అంతులేని కోరికల వెంట పరుగెత్తే మనిషి చివరికి అసంతృప్తికే గురవుతాడు. అందుకే కోరికలను అదుపులో పెట్టుకోవడం, స్వార్థాన్ని విడిచిపెట్టడం, ఇతరుల కోసం జీవించడం, అవసరమైతే తన సుఖాలను త్యాగం చేయడం బౌద్ధ బోధనలో కీలకం.

ఈ భావనకు నేటి ప్రపంచంలోనూ ఉదాహరణలు కనిపిస్తున్నాయి. తాజాగా తెరపైకి వచ్చిన ఒక వార్త ఇందుకు ఆసక్తికరమైన ఉదాహరణ. థాయ్‌లాండ్‌కు చెందిన ఓ వ్యాపారవేత్త బౌద్ధ సన్యాసిగా మారాలని నిర్ణయించుకుని, తన ఇన్‌స్పైర్ కంపెనీని రూ.47 కోట్లకు విక్రయించేందుకు సిద్ధమైనట్లు ఆ వార్త పేర్కొంది. కంపెనీని కొనుగోలు చేసేవారిని పరిచయం చేసిన వారికి రూ.1.4 కోట్ల వరకు కమీషన్ ఇస్తానని కూడా ప్రకటించినట్లు కథనం తెలిపింది.

ఇది కేవలం ఒక వ్యాపారవేత్త వ్యక్తిగత నిర్ణయంగా చూడొచ్చు. కానీ ఆ నిర్ణయం వెనుక ఉన్న ప్రశ్న మాత్రం పెద్దది. రూ.47 కోట్ల విలువైన కంపెనీని సంపాదించడమే జీవితానికి పరమార్థమా? లేక ఒక దశలో సంపద, హోదా, వ్యాపారం అన్నింటినీ పక్కనపెట్టి మరో అర్థవంతమైన జీవితాన్ని ఎంచుకోవచ్చా?

ఆ వ్యాపారవేత్త 1999లో 'హావెల్స్' పేరుతో ఇన్‌స్పైర్ కంపెనీని స్థాపించినట్లు, ఒక్కప్పుడు చిన్నగా ప్రారంభమైన ఆ సంస్థ అనేక సంవత్సరాల ప్రయాణం తర్వాత భారీ స్థాయికి చేరినట్లు స్క్రీన్‌షాట్‌లోని కథనం చెబుతోంది. అలాంటి వ్యాపారాన్ని వదిలి సన్యాస మార్గాన్ని ఎంచుకోవాలన్న నిర్ణయం బౌద్ధంలో చెప్పే అనిత్యత, త్యాగం, కోరికల నుంచి విముక్తి వంటి భావనలను గుర్తు చేస్తుంది.

అయితే బౌద్ధాన్ని గొప్పగా నిలబెట్టేది కేవలం సన్యాసం కాదు. ప్రతి ఒక్కరూ అన్నీ వదిలి సన్యాసులు కావాలని బుద్ధుడు చెప్పలేదు. మనిషి ఏ స్థితిలో ఉన్నా తనలోని లోభాన్ని, ద్వేషాన్ని, అహంకారాన్ని జయించడం ముఖ్యమని బోధించాడు.

భారత గడ్డపై పుట్టిన బౌద్ధం ఒక ప్రాంతానికో, ఒక జాతికో పరిమితం కాలేదు. త్యాగం, కరుణ, అహింస, సమానత్వం, ఆత్మపరిశీలన వంటి విలువలతో ప్రపంచంలోని అనేక దేశాలకు విస్తరించింది.

ఇదే బౌద్ధం చెప్పే గొప్ప సందేశం

సంపద ఉండొచ్చు.. కానీ సంపదకు బానిస కావద్దు.

ఆశలు ఉండొచ్చు.. కానీ ఆశలే జీవితాన్ని నడపనివ్వొద్దు.

విశ్వాసం ఉండొచ్చు.. కానీ ప్రశ్నించడాన్ని ఆపొద్దు.

ఎవరైనా చెప్పారు కాబట్టి నమ్మొద్దు.. నీ అనుభవంలో సత్యాన్ని తెలుసుకో.

నీ కోసం మాత్రమే జీవించొద్దు.. సమాజం కోసం కూడా జీవించు.


భారత్‌లో పుట్టిన ఈ తత్వం ప్రపంచానికి ఇచ్చిన సందేశం ఇదే త్యాగంలోనే నిజమైన స్వేచ్ఛ ఉంది.. ప్రశ్నించడంలోనే జ్ఞానం ఉంది.. ఆశలను జయించడంలోనే ఆశయం ఉంది.

### తెలంగాణ ఉద్యమకారుడు, కార్మిక నేత జి.ఎల్లయ్య ప్రథమ వర్ధంతి సభ

తెలంగాణ ఉద్యమ తొలి, మలి దశల నాయకుడు జి.ఎల్లయ్య. ఆయన జీవితమంతా తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా జీవించాడు. అలాగే మరోవైపు బీహెచ్‌ఈఎల్లో ట్రేడ్ యూనియన్ నేతగా విశేషమైన పోరాటాలు చేశాడు. కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా దశాబ్దాల పాటు శ్రమించాడు. ఇవాళ వారు అనుభవిస్తున్న ఇండ్లు, ఇండ్ల జాగలు, పీఎఫ్లు, హెచ్‌ఆర్‌ఏలు, బస్సు సౌకర్యాలు, బడి వసతులు ఒకటేమిటి అనేకం ఆయన ముందుండి సాధించినవే. అలాంటి కార్మిక బంధు జి.ఎల్లన్న. మారుమూల పల్లెటూరిలో పుట్టి జాతీయ స్థాయి నాయకుడిగా ఎదిగాడు. కార్మిక బంధుగా నిలిచాడు. ఆ మహనీయుని ప్రథమ వర్ధంతి సభ ఈ నెల 5న, తెల్లాపూర్లోని జి.ఎల్లయ్య ఎన్క్లేవ్లో ఉదయం 10గం.లకు నిర్వహిస్తున్నాం. ఈ సభకు అతిథులుగా మాజీ మంత్రి టి.హరీశ్రావు, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, గూడెం మహిపాల్ రెడ్డి, జగదీశ్వర్ గౌడ్, మట్టిమేధావి సత్తన్న, పాశం యాదగిరి, పసునూరి రవీందర్, కొల్లూరి భరత్లతో పాటు పలు ట్రేడ్ యూనియన్ల నాయకులు హాజరుకానున్నారు. ప్రజలు, ఎల్లన్న అభిమానులు, అనుచరులు అధికసంఖ్యలో పాల్గొని ఈ సభను విజయవంతం చేయాల్సిందిగా కోరుతున్నాం.

**-విజయ్ ప్రతాప్, ఎల్లన్న కుటుంబ సభ్యులు**

# ఆర్థిక ఒత్తిడిలో కొట్టుమిట్టాడుతున్న గ్రామీణ కుటుంబాలు!




దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోందని, స్థూల దేశీయోత్పత్తి వృద్ధి రేటు ఆశాజనకంగా ఉందని గణాంకాలు చెబుతున్నా గ్రామీణ భారతం మాత్రం ఆర్థిక ఒత్తిడిలో కొట్టుమిట్టాడుతున్నదనే వాస్తవాన్ని నాబార్డ్ తాజా సర్వే వెలుగులోకి తెచ్చింది. గ్రామీణ కుటుంబాల ఆదాయాలు ఆశించిన స్థాయిలో పెరగకపోవడం, రోజువారీ ఖర్చులు పెరగడం, పొదుపులు తగ్గిపోవడం, సంస్థాగత రుణాల కంటే అనధికారిక రుణాలపై ఆధారపడటం పెరగడం గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పెరుగుతున్న అస్థిరతకు సంకేతాలుగా కనిపిస్తున్నాయి. ఇది రాజకీయ పార్టీల ఆరోపణ కాదు. గ్రామీణ ఆర్థిక పరిస్థితులను క్రమం తప్పకుండా పరిశీలిస్తున్న జాతీయ వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి బ్యాంకు నిర్వహించిన 2026 జూలై 12వ విడత గ్రామీణ ఆర్థిక పరిస్థితులు, అభిప్రాయాల సర్వే వెల్లడించిన వాస్తవాలు.

2026 జూలైలో గ్రామీణ కుటుంబాల్లో కేవలం 27.7 శాతం కుటుంబాలు మాత్రమే గత ఏడాదితో పోలిస్తే తమ ఆదాయం పెరిగిందని చెప్పాయి. 52.6 శాతం కుటుంబాలు తమ ఆదాయంలో ఎలాంటి మార్పు లేదని పేర్కొన్నాయి. మరో 19.8 శాతం కుటుంబాలు ఆదాయం తగ్గిపోయిందని తెలిపాయి. అంటే 100 గ్రామీణ కుటుంబాలను తీసుకుంటే కేవలం 28 కుటుంబాలకు మాత్రమే ఆదాయంలో పెరుగుదల కనిపిస్తుండగా, దాదాపు 53 కుటుంబాల ఆదాయం స్థిరంగా ఉండిపోయింది, మరో 20 కుటుంబాల ఆదాయం తగ్గింది. 2025 నవంబరులో ఆదాయం పెరిగిందని చెప్పిన కుటుంబాల వాటా 42.2 శాతం ఉండగా, 2026 జూలై నాటికి అది 27.7 శాతానికి పడిపోయింది. అంటే కేవలం 8 నెలల్లోనే 14.5 శాతం పాయింట్ల క్షీణత నమోదైంది. 2026లో గ్రామీణ ఆదాయాల బలహీనత ఎంత తీవ్రమైందో ఈ ఒక్క గణాంకమే స్పష్టం చేస్తోంది.

ఇక్కడ అసలు ప్రశ్న ఆదాయాలు ఎందుకు పెరగడం లేదు అన్నదే. గ్రామీణ భారత ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం ఇప్పటికీ ప్రధాన ఆధారం. వర్షపాతం, సాగునీరు, పంటల దిగుబడి, పంటల ధరలు, ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, ఇంధన ధరలు వంటి అనేక అంశాలు రైతు ఆదాయాన్ని ప్రభావితం చేస్తాయి. వర్షపాతం ప్రతికూలంగా ఉన్నప్పుడు పంట దిగుబడి తగ్గుతుంది. పంట దిగుబడి తగ్గితే రైతు ఆదాయం తగ్గుతుంది. రైతు ఆదాయం తగ్గితే గ్రామంలోని కూలీకి పని తగ్గుతుంది. కూలీ ఆదాయం తగ్గితే స్థానిక దుకాణదారుడి అమ్మకాలు పడిపోతాయి. రవాణా కార్మికుడు, చిన్న వ్యాపారి, పశుపోషకుడు, గ్రామీణ సేవా రంగం-అన్నింటిపైనా దాని ప్రభావం పడుతుంది. అందుకే వ్యవసాయంలో ఏర్పడే చిన్నపాటి ఆదాయ లోటు కూడా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మొత్తం మీద పెద్ద ప్రభావాన్ని చూపుతుంది.

దీనికి తోడు జీవన వ్యయం పెరుగుతోంది. 2026 జూన్‌లో గ్రామీణ ప్రాంతాల వినియోగదారుల ధరల ద్రవ్యోల్బణం సుమారు 5 శాతంగా ఉండగా, పట్టణ ప్రాంతాల్లో అది సుమారు 4 శాతంగా ఉంది. గ్రామీణ వినియోగ బుట్టలో ఆహారానికి ఎక్కువ ప్రాధాన్యం ఉండటం వల్ల ఆహార ధరలు పెరిగినప్పుడు గ్రామీణ కుటుంబాలపై దాని ప్రభావం మరింత తీవ్రంగా ఉంటుంది. ఆదాయం పెరగకపోయినా ఖర్చులు పెరుగుతుండటంతో కుటుంబాలు తమ బడ్జెట్‌ను కుదించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

నాబార్డ్ తాజా సర్వేలో గ్రామీణ కుటుంబాల వినియోగ వ్యయం పెరిగిందని చెప్పిన వారి వాటా 74.1 శాతానికి తగ్గింది. సర్వే ప్రారంభమైనప్పటి నుంచి ఈ సంఖ్య 75 శాతానికి దిగువకు రావడం రెండోసారి. అయినప్పటికీ కుటుంబాల నెలవారీ ఆదాయంలో దాదాపు మూడింట రెండొంతులు రోజువారీ వినియోగానికే వెచ్చించాల్సి వస్తోంది. అంటే ఆహారం, ఇంధనం, దుస్తులు, విద్య, ఆరోగ్యం, రవాణా, ఇతర అత్యవసర అవసరాల తర్వాత కుటుంబాల చేతిలో మిగిలేది చాలా తక్కువ.

అత్యంత ఆందోళన కలిగించే అంశం పొదుపులు. 2026 జూలైలో గత ఏడాదితో పోలిస్తే తమ ఆర్థిక పొదుపులు పెరిగాయని చెప్పిన గ్రామీణ కుటుంబాలు కేవలం 17.8 శాతం మాత్రమే. ఇది నాబార్డ్ ఈ సర్వే ప్రారంభించినప్పటి నుంచి నమోదైన అత్యల్ప స్థాయి. ఆదాయం పెరగకపోవడం ఒక సమస్య అయితే, ఉన్న పొదుపు కూడా క్రమంగా కరిగిపోవడం మరింత తీవ్రమైన సమస్య. పొదుపు లేకపోతే అనారోగ్యం, ప్రమాదం, పంట నష్టం, పిల్లల చదువు, వివాహం లేదా ఇతర అత్యవసర పరిస్థితుల్లో కుటుంబం అప్పు వైపు వెళ్లక తప్పదు.

ఇక్కడే గ్రామీణ రుణభారం అసలు సమస్యగా మారుతోంది. బ్యాంకులు, ఇతర సంస్థాగత రుణదాతల నుంచి మాత్రమే రుణాలు తీసుకుంటున్న గ్రామీణ రుణగ్రహీతల వాటా 2025 నవంబరులో 58.3 శాతం ఉండగా, 2026 జూలైలో అది 51 శాతానికి పడిపోయింది. అదే సమయంలో పూర్తిగా అనధికారిక వనరులపై ఆధారపడుతున్న రుణగ్రహీతల వాటా 23.6 శాతానికి పెరిగింది. ఇది నాబార్డ్ సర్వేలో నమోదైన అత్యధిక స్థాయి. ఇందులో స్నేహితులు, బంధువుల నుంచి మాత్రమే అప్పు తీసుకునేవారు 16.2 శాతం, వడ్డీ వ్యాపారుల నుంచి మాత్రమే అప్పు తీసుకునేవారు 6 శాతం, రెండు రకాల అనధికారిక వనరులను ఉపయోగించేవారు 1.4 శాతంగా ఉన్నారు. మరో 25.3 శాతం కుటుంబాలు సంస్థాగత, అనధికారిక-రెండు రకాల రుణాలపైనా ఆధారపడుతున్నాయి. అనధికారిక రుణాలపై సగటు వడ్డీ రేటు 17.77 శాతంగా ఉండటం మరింత ఆందోళనకరం. అయితే కుటుంబ సభ్యులు, బంధువుల నుంచి వడ్డీ లేకుండా తీసుకునే రుణాలు కూడా ఈ వర్గంలో ఉండటం వల్ల మొత్తం సగటు వడ్డీ రేటును అర్థం చేసుకునేటప్పుడు జాగ్రత్త అవసరం. అయినప్పటికీ వడ్డీ వ్యాపారులపై ఆధారపడే కుటుంబాలకు ఇది తీవ్రమైన భారమే. ఒక రైతు పంట నష్టంతో ఆదాయం కోల్పోయి అధిక వడ్డీకి అప్పు తీసుకుంటే, తదుపరి పంట వచ్చినా ఆ ఆదాయంలో గణనీయమైన భాగం పాత అప్పు, వడ్డీ చెల్లింపులకే వెళ్లే ప్రమాదం ఉంది. ఈ సమస్య కొత్తది కాదు. నాబార్డ్ 2021-22 గ్రామీణ ఆర్థిక సమ్మిళిత సర్వే ప్రకారం గ్రామీణ కుటుంబాల సగటు నెలవారీ ఆదాయం రూ.12,698గా ఉండగా, నెలవారీ వినియోగ వ్యయం రూ.11,262గా ఉంది. అదే సర్వేలో సగటు వార్షిక పొదుపు రూ.13,209గా నమోదైంది. గ్రామీణ కుటుంబాల సగటు అప్పుదనం రూ.47,158గా ఉంది. అయితే సంస్థాగత వనరుల నుంచి తీసుకున్న సగటు రుణం రూ.32,484 కాగా, అనధికారిక వనరుల నుంచి తీసుకున్న రుణం రూ.4,759కు తగ్గింది. ఇది అప్పట్లో సంస్థాగత రుణ వ్యవస్థ బలోపేతం అవుతున్న సంకేతంగా కనిపించింది. 2016-17 నుంచి 2021-22 మధ్య నాబార్డ్ గణాంకాలు కొన్ని సాతనుకూల మార్పులను కూడా చూపించాయి. సగటు నెలవారీ కుటుంబ ఆదాయం రూ.8,059 నుంచి రూ.12,698కు పెరిగింది. సగటు వార్షిక పొదుపు రూ.9,104 నుంచి రూ.13,209కు పెరిగింది. సంస్థాగత రుణాల ప్రాధాన్యం పెరిగింది. వ్యవసాయ కుటుంబాల్లో సంస్థాగత వనరుల నుంచే రుణాలు తీసుకునే వారి వాటా 60.5 శాతం నుంచి 75.5 శాతానికి పెరిగింది. అదే సమయంలో అనధికారిక వనరులపై మాత్రమే ఆధారపడే వ్యవసాయ కుటుంబాల వాటా 30.3 శాతం నుంచి 23.4 శాతానికి తగ్గింది. కానీ 2026 తాజా పరిస్థితులు ఈ పురోగతికి కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని సూచిస్తున్నాయి.

మరోవైపు దేశంలోని కుటుంబ రుణభారం గురించి అఖిల భారత రుణ, పెట్టుబడి సర్వే 2019 కూడా ముఖ్యమైన విషయాలను వెల్లడించింది. 2018 జూన్ 30 నాటికి గ్రామీణ కుటుంబాల్లో 35 శాతం కుటుంబాలకు నగదు అప్పు బకాయి ఉంది.

మిగితా వ్యాసం రేపటి సంచికలో



**ప్రొఫెసర్. సుంకరి జ్యోతి**
**డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
**కాకతీయ విశ్వవిద్యాలయం.**



# అంకెలు మాట్లాడే వేళ.. అనుభవాలు చెప్పే నిజం!

వెయ్యి రోజులు పూర్తవడం ప్రభుత్వానికి ఒక రాజకీయ మైలురాయి కావచ్చు.. కానీ ప్రజాస్వామ్యంలో పాలనకు అసలు మార్కులు క్యాలెండర్ పేజీలపై కాదు, ప్రజల జీవితాల్లో పడాలి. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో అధికార పక్షం తన పాలనా కార్యక్రమాలు, నిర్ణయాలు, అభివృద్ధి-సంక్షేమ చర్యలను ప్రజల ముందుకు తెస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, ఉద్యోగులతో పాటు కులగణన, ఎస్సీ వర్గీకరణ వంటి అంశాల్లో ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రస్తావించారు. మరోవైపు బీఆర్‌ఎస్ ప్రభుత్వ పనితీరుపై 'చార్జ్‌షీట్' విడుదల చేసి విమర్శలు చేసింది. బీజేపీ పోస్టర్ ప్రచారంతో ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అయితే ఇక్కడ అసలు ప్రశ్న ఎవరి ప్రచారం బలంగా ఉందన్నది కాదు.. ఎవరి వాదనకు ఎంత ఆధారం ఉందన్నదే. ప్రభుత్వం చెప్పే విజయాలైనా, ప్రతిపక్షం చేసే విమర్శలైనా అధికారిక పత్రాలు, బడ్జెట్ వివరాలు, శాఖల నివేదికలు, అమలు ఫలితాల ముందు పరిశీలించాల్సిందే. రాజకీయ వాదనలు చర్చకు తెరతీయవచ్చు.. కానీ ప్రజా తీర్పుకు అవే ప్రమాణం కావు. వెయ్యి రోజుల పాలనకు తొలి మార్కు పోస్టర్లపై కాదు.. పాలన ఫలితాలపై పడాలి. తుది మార్కు మాటలకు కాదు.. ప్రజల జీవితాల్లో కనిపించిన మార్పుకే దక్కాలి.

**హామీ కంటే అమలే పాలనకు అసలు పరీక్ష**

ఎన్నికల హామీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానం. దాన్ని అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత. కానీ అమలు అంటే ప్రకటన చేయడం, ఉత్తర్వు జారీ చేయడం మాత్రమే కాదు. నిధులు, కార్యాచరణ, అర్హుల గుర్తింపు, సేవల చేరిక, అమలు వేగం, నాణ్యత, ప్రజలకు కలిగిన ప్రయోజనం. ఇవన్నీ కలిసినప్పుడే ఒక పథకం ఫలితంగా మారుతుంది. అందుకే వెయ్యి రోజుల పాలనను అంచనా వేయాలంటే ఎన్ని హామీలు ఇచ్చారు? ఎన్ని ప్రకటించారు? అనే ప్రశ్నలతో పాటు ఎన్ని ఆచరణలోకి వచ్చాయి? ఎంతమందికి చేరాయి? ఫలితం ఏమిటి? అనే ప్రశ్నలు కూడా ఉండాలి. వ్యవసాయం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం, ఉపాధి, ప్రజా రవాణా వంటి ప్రతి రంగానికీ ఇదే ప్రమాణం వర్తిస్తుంది. బడ్జెట్‌లో కేటాయింపు ఉండటం ఒక ప్రారంభ సూచిక మాత్రమే. ఆ నిధులు ఎలా వినియోగించబడ్డాయి, సేవలు ఎంత సమర్థంగా చేరాయి, ప్రజలకు ఉపయోగం ఎంత కలిగింది అన్నదే తదుపరి పరీక్ష. తెలంగాణ ఆర్థిక శాఖ 2026--27 బడ్జెట్‌కు సంబంధించిన అధికారిక పత్రాలను అందుబాటులో ఉంచింది. పథకం ప్రకటించడం ఒక అడుగు మాత్రమే.. అది అర్హుడికి చేరి, జీవితంలో మార్పు తీసుకురావడమే అసలు ఫలితం.

**ప్రభుత్వం చెబుతున్న లెక్క ప్రతిపక్షం అడుగుతున్న ప్రశ్న**

ప్రభుత్వం తన పనితీరును వివరించడం ప్రజాస్వామ్యంలో సహజం. ప్రతిపక్షం దానిని ప్రశ్నించడం కూడా అంతే సహజం. తెలంగాణలో వెయ్యి రోజుల మైలురాయి ఈ రాజకీయ చర్చకు మరో వేదికగా మారింది. బీఆర్‌ఎస్ తన చార్జ్‌షీట్‌లో పలు హామీలు, పాలనా అంశాలపై విమర్శలు చేసింది. బీజేపీ కూడా ప్రభుత్వ పనితీరును ప్రశ్నిస్తూ పోస్టర్ ప్రచారం చేపట్టింది. అవి ఆయా రాజకీయ పార్టీల విమర్శలు, ఆరోపణలు; వాటిని స్వతంత్రంగా నిర్ధారిత వాస్తవాలుగా పరిగణించడం సరికాదు. అదే ప్రమాణం ప్రభుత్వ ప్రకటనలకూ వర్తిస్తుంది. ప్రభుత్వం ఒక విజయాన్ని ప్రకటిస్తే దాని ఆధారం ఏమిటి? ప్రతిపక్షం ఒక వైఫల్యాన్ని ప్రస్తావిస్తే దానికి ఆధారం ఏమిటి? ఈ రెండు ప్రశ్నలూ సమానంగా అడగాలి. ప్రశ్నించడం ప్రభుత్వ వ్యతిరేకత కాదు.. పాలనపై సమాధానం కోరడం ప్రజాస్వామ్య హక్కు. అయితే ప్రశ్నకైనా, సమాధానానికైనా ఆధారమే బలం. ప్రభుత్వ వాదనైనా, ప్రతిపక్ష విమర్శైనా.. ఆధారాల ప్రమాణంపై నిలిచినప్పుడే ప్రజా చర్చకు విలువ ఉంటుంది.

**అంకెలు ఎన్ని ఉన్నా మార్పే అసలు మార్కు**

1,000 రోజుల పాలనకు అసలు మార్కులు ఎవరు వేయాలి? ప్రభుత్వం తన పనితీరుకు అనుకూలమైన ప్రమాణాలను ముందుకు తెచ్చుకోవచ్చు. ప్రతిపక్షం తన రాజకీయ ప్రమాణాలతో విమర్శలు చేయవచ్చు. కానీ ప్రజాస్వామ్యపు తుది కొలమానం ప్రజల అనుభవమే. రైతుకు అవసరమైన సహాయం సమయానికి అందిందా? యువతకు ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయా? విద్యార్థికి నాణ్యమైన విద్య చేరువైందా? పేద కుటుంబానికి ఆహారం, గృహం, వైద్యం వంటి ప్రాథమిక సేవలు అందుబాటులో ఉన్నాయా? గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సేవల నాణ్యత పెరిగిందా? ఈ ప్రశ్నలకు సమాధానాలు సభల నినాదాల్లోనూ, పోస్టర్లలోనూ పూర్తిగా దొరకవు. అవి అధికారిక గణాంకాలు, బడ్జెట్ పత్రాలు, శాఖల నివేదికలు, స్వతంత్ర పరిశీలన, ప్రజల ప్రత్యక్ష అనుభవాల్లో కనిపించాలి. ప్రతిపక్షం విమర్శలను ఆధారాలతో బలపరచాలి. మంచి పాలన తనకు తానే మార్కులు వేసుకోదు.. ప్రజల జీవితాల్లో కనిపించిన మార్పే దానికి అసలు మార్కు. వెయ్యి రోజుల పాలనకు నిజమైన నివేదిక ప్రభుత్వ ప్రకటనల్లోనూ, ప్రతిపక్ష విమర్శల్లోనూ కాదు.. ప్రజల అనుభవాల్లోనే ఉంటుంది. ఆ అనుభవాలే ప్రజల తుది తీర్పుకు అసలు గీటురాయి.



**ఫిరోజ్ ఖాన్,**
**సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**9640466464**

# రాజకీయ ఖైదీలను విడుదల చేయాలి

1985 నాటి కాలం మొదలైన తీవ్రమైన నిర్బంధం ఆట, మాట, పాట, బంద్‌తో పాటు ప్రశ్నించే గొంతులను హత్య చేసే స్థాయికి ఎదిగాయి. అలా ప్రారంభమైన నిర్బంధం మైదాన ప్రాంతాలలో ప్రధానంగా ఉద్యమ ప్రాంతాలలో బూటకపు ఎన్‌కౌంటర్లతో యువత రాష్ట్రం విడిచి పారిపోయేలా చేసింది. ఆ స్థితిలోనే ఉద్యమాలు కూడా రాష్ట్రాన్ని దాటి అటవీ ప్రాంతాలకే పరిమితమయ్యాయి. ఆ ఉద్యమాలపై అణచివేత పోలీసులను దాటి సైన్యాన్ని దాటి ఇజ్రాయేల్ అమెరికా సాంకేతిక పరిజ్ఞానంతో ఆదివాసీలను ఉద్యమకారులను నరసంహారం పేరిట వేలాది మందిగా హత్య చేసి దండకారణ్యంలోని వాగులన్ని ఉద్యమకారుల రక్తంతో పారించింది. వాస్తవాలు బయటికి రాకుండా హక్కుల సంఘాలపై అమానవీయ నిర్బంధాన్ని కొనసాగిస్తూ ఆదివాసీలను వేటాడి చంపేసింది. 5 దశాబ్దాల ఉద్యమాన్ని 20 వేల మందిని ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేసినప్పటికి నిలువరించలేని స్థితిలో దాన్ని నిశబ్ధం చేయడానికి అనేక విధాలా హత్యాకాండాలను ప్రయోగించి ఉద్యమాన్ని నిశ్శబ్దం చేయగలిగింది. పార్లమెంటు రాజకీయాల స్థానంలో ఉద్యమ రాజకీయాలు బలపడుతూ ప్రజలకు భరోసా ఇస్తున్న స్థితిలో కార్పొరేట్లకు దేశంలోని సహజ వనరులను అందించడం కోసం ప్రభుత్వాలు ఒక అంతర్‌యుద్ధాన్నే కొనసాగించాయి. ఈ ఉద్యమాన్ని సాకుగా ఇప్పటికి పౌరహక్కుల సంఘం నేత గోపి రాజన్న మొదలు ఈ రోజు 3 సెప్టెంబర్ 1985 డా. రామనాథంతో పాటు ఆరుగురు హక్కుల కార్యకర్తలను ప్రభుత్వాలే హత్య చేశాయి. 41 ఏళ్ళు గడుస్తున్నప్పటికి ఇప్పటి వరకు ఏ హంతకుడిని ప్రభుత్వం శిక్షించలేకపోయింది. ఇది ఈ మధ్య కాలంలో జరిగిన డా. దబోల్కర్, ప్రొ. కల్బుర్గి, గోవింద్ పన్సారే, గౌరీ లంకేశ్‌ల హత్యలు చూసినా అర్థం అవుతుంది. ప్రభుత్వాలు ప్రజాస్వామ్యము, రాజ్యాంగము అని ప్రజలకు చెబుతాయి. ఆచరణలో మాత్రం హత్యారాజకీయాలను విశ్వసించి ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఎవరినైనా అతను హక్కులోద్యమ నాయకుడైనా కార్మికోద్యమ నాయకుడైనా చివరికి ఏ మేధావిగా ఉన్నా ఎవరినైనా ప్రభుత్వమే చంపేస్తుంది. ప్రజాస్వామ్యాన్ని ప్రజలు ఏ విధంగా విశ్వసించాలో తెలియని అయోమయ స్థితిలో ప్రజలను నెట్టివేస్తుంది. ఇదే క్రమంలో అస్సాంలో మానవాధికారి సంఘటనకు చెందిన పరాకుమార్ దాస్‌ను అదే విధంగా కాశ్మీర్‌కు చెందిన అడ్వకేట్ జలీల్ ఆంద్రాబీని, పంజాబ్‌లో మూడువేల శవాల ఆచూకీలను బయట పెట్టిన జస్వంత్ సింగ్ కాల్రాను కూడా ప్రభుత్వాలే హత్య చేశాయి. ఇప్పటికైనా ప్రశ్నించే గొంతులను, ఉద్యమకారులను అక్రమ కేసులలో అన్యాయమైన శిక్షలతో జైల్లో నిర్బంధించి ఉన్నారు. వారందరిని బెషరతుగా విడుదల చేయాలి అనే నినాదంతో డా. రామనాథం వర్ధంతి సందర్భంగా మనమందరం ముందుకు కదలాల్సిన అవసరం ఉంది.

డా॥ రామనాథం హత్య ఎస్ఐ యాదగిరి రెడ్డి హక్కుకు, ప్రతీకారంగానే జరిగిందని అధికార ప్రచారం జరుగుతూ ఉంది. ప్రతీకార హత్యలు ప్రజాస్వామ్యంలో ప్రధానంగా ప్రభుత్వంలో ఉండకూడనివి; నిజానికి పౌరహక్కుల సంఘాన్ని నక్సలైట్ల సానుభూతి సంస్థగా పేర్కొనబడడానికి వీలు లేదు. నేటికి పౌర ప్రజాస్వామిక హక్కుల కోసం ప్రజాస్వామికంగా పనిచేస్తున్న సంస్థ, ఎమర్జెన్సీకి ముందు, ఎమర్జెన్సీ తరువాత కొనసాగిన ప్రజల ప్రాథమిక హక్కుల ఉల్లంఘనలోంచే సుమారుగా, దేశంలోని అన్ని హక్కుల సంఘాలు పుట్టాయి. వాటి కార్యచరణ ప్రజాస్వామిక హక్కుల ఉల్లంఘన కొనసాగుతున్నది. కాని చట్ట ఉల్లంఘనలో భాగంగా హత్యలు చేస్తున్న ప్రభుత్వం పోలీసులకు, వారి చట్ట ముసుగును తొలగించి డా॥ రామనాథం సమాజం ముందు దోషులుగా నిలబెట్టేవాడు. తట్టుకోలేని ప్రభుత్వాలు మొదట నక్సల్స్ ఫ్రంటల్ ఆర్గనైజేషన్‌గా ప్రచారం చేస్తూనే, హక్కుల సంఘం కార్యాచరణలపై నిర్బంధం అమలు చేస్తువస్తూన్నది. నక్సల్స్ హత్యలకు పాల్పడ్డప్పుడు ప్రభుత్వం ప్రతీకార హత్యలకు సిద్ధపడుతున్నది. ఇది ప్రభుత్వాలు అంటున్న ప్రజాస్వామ్యానికి కూడా పూర్తిగా వ్యతిరేకం. రామనాథం ఆచరణ తర్వాత 1990లో వరంగల్‌లో జరిగిన రైతుకూలీ సంఘం మహాసభలు వరంగల్ ప్రజలకు ఎంతటి విశ్వాసం ఇచ్చిందో అంత బలంగా వరంగల్‌లో ప్రజా ఉద్యమాలు కొనసాగాయి. ప్రభుత్వం మనిషిని ఎన్‌కౌంటర్‌లో హత్య చేస్తున్నది.

విశాఖపట్నం జైల్లో 10 మంది ఉన్నారు. రాజమండ్రి, కాకినాడ, నెల్లూరు తదితర ఆంధ్ర జైళ్లలో 50 మంది దాకా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ జైళ్లలో ఉన్న వాళ్ళు కూడా 90 శాతం అధివాసీలే. ఇంకోటి నక్సల్స్ శోధన పేరిట విశాఖపట్నం జైల్లో ఏడు ఏళ్లుగా ఉంది.. ఈమెపై 55 అక్రమ కేసులు బనాయించారు. కొల్లా నాగేశ్వరరావుపై 40 కేసులు, కండెం రామకృష్ణపై 45 కేసులు, మల్రి తులసిపై 25 కేసులు, కొర్రా సింహాచలంపై 20 కేసులు మోపారు. వీరంతా నాలుగూ, ఐదేళ్లుగా జైల్లో ఉన్నారు. దేవేంద్ర, తీవ్ర నాగేశ్వర్ వంటి వాళ్లు జైల్లో ఉన్నారు. సత్యం, వివేక్ పాటల పుస్తకం ఈ మధ్యనే ఏ సాక్ష్యాధారాలు లేకుండానే ఐదేళ్ల శిక్ష వేశారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన మరింత మంది ఇతర రాష్ట్రాల జైళ్లలో ఉన్నారు. ముఖ్యంగా మధ్యప్రదేశ్లోని బలరాంపూర్, భోపాల్, నాగూర్ జైళ్లలో శిక్షపడని ఖైదీలుగా ఐదుగురు 17 ఏళ్లుగా జైల్లో ఉన్నారు. వీరందరూ కూడా దాదాపు ఇన్ని ఏళ్లుగా జైలులో ఉంటూ కలవలేక కూడా లేకుండా ఉన్నారు. జీవితకాలపు శిక్ష పడిన అనేక మంది ఇతర ఖైదీలకు అదే జైలు నుండి 14 ఏళ్ల తరువాత స్వచ్ఛంద రిలయన్స్ బోర్డు సిఫార్సుతో ప్రభుత్వం ముందస్తుగా విడుదల చేసింది. కానీ వీరిని మాత్రం విడుదల చేయలేదు. బలరాంపూర్ జైల్లో ఉన్న అశోక్ రెడ్డి, ఆయన భార్య కుమారి పాటలు గాయకులుగా విచారణ ఖైదీలుగా ఉన్నారు. ఛత్తీస్‌గఢ్ జైళ్లలో దాదాపు 1200 మంది, జార్ఖండ్ జైళ్లలో సుమారు 1000 మంది, ఇంకా ఒడిశా, బీహార్, బెంగాల్, కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీలలో కూడా ఎంతో మంది మావోయిస్టులు అనే ఆరోపణతో జైళ్లలో ఉన్నారు. భీమా-కోరేగావ్ కేసులో అక్రమంగా నిర్బంధించబడ్డ ప్రజా న్యాయవాది సురేంద్ర గాడ్లింగ్ ఎన్ఐఏ కోర్టులు అన్యాయంగా, అక్రమంగా బెయిల్ ఇవ్వకుండా ఇప్పటికీ జైల్లో మగ్గుతున్నారు. ఇవ్వటి కే 2017లో కాకతీయ యూనివర్సిటి పోలీస్ స్టేషన్‌లో 10 మందిపై ఉపా కేసు నమోదు చేశారు. 2018లో ఘన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఇద్దరిపై చెర్ల పోలీస్ స్టేషన్‌లో 119 మందిపై ఉపా కేసు నమోదు చేశారు. అదే విధంగా హైదరాబాద్ ఎల్‌బినగర్‌లో అదే 119 మందిపై ఉపా కేసులు నమోదు చేశారు. 2020లో తాడ్వాయి పోలీస్ స్టేషన్ కేంద్రంగా 119 మందిని పై ఉపా కేసు నమోదు చేశారు. 2020లో వెంకటాపూర్ పోలీస్ స్టేషన్‌లో 14 మందిపై ఉపాకేసు నమోదు చేశారు. 2021లో మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లో ఆరుగురిపై ఉపా కేసు నమోదు చేశారు. ములుగు పి.ఎస్.లో 119 మంది పై ఉపా కేసులు నమోదు చేశారు. మొన్ననే కోర్టు చైతన్య మహిళా సంఘం నాయకులు శిల్ప, దేవేంద్ర, స్వప్నలకు 5 ఏళ్ళ శిక్ష విధించింది. దీనిలో స్వప్నకు మూడేండ్ల పసి బాలుడు ఉన్నాడు. శిక్ష పడ్డ తరువాత నిర్ధాక్షిణ్యంగా తల్లిబిడ్డలను వేరు చేసి తల్లిని జైలుకు పంపించారు. ఇది ఏ విధంగా న్యాయం. అక్రమ కేసులో అన్యాయ తీర్పుతో మానవ సంబంధాలపట్ల ఇంత నిర్ధాక్షిణ్యతను పాటించడం ఎలా న్యాయం అవుతుందో మనం ఆలోచించాలి.

**ఎన్. నారాయణ రావు,**
**ప్రధాన కార్యదర్శి, పౌర హక్కుల సంఘం**

## 22-ఏ సమస్య పరిష్కారానికి కృషి

- ఈటల రాజేందర్‌తో భేటీ అయిన కార్పొరేటర్



**హయత్ నగర్, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో 22-ఏ జాబితా కారణంగా రైతులు, భూ యజమానులు, ప్లాట్ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు మాజీ మంత్రి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ నివాసంలో 22-ఏ సమస్యపై కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొని, హయత్‌నగర్ డివిజన్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో 22-ఏ జాబితా కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఈటల రాజేందర్ దృష్టికి తీసుకువచ్చారు. తమకు హక్కులు ఉన్న భూములు 22-ఏ జాబితాలో ఉండటంతో రిజిస్ట్రేషన్లు, క్రయవిక్రయాలు, ఇతర భూ లావాదేవీలు నిర్వహించడంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా ప్రైవేట్ పట్టా భూములు, రైతుల భూములు, ప్లాట్ యజమానుల ఆస్తులు అనవసరంగా 22-ఏ పరిధిలో ఉండకుండా, అర్హులైన భూ యజమానుల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చట్టపరమైన, పరిపాలనా చర్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సమావేశంలో చర్చించారు. నిజమైన భూ యజమానుల హక్కులకు భంగం కలగకుండా 22-ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని నాయకులు అభిప్రాయపడ్డారు. రైతులు, భూ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి కొనసాగిస్తానని ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి తెలిపారు.

# కేసీఆర్ ప్రతిపక్ష నేతగా పూర్తిగా విఫలం

**ఉప్పల్, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** తెలంగాణలో ప్రధాన ప్రతిపక్ష పార్టీకి నాయకత్వం వహిస్తున్న మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రతిపక్ష నేతగా తన బాధ్యతలను నిర్వర్తించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ప్రజలు ఎన్నుకున్న శాసనసభకు హాజరై ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతిపక్ష నేతపై ఉందని, అయితే కేసీఆర్ ఆ బాధ్యతను విస్మరిస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రతిపక్ష నేత పదవిలో కొనసాగడం కంటే వెంటనే రాజీనామా చేసి ప్రజలకు స్పష్టమైన సందేశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు సెప్టెంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వరుసగా నిరసన ప్రదర్శనలు, బైక్ ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం హబ్సీగూడ డివిజన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రామంతాపూర్ నుంచి హబ్సీగూడ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం హబ్సీగూడ సిగ్నల్ వద్ద కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు.

### రామంతాపూర్ నుంచి హబ్సీగూడ వరకు భారీ బైక్ ర్యాలీ

ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు హబ్సీగూడ డివిజన్, రామంతాపూర్, వెంకట్‌రెడ్డినగర్ డివిజన్లకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. రామంతాపూర్ నల్లపోచమ్మ ఆలయం నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమై స్ట్రీట్ నంబర్ 8 మీదుగా హబ్సీగూడ సిగ్నల్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు కొనసాగింది.
బైక్ ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ జెండాలు ప్రదర్శిస్తూ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. హబ్సీగూడ సిగ్నల్ వద్దకు చేరుకున్న అనంతరం నిరసన ప్రదర్శన నిర్వహించి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కేసీఆర్ వెంటనే ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.
హబ్సీగూడ డివిజన్ ప్రెసిడెంట్ కంది శ్రవణ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు డివిజన్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి హాజరయ్యారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వివిధ డివిజన్ల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు.

### ప్రతిపక్ష నేతగా బాధ్యతలు నిర్వర్తించాలి

బైక్ ర్యాలీ, నిరసన ప్రదర్శనకు ముఖ్య అతిథిగా హాజరైన మందుముల పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు ఎన్నుకున్న శాసనసభకు హాజరై ప్రజల సమస్యలపై మాట్లాడాల్సిన బాధ్యత ప్రతిపక్ష నేతపై ఉందన్నారు. ప్రజలకు సంబంధించిన అనేక సమస్యలు, నియోజకవర్గాల అభివృద్ధి, నిరుద్యోగం, రైతుల సమస్యలు, సంక్షేమ పథకాలు, ఇతర ప్రజా సమస్యలపై శాసనసభలో చర్చ జరగాల్సి ఉన్నప్పటికీ ప్రధాన ప్రతిపక్ష నేతగా కేసీఆర్ సభకు హాజరుకాకపోవడం సరికాదని విమర్శించారు.



### ఉప్పల్‌లో కాంగ్రెస్ నిరసనల హోరు

కేసీఆర్ ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వరుస కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ ఇచ్చిన పిలుపులో భాగంగా నియోజకవర్గంలోని వివిధ డివిజన్లలో బైక్ ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు బొప్పనపల్లి సుధాకర్‌రెడ్డి, హబ్సీగూడ కోఆర్డినేటర్ మహమ్మద్ తౌఫిక్, మాజీ డివిజన్ ప్రెసిడెంట్ గన్నారం విజయ్‌కుమార్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు గణేష్‌నాయక్, రామాలయం చైర్మన్ చింతల బాబురావు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## పటాన్‌చెరు జర్నలిస్టుల కోసం ప్రత్యేక సంక్షేమ నిధి

- అర్హులైన జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం కృషి



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** పటాన్‌చెరు జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఆపత్కాలంలో జర్నలిస్ట్ ల కుటుంబాలకు అండగా నిలిచేందుకు ప్రత్యేక సంక్షేమ నిధి ఏర్పాటు చేయడంతో పాటు అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించేలా కృషి చేస్తామని పటాన్ చెరు నియోజకవర్గ టీయూడబ్ల్యూజే ఐజేయూ అధ్యక్షుడు పత్తి నర్సింహ అన్నారు. గురువారం పటాన్ చెరు ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ లో టీయూడబ్ల్యూజే ఐజేయూ పటాన్ చెరు నియోజకవర్గ నూతన కమిటీ మొదటి కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పటాన్ చెరు నియోజకవర్గంలో జర్నలిస్ట్ లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను కమిటీ సభ్యులు చర్చించారు. ముఖ్యంగా గత ప్రభుత్వ హయంలో కొందరు జర్నలిస్ట్ లకు ఇంటి స్థలాలు కేటాయించడం జరిగిందని కొందరు జర్నలిస్టులకు కొన్ని కారణాల వలన ప్లాట్ల కేటాయింపులో అన్యాయం జరిగిందని కమిటీ దృష్టికి తీసుకుని వచ్చారు. పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ని కలిసి ప్లాట్ల విషయం పై చర్చిస్తే సానుకూలంగా స్పందించి అందరికి ఇండ్ల స్థలాలను అందిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. పటాన్ చెరు నియోజకవర్గ కమిటీ చొరవ తీసుకొని అర్హులైన జర్నలిస్టులందరికీ ప్లాట్లు కేటాయించేలా ముందుకు రావాలని కోరారు. అదే విధంగా పటాన్ చెరు జర్నలిస్ట్ లకు సిటీ బస్ లలో ఉచిత ప్రయాణం కల్పించేలా చూడాలన్నారు. ఆపత్కాలంలో జర్నలిస్టులకు అండగా నిలిచేందుకు గ్రూప్ ఇన్సూరెన్స్ కోసం ప్రయత్నం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఈ విషయంపై అధ్యక్షుడు పత్తి నర్సింహ తో పాటు జర్నలిస్ట్ పెద్దలు మాట్లాడుతూ సంఘం తరపున జర్నలిస్టుల సమస్యను పరిష్కరించేందుకు నిరంతరం పోరాటం కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రుమాండ్ల అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు పర్చ శ్రీనాథ్, పటాన్చెరు నియోజకవర్గ సలహాదారులు కాశిపతి, సులేమాన్, రామారావు, ప్రధాన కార్యదర్శి యాదగిరి, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కమిటీ భాద్యులు శ్రీనివాస్ రెడ్డి, భూపాల్ రెడ్డి, మాజిద్, శ్రీను, నియోజకవర్గ ఉపాధ్యక్షులు విట్టల్, రాజు, నాగేష్, రమేష్, జీవరత్నం, సంయుక్త కార్యదర్శులు వేణు,శ్రీనివాస్, ప్రభాకర్, కోటేశ్, ఆర్గనిసింగ్ సెక్రటరీలు ఆంజనేయులు, మహేష్, రాజు, వివేక్, శ్రీనివాస్, శంకర్ శేఖర్ మహేందర్ గౌడ్ సిద్దు శ్రీనివాస్, నాయుడు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# ఓఆర్ఆర్ పెట్రోలింగ్‌పై అప్రమత్తంగా ఉండాలి

- మల్కాజ్గిరి ట్రాఫిక్ డీసీపీ రాహుల్



**శామీర్‌పేట్, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** ఔటర్ రింగ్ రోడ్‌పై రహదారి భద్రత మరియు అత్యవసర ప్రతిస్పందనను బలోపేతం చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ట్రాఫిక్ డీసీపీ రాహుల్ పేర్కొన్నారు. గురువారం ఔటర్ రింగ్ రోడ్ పై రహదారి భద్రత, అత్యవసర ప్రతిస్పందన, ట్రాఫిక్ నిర్వహణను బలోపేతం చేసే కార్యక్రమంలో భాగంగా మల్కాజిగిరి, ట్రాఫిక్-1 డీసీపీ కె. రాహుల్ రెడ్డి ఐపీఎస్, తిర్మలగిరి డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ జి. శంకర్ రాజు; పీఎస్ ఆల్వాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి. పవన్ కుమార్ రెడ్డి, ట్రాఫిక్ అడ్మినిస్ట్రేషన్ ఇన్‌స్పెక్టర్ కె. రాజు, రోడ్ సేఫ్టీ వింగ్ ఇన్‌స్పెక్టర్ ఎస్. ప్రదీప్ గౌడ్, మరియు ఐఆర్‌బి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బిశ్వజిత్ సింగ్ లతో కలిసి శామీర్‌పేట్ టోల్ గేట్ ఎగ్జిట్-07 ను సందర్శించారు. ఈ పర్యటన సందర్భంగా డీసీపీ రాహుల్ మాట్లాడుతూ..ఓఆర్ఆర్ పెట్రోల్ మొబైల్స్ 1 నుండి 3 వరకు ఉన్న సిబ్బందితో సంభాషించి, ఓఆర్ఆర్‌పై సురక్షితమైన నిరంత రాయమైన ట్రాఫిక్ కదలికను నిర్ధారించడానికి వారి విధులు మరియు బాధ్యతల గురించి వారికి వివరించారు. ఓఆర్ఆర్‌లో తమకు కేటాయించిన మార్గాలలో నిరంతరం గస్తీ కాస్తూ, తమ ఉనికిని స్పష్టంగా కనిపించేలా చూసుకోవాలన్నారు. ఓఆర్ఆర్ పెట్రోలింగ్ సిబ్బంది భద్రతను, వారి ఉనికిని మెరుగుపరిచే చర్యలో భాగంగా,ఓఆర్ఆర్ పెట్రోల్ మొబైల్ సిబ్బంది అందరూ తమ విధులను నిర్వర్తించేటప్పుడు, ముఖ్యంగా రాత్రి వేళల్లో మరియు ప్రతికూల వాతావరణ పరిస్థితులలో, రిఫ్లెక్టివ్ జాకెట్లు ధరించి, ఎల్ఈడీ లాఠీలను వెంట ఉంచుకోవాలని ఆదేశించారు. ఓఆర్ఆర్‌పై ప్రమాదాలను తగ్గించి, సురక్షితమైన ప్రయాణాన్ని నిర్ధారించడానికి నిరంతర పెట్రోలింగ్, ప్రమాదా లను ముందుగానే గుర్తించడం, త్వరితగతిన స్పందించడం మరియు సంబంధిత వర్గాలతో సమర్థవంతమైన సమన్వయం చాలా అవసరమని డీసీపీ నొక్కి చెప్పారు.

# మెదక్ టౌన్ పీఎస్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ

**మెదక్ టౌన్, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** మెదక్ టౌన్ పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, సాంకేతిక వ్యవస్థల అమలు తీరును పరిశీలించారు. టౌన్ ఇన్‌స్పెక్టర్ మహేష్ నుంచి స్టేషన్‌కు సంబంధించిన పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. కెమెరాల రికార్డింగ్, స్టేషన్ పరిసరాలపై నిఘా తదితర అంశాలపై ఇన్‌స్పెక్టర్ మహేష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ ప్రాంగణంలో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించి, వాటికి సంబంధించిన కేసుల వివరాలను ఆరా తీశారు. ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్, జీరో ఎఫ్ఐఆర్ విధానాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఎస్పీ సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును నిబంధనల మేరకు స్వీకరించి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా చూడాలన్నారు. కేసులకు సంబంధించిన సాక్ష్యాధారాలను ఈ-సాక్ష్యలో నిబంధనల ప్రకారం నమోదు చేసి భద్రపరచాలని సూచించారు. దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. సీసీటీఎన్ఎస్‌లో కేసులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, రికార్డుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని ఆదేశించారు.



పెండింగ్ రిపోర్టులను త్వరితగతిన పూర్తి చేసి, దర్యాప్తు ప్రక్రియలో పారదర్శకత, క్రమశిక్షణ పాటించాలని ఎస్పీ స్పష్టం చేశారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తును వేగవంతం చేయాలని, కేసుల పరిష్కారానికి అవసరమైన చర్యలను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించి, వారి సమస్యలను సానుకూలంగా పరిష్కరించేలా సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పోలీసింగ్ సేవలు అందిస్తూ పోలీస్ శాఖపై నమ్మకాన్ని మరింత పెంపొందించేలా పనిచేయాలని ఎస్పీ సూచించారు. ఎస్పీ వెంట సీఐలు సందీప్‌రెడ్డి, మహేష్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ప్రజా సమస్యలను తీర్చడమే లక్ష్యం

- మాజీ ఎంపీపీ వై. రవీందర్ యాదవ్



**కేశంపేట, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** గ్రామాల్లో నెలకొని ఉన్న ప్రజా సమస్యలను తీర్చడమే తన లక్ష్యమని మాజీ ఎంపీపీ వై. రవీందర్ యాదవ్ అన్నారు. మండల పరిధిలోని చౌలపల్లి గ్రామంలో తన సొంత నిధులతో కోట మైసమ్మ దేవాలయం నుండి హనుమాన్ దేవాలయం వరకు మట్టి రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. మట్టి రోడ్డు పనులను గ్రామస్తులతో కలిసి రవీందర్ యాదవ్ ప్రారంభించారు. గ్రామస్తులు దేవాలయాకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతుండటంతో మట్టి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం జరింగిందని రవీందర్ యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి పల్లె నర్సింగ్ రావు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మురళీధర్ రెడ్డి, ఎన్నారై గోగు వెంకట్ నారాయణరెడ్డి, సర్పంచులు హరి శేఖర్, వేణుగోపాల్, భాస్కర్ నాయక్, రమేష్ యాదవ్, ధనలక్ష్మి రామకృష్ణ, నాయకులు పర్వత రెడ్డి, శ్రీశైలం, వెంకట్ రెడ్డి, లక్ష్మీనారాయణ, జమాల్ ఖాన్, బీరప్ప, నవీన్ కుమార్, వెంకటేష్ యాదవ్, జగన్మోహన్ రెడ్డి, ప్రేమ్ కుమార్ గౌడ్, శ్రీనివాస్, రామకృష్ణ, నాగేష్, రాజశేఖర్, శ్రీను, దర్శన్ , గోపాల్, శేఖర్, షకీల్, గణేష్ గౌడ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### అనుమతులు లేకుండా అక్రమ బ్లాస్టింగ్

- ఇద్దరు అరెస్ట్
- పేలుడు పదార్థాలు స్వాధీనం

**యాచారం, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** యాచారం మండలం నజ్దిక్ సింగారం గ్రామంలో అక్రమ బ్లాస్టింగ్ కు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను యాచారం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం నజ్దిక్ సింగారం గ్రామంలోని వాసవి వెంచర్, సర్వే నంబర్లు 144, 145, 153, 154 వద్ద ప్రభుత్వ అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలతో బ్లాస్టింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసులు పంచ సాక్షులు మరియు పెట్రోల్ మొబైల్-1 సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ బ్లాస్టింగ్ చేయడానికి ప్రయత్నిస్తున్న లికోడదల నాగేందర్ (27), నల్గొండ జిల్లాలి మరియు లిశివరాత్రి రమేష్ (35), నల్గొండ జిల్లా లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 33 జెలటిన్ స్టిక్స్, 50 మీటర్ల డీటోనేటర్ వైర్ , ఒక కంప్రెసర్ ట్రాక్టర్ మరియు రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో వారు అవసరమైన ప్రభుత్వ అనుమతులు లేకుండానే బ్లాస్టింగ్ పనులు నిర్వహిస్తున్నట్లు, భూమి యజమాని లితొట రాంబాబు, హైదరాబాద్ సూచనల మేరకు పనులు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా చట్ట విరుద్ధంగా ఎవరైనా పేలుడు పదార్థాలను కలిగి ఉన్నా, వాటిని ఉపయోగించి బ్లాస్టింగ్ పనులు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

# చేవెళ్ల పట్టణ సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేద్దాం

- రూ.15 కోట్ల అభివృద్ధి పనులు టెండర్ దశలో.. త్వరలో ప్రారంభం
- మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి

**చేవెళ్ల, సెప్టెంబర్ 3 (జనంసాక్షి) :** చేవెళ్ల పట్టణ అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం చేవెళ్ల పురపాలక సంఘ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కౌన్సిల్ సభ్యులు, అధికారులు సుదీర్ఘంగా చర్చించారు. వార్డు సభ్యులు తమ వార్డుల పరిధిలో నెలకొన్న డ్రైనేజీ, విద్యుత్, తాగునీటి సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. తాగునీటి సమస్య పరిష్కారానికి అదనంగా బోర్‌వెల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే 'నగరాభివృద్ధి పథకం' కింద రూ. 15 కోట్లతో చేపట్టనున్న పనులు ఇంకా ప్రారంభం కాకపోవడంపై సభ్యులు ప్రశ్నించారు. దీనిపై సంబంధిత ఏఈ స్పందిస్తూ పనులు ప్రస్తుతం టెండర్ ప్రక్రియలో ఉన్నాయని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు, కౌన్సిలర్లు పరస్పర సహకారంతో పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కమిషనర్ బి.యాదగిరి మాట్లాడుతూ.. వార్డు సభ్యులు తమ పరిధిలోని సమస్యలను ఎప్పుడైనా పురపాలక కార్యాలయానికి వచ్చి అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. వీధి దీపాలకు సంబంధించి 'థర్డ్ వైర్' ఏర్పాటు అంశంపై కూడా సమావేశంలో చర్చించారు. రహదారుల మలుపుల వద్ద కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించగా, ఈ విషయమై ఇప్పటికే విద్యుత్ శాఖకు లేఖ రాసినట్లు కమిషనర్ తెలిపారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు బండారి శైలజాఆగి రెడ్డి, కల్యాణి యాదగిరి, బక్కారెడ్డి మాధవి యాదిరెడ్డి, సోలిపురం సుచిత బల్వంత్‌రెడ్డి, పైండ్ల



మధుసూదన్‌రెడ్డి, మద్దెల శ్రీనివాస్, మూడవత్ క్రిష్ణా నాయక్, తాళ్లపల్లి నర్సింలు, కరికే మీనాక్షి సత్యనారాయణ, పెద్దోళ్ల దయాకర్, కుర్వ మంగమ్మ మల్లేష్, దేవులపల్లి శ్రీనివాస్‌రెడ్డి, దూత మల్లేష్, డప్పు సువర్ణ చందు, కోఆప్షన్ సభ్యులు బక్కారెడ్డి రవీందర్‌రెడ్డి, మహమ్మద్ చాన్‌పాషా, ఫర్హీన్ బేగం ఖదీర్, పురపాలక అధికారులు, మేనేజర్లు ఉమేందర్‌సింగ్, నరేందర్, అకౌంట్స్ ఆఫీసర్ కృష్ణయ్య, ఏఈ ప్రభాకర్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఐదుగురు గంజాయి నిందితులు అరెస్ట్

- తూప్రాన్ సిఐ వెంకట్రాజు గౌడ్



**తూప్రాన్, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అలావుద్దీన్, లవకుష్, హన్స్రాజ్, దినేష్, యస్తామికుమార్ అనే ఐదుగురు వ్యక్తులు షబాష్‌పల్లి ప్రాంతంలోని కంపెనీలో పని చేసేందుకు వచ్చినట్లు వారి వద్ద గంజాయి తో సంబంధం ఉండడంతో ఐదుగురిని అరెస్టు చేసినట్లు తూప్రాన్ సిఐ వెంకటరాజు గౌడ్ తెలిపారు. వీరిలో అలావుద్దీన్ మరియు లవకుష్ ఉత్తరప్రదేశ్ నుండి తమ వెంట సుమారు 100 గ్రాముల గంజాయిని తీసుకువచ్చినట్లు పోలీసుల విచారణలో గుర్తించారు. విశ్వసనీయ సమాచారం మేరకు తూప్రాన్ పోలీసులు నిన్న వీరిని అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగించగా, గంజాయి వ్యవహారంతో సంబంధం ఉన్న మరో ముగ్గురు వ్యక్తులు హన్స్రాజ్, దినేష్ , యస్తామికుమార్లను కూడా పోలీసులు గుర్తించారు. మొత్తం ఐదుగురిపై సంబంధిత చట్టపరమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం ఈరోజు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ కార్యక్రమం లో ఎస్ఐ గంగరాజు, ఎస్ఐ యాదగిరి మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

- నిర్ణీత గడువులో పూర్తి కావాల్సిందే..
- భారత్ మాల, రైల్వే లైన్ భూసేకరణ వేగవంతం
- కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** జిల్లాలో వివిధ సాగునీటి ప్రాజెక్టులు, భారత్ మాల జాతీయ రహదారి, రైల్వే లైన్ డబ్లింగ్, పారిశ్రామిక ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను వేగవంతం చేసి పెండింగ్ అంశాలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో భారత్‌మాల, జాతీయ రహదారులు, రైల్వే లైన్ డబ్లింగ్, బ్రహ్మోస్ క్షిపణి తయారీ కర్మాగారం, కురుమూర్తి దేవాలయ అభివృద్ధి, ఎంజీకేఎల్ఐ, లక్ష్మీదేవిపల్లి, అజిలాపూర్ ఎత్తిపోతల ప్రాజెక్టుల భూసేకరణతో పాటు పునరావాస పరిహార కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

### పెండింగ్ కేసులపై సీరియస్

మహబూబ్‌నగర్ రూరల్, భూత్పూర్, దేవరకద్ర మండలాల పరిధిలో భూసేకరణ పురోగతిని సమీక్షిస్తూ అవార్డుల ప్రక్రియ, పరిహారం చెల్లింపులు, ఖాతా ధ్రువీకరణ, న్యాయస్థాన కేసులు, వివాదాస్పద భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించి, న్యాయస్థాన పరిధిలో ఉన్నవి, ఇతర వివాదాలను స్పష్టంగా వర్గీకరించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

దేవరకద్ర మండలంలో పెండింగ్ కేసుల నివేదికల సమర్పణలో జాప్యం చేయకుండా వెంటనే నివేదికలు సమర్పించాలని, ఓఎస్ నంబర్లను నివేదికల్లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. వచ్చే సమీక్ష నాటికి పెండింగ్ కేసులను పూర్తిగా పరిష్కరించాలని స్పష్టం చేశారు.

### జాతీయ రహదారి సమస్యలపై ప్రత్యేక సమీక్ష

భూత్పూర్ మండలంలో జాతీయ రహదారి భూసేకరణకు సంబంధించి స్థానికుల నుంచి ఎదురవుతున్న సమస్యలను ప్రత్యేకంగా సమీక్షించారు. జాతీయ రహదారుల అధికారులతో సమన్వయం చేసుకుని భూ యజమానులతో సమావేశం నిర్వహించి వారి అభ్యంతరాలను నమోదు చేయాలని ఆదేశించారు. వచ్చే వారంలోగా స్థానికులతో సమావేశం నిర్వహించి నివేదిక సమర్పించాలని సూచించారు.

### రైల్వే డబ్లింగ్, పరిశ్రమల భూసేకరణ

రైల్వే లైన్ డబ్లింగ్‌కు సంబంధించి అవార్డుల ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేసి పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని ఆదేశించారు. రైల్వే స్టేషన్ల విస్తరణకు అవసరమైన భూసేకరణను కూడా పూర్తి చేయాలన్నారు.

బ్రహ్మోస్ క్షిపణి తయారీ కర్మాగారానికి అవసరమైన ప్రైవేట్ భూముల సర్వేను అదనపు సర్వేయర్లను నియమించి పది రోజుల్లో పూర్తి చేయాలని, అమరరాజా పరిశ్రమకు రహదారి నిర్మాణ భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

### సాగునీటి ప్రాజెక్టులు, దేవాలయ అభివృద్ధి

కురుమూర్తి దేవాలయ అభివృద్ధి పనులకు అవసరమైన భూముల ప్రతిపాదనలు, నివేదికలను త్వరగా సిద్ధం చేయాలని, లక్ష్మీదేవిపల్లి, అజిలాపూర్ ఎత్తిపోతల ప్రాజెక్టులకు సంబంధించి పరిహారం చెల్లింపు దస్త్రాలను వెంటనే సిద్ధం చేసి పరిహారం చెల్లింపులు ప్రారంభించాలని ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో ఏ దశలోనూ జాప్యం జరగకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్ రెడ్డి, ఆర్డీఓ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సహజ, సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ



**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** రైతులు తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు సాధించ డంతో పాటు భూసారాన్ని పరిరక్షించేందుకు సహజ, సేంద్రియ వ్యవసాయ పద్ధతులను విస్తృతంగా అవలంబించాలని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, నారాయణపేట సమన్వయకర్త డా. ఈటెల సత్యనారాయణ సూచించారు. ఎటిఎంఎ సమన్వయంతో రైతులకు సహజ వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయం,భూసార ఆరోగ్య నిర్వహణ, పంటల వైవిధ్యీకరణ, నానో ఎరువుల వినియో గంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. ఈటెల సత్య నారాయణ రైతులకు భూసార పరీక్షల ప్రాధాన్య తను వివరించి, నేల అవస రాలకు అనుగుణంగా సమతుల్య ఎరువుల వినియోగం చేపట్టాలని సూచించారు. అధిక రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తూ సేంద్రియ ఎరువులు, జీవ ఎరువులు, సహజ వ్యవ సాయ పద్ధతులను సమ ర్థవంతంగా ఉపయోగిం చుకోవాలని తెలిపారు.అలాగే తక్కువ నీటితో సాగు చేయగల పప్పుధా న్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజల పంటలను ప్రోత్సహించడం ద్వారా పంటల వైవిధ్యీకరణ చేపట్టాలని సూచించారు. నానో ఎరువులను శాస్త్రీ య సూచనల మేరకు, సరైన మోతాదులో విని యోగిస్తే ఎరువుల విని యోగ సామర్థ్యాన్ని మెరు గుపరచుకోవచ్చని వివరిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సాక్రియా నాయక్,డి పి డి ఎ టి ఎం ఎ శాంతి నిర్మల, వ్యవసాయ అధికారి బాల దినకర్, సింగారం గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి, ఎ ఈ ఓ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై కమిషనర్ ఆకస్మిక తనిఖీ



**మెదక్ మున్సిపల్, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని కాంట్రాక్టర్లకు ఆదేశాలు మెదక్ పట్టణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పర్యవేక్షణలో భాగంగా మెదక్ మున్సిపల్ కమిషనర్ వై. నవీన్ గురువారం నాడు 11వ, 13వ వార్డుల్లో ఆకస్మికంగా పర్యటించి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. 11వ వార్డులో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను, 13వ వార్డులో కొనసాగుతున్న సీసీ డ్రైన్ నిర్మాణ పనులను కమిషనర్ పరిశీలించారు. పనుల పురోగతిని, నిర్మాణ నాణ్యతను స్వయంగా తనిఖీ చేసిన ఆయన, ప్రజలకు ఉపయోగకరంగా ఉండే విధంగా పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 11వ వార్డు ప్రజలు మున్సిపల్ కమిషనర్ వై. నవీన్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. పట్టణ అభివృద్ధికి సంబంధించి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనులను పర్యవేక్షించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీ జె. నితిన్, మాజీ కౌన్సిలర్ శ్రీ సమ్మియోద్దీన్, నాయకులు సిహెచ్. నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమాన్ని గాలికొదిలిన కాంగ్రెస్ ప్రభుత్వం

- కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలనపై బిఆర్ఎస్ పోరాటం
- సంగారెడ్డిలో రైతు అవగాహన సదస్సు, వంటావార్పు
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తీవ్రస్థాయిలో ధ్వజం




**సంగారెడ్డి, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం రైతు అవగాహన సదస్సు, వంటావార్పు కార్యక్రమాలను నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

### 'వెయ్యి రోజుల పాలనపై సంబరాలా..?'

రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను సంబరంగా జరుపుకోవాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని చింత ప్రభాకర్ విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా సంబరాలు ఎలా జరుపుకుంటారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో అనేకం ఇంకా అమలుకు నోచుకోలేదన్నారు. ముఖ్యంగా రైతులకు ఇచ్చిన హామీల పరిస్థితి మరింత దారుణంగా ఉందని ఆరోపించారు. రైతులు అనేక సమస్యలతో సతమతమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు.

### రైతన్నలను ఆగం చేసిన కాంగ్రెస్

కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు కల్పించిన భరోసా, ప్రస్తుత పాలనలో కనిపించడం లేదన్నారు.

### హామీలు అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను తక్షణమే అమలు చేయాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ డిమాండ్ చేశారు. రైతులు, ప్రజల సమస్యలను పరిష్కరించే వరకు బీఆర్ఎస్ పార్టీ పోరాటం ఆపదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జణజ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, సీనియర్ నాయకులు డాక్టర్ శ్రీహరి, కొండల్ రెడ్డి, మనోహర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు విఠల్, మధుసూదన్ రెడ్డి, చక్రపాణి, ఆంజనేయులు, సదాశివపేట పట్టణ అధ్యక్షులు చీల మల్లన్న, పట్టణ కార్యదర్శి వీరేశంతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వెయ్యి రోజుల పాలనలో సంక్షేమానికి ప్రాధాన్యం

- అభివృద్ధిలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందంజ
- కాంగ్రెస్ శ్రేణులు ఆనందోత్సవాలతో ర్యాలీ



**బెజ్జంకి, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన వెయ్యి రోజుల పాలనలో ప్రజా సంక్షేమం,అభివృద్ధికి పెద్దపీట వేసిందని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా గురువారం బెజ్జంకి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి ఎడ్లబండి చౌరస్తా వరకు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కత్తి రమేష్ ఆధ్వర్యంలో ఆనందోత్సవాలతో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం,అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది అనీ అన్నారు.గత ప్రభుత్వం రాష్ట్రంపై భారీగా అప్పుల భారం మిగిల్చిందని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం తక్కువ సమయంలోనే పేదలు,మహిళలు,విద్యార్థులు,రైతుల,ఉద్యోగుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టింది అని అన్నారు.రైతు రుణమాఫీ,రైతు భరోసా,200 యూనిట్ల ఉచిత విద్యుత్,రైతు బీమా,రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడంతో పాటు,కొత్త రేషన్ కార్డులు అందజేస్తున్నామని,రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు.రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని,వెయ్యి రోజుల్లో 70 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు.కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలోని ప్రతి గ్రామంలోనూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతోంది అనీ అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి అక్కరవేణి పోచయ్య ముదిరాజ్,ఏఎంసీ వైస్ చైర్మన్ చిలివేరు శ్రీనివాస్‌రెడ్డి,మాజీ మండల అధ్యక్షులు ముక్కిస రత్నాకర్‌రెడ్డి,చెప్యాల శ్రీనివాస్‌గౌడ్,సర్పంచులు గుడెల్లి శ్రీకాంత్,పులి రమేష్,రాజిరెడ్డి,జెట్టి రమేష్,ఉప సర్పంచ్ పోతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి,మాజీ టెంపుల్ చైర్మన్ జెల్ల ప్రభాకర్‌యాదవ్,మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య,పీఏసీఎస్ డైరెక్టర్లు అడుకాని నర్సింగం,బైర సంతోష్,గంగాధర రామచంద్రం,మాషం శంకర్,తుమ్మ సుధాకర్,నాయకులు పర్స సంతోష్,జంగిలి సంపత్, బోనగం రమేష్,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కర్రావుల సందీప్,గ్రామశాఖల అధ్యక్షులు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## చెన్నారంలో రైతుల ఆందోళన

- కరెంట్, సాగునీటి కోసం రోడ్డెక్కిన అన్నదాతలు



**రేవల్లి, సెప్టెంబర్ 03 (జనంసాక్షి) :** ఏదుల మండలంలోని చెన్నారం గ్రామంలో రైతులు కరెంట్, సాగు నీళ్ల కోసం ఉదయం 07 గంటల నుండి ధర్నాకు దిగారు. వరి పంటలు ఎండిపోతున్నా సకాలంలో కరెంట్ సరఫరా లేకపోవడం, కాలువలకు సాగునీరు విడుదల చేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ మోటార్లకు 24 గంటల్లో కనీసం 07 గంటలైనా త్రీ ఫేజ్ కరెంట్ ఇవ్వడం లేదని, ఇచ్చినా లో-వోల్టేజీ సమస్యతో మోటార్లు కాలిపోతున్నాయని వాపోతున్నారు.

సాగు నీరు అందక పంటలు చేతికి రాకుండా పోయే ప్రమాదం ఉందని, అధికారులు వెంటనే స్పందించి సాగునీరు విడుదల చేయాలని, నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు ధర్నా కొనసాగిస్తామని రైతులు స్పష్టం చేశారు.

### ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం

ప్రస్తుతం అన్ని గ్రామాలలో 12 గంటల త్రీఫేస్ సప్లై ఇస్తున్నామని, లోడ్ మానిటరింగ్ రిపోర్ట్ సెంటర్ అధికారులతో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని రేవల్లి మండల విద్యుత్ శాఖ అధికారి సురేష్ చారి తెలిపారు.

## అబద్ధపు హామీలతో కాంగ్రెస్‌కు అధికారం

- మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్




**టేక్మాల్, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, నోటికొచ్చినట్లు 420 హామీలు ఇచ్చి, కనిపించిన ప్రతి దేవుడిపై ఒట్టేసి ప్రజలను మోసగించి ఓట్లు దండుకుందని బీఆర్ఎస్ మాజీ అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ మండిపడ్డారు.ఏ విధంగానైనా అధికారంలోకి రావాలనే కుట్రపూరిత వైఖరితో కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారంటీ కార్డులను పంచి, అనేక హామీలు ఇచ్చి ప్రజలను దగా చేశారని ఆరోపించారు.కాంగ్రెస్ 1000 రోజుల పాలనా వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కంటే వైఫల్యాలే ఎక్కువగా కనిపిస్తున్నాయని విమర్శించారు.వచ్చే రెండేళ్లలో కూడా ప్రజలకు ఒరిగేదేమీ ఉండదని, ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వైపు ఆశగా చూస్తున్నారని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జైపాల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వీరప్ప, కమ్మరి సిద్ధయ్య, నాయి కోటి భాస్కర్, గోవింద్ చారి, సలీం, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ విజయవంతం చేసేందుకు సహకరించాలి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** అర్హులైన వారందరికీ ఓటు హక్కు ఉండేలా ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం మ్యాపింగ్ కానీ, అనామిలిస్ జాబితాలో ఉన్న వారందరికీ నోటీసులు ఇస్తున్న నేపథ్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమై మాట్లాడారు. జిల్లాలో మొత్తం 1,49,282 మందికి నోటీసులు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటివరకు సుమారు 36,000 మందికి ఇవ్వడం జరిగిందన్నారు. కొంతమంది ఓటర్లు అందుబాటులో లేకపోవడం ఇతర కారణాలతో ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉన్నందున రాజకీయ పార్టీల ప్రతినిధులు, బిఎల్ఎ లు బిఎల్వోలకు సహకరించేలా చూడాలన్నారు. తప్పులు లేని, పారదర్శకమైన ఓటరు జాబితాలను రూపొందించేందుకు ఎన్నికల సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లాలో విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ తోడ్పాటును అందించాలన్నారు. ఏ, బి, సి కేటగిరీల వారీగా ఉన్న వ్యక్తులు ఇవ్వాల్సిన డాక్యుమెంట్స్ పై ఎన్నికల సిబ్బందికి స్పష్టమైన అవగాహన కలిగిస్తూ దిశా నిర్దేశం చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగానే ఈనెల 5న మున్సిపల్ కౌన్సిలర్లకు, సర్పంచులకు, వార్డు అధికారులకు, గ్రామపంచాయతీ కార్యదర్శులకు కూడా శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని ఎన్నికల విభాగం అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్,ఆర్డీవో శ్రీనివాసరావు,ఎన్నికల విభాగం అధికారి మంజుల,గద్వాల తహసిల్దార్ హరికృష్ణ, ఇతర అధికారులు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



### ఈవీఎం గోడౌన్ పరిశీలన

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను ఈవీఎంల నెలవారి సాధారణ తనిఖీలో భాగంగా గురువారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి సందర్శించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మంజుల,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు,ఎన్నికల విభాగం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## విద్య, వైద్యం, వసతులకే ప్రాధాన్యత

- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల, సెప్టెంబర్ 3 (జనంసాక్షి) :** విద్య, వైద్యం, రహదారుల అభివృద్ధికి తొలి ప్రాధాన్యత ఇస్తూ జడ్చర్లను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తానని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం అందించే స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చర్లపల్లి గ్రామంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అర్హులందరికీ రేషన్ కార్డులు, సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందిస్తున్నామన్నారు. చర్లపల్లి గ్రామాభివృద్ధికి రూ.30 లక్షల మూడా నిధులు కేటాయించామని, పోరాడి జడ్చర్లకు 30 శాతం నిధులు సాధించామని పేర్కొన్నారు. త్వరలోనే చర్లపల్లి-గంగాపూర్ రహదారి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. బాలానగర్‌లో రూ.2 కోట్ల హెచ్ఎండీఏ నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గానికి ట్రైబల్ ట్రిపుల్ ఐఐటీ, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, నవోదయ విద్యాలయం మంజూరుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## దేశంలోనే ఆదర్శవంతమైన విధంగా బ్రేక్ ఫాస్ట్ పథకం

- పేద విద్యార్థుల ఆకలి తీర్చడానికే బ్రేక్ ఫాస్ట్ పథకం
- విద్యారంగ వ్యవస్థను పటిష్టం చేయడమే ప్రభుత్వ ధ్యేయం
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ



**శాయంపేట, సెప్టెంబర్ 3 ( జనం సాక్షి) :** శాయంపేట మండల కేంద్రంలోని బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. విద్యార్థినులతో కలిసి అల్పాహారాన్ని పరిశీలించి,వారికి అందుతున్న ఆహారం నాణ్యతపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ విద్యను మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంను ప్రవేశపెట్టి, ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పేద విద్యార్థులు ఆకలితో పాఠశాలకు రాకుండా ఉండేందుకు ప్రభుత్వం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని, విద్యార్థుల సంక్షేమాన్ని తల్లిదండ్రుల బాధ్యతగా భావించి అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతోందని అన్నారు.దేశంలోనే ఆదర్శవంతమైన విధంగా బ్రేక్‌ఫాస్ట్ పథకం, మధ్యాహ్న భోజన పథకాలను అమలు చేస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తోందని తెలిపారు. శాయంపేట మండలంలోని 27 పాఠశాలలు, ఒక జూనియర్ కళాశాలలో మొత్తం 922 మంది విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, నూతన భవనాల నిర్మాణం, డిజిటల్ విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు,పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక నిధులు వంటి కార్యక్రమాల ద్వారా విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పాఠశాల భవనాల మరమ్మతులు చేపట్టడంతో పాటు ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేస్తూ విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారనే విషయానికి అనేక ఉదాహరణలు ఉన్నాయని,బీసీ వెల్ఫేర్ శాఖ కార్యదర్శి సైదులు కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివి ఉన్నతాధికారిగా ఎదిగారని గుర్తుచేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, కార్యకర్తలు, విద్యార్థినులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

- అటవీ ఉత్పత్తులతో స్థానికంగానే ఉపాధి అవకాశాలు పెంపొందించాలి
- మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ఏటూరునాగారం, సెప్టెంబర్ 03(జనంసాక్షి) :** మహిళలు నైపుణ్యాలను పెంపొందించుకొని స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని, స్థానికంగా లభించే అటవీ ఉత్పత్తులను సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సూచించారు. గురువారం ఏటూరు నాగారం మండల కేంద్రంలో ట్రెజరీ కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన దుస్తుల తయారీ, జూట్ బ్యాగుల తయారీ యూనిట్లను ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ మహిళలు సొంత కాళ్లపై నిలబడేలా ప్రోత్సహించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మహిళా సంఘాలకు బ్యాంకుల అనుసంధానంతో వడ్డీ లేని రుణాలు అందిస్తూ స్వయం ఉపాధికి తోడ్పాటు అందిస్తున్నామన్నారు. మహిళలు కుట్టు నైపుణ్యాలను నేర్చుకొని సొంతంగా యూనిట్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఆదాయం పొందడంతోపాటు మరికొందరికి ఉపాధి కల్పించవచ్చని పేర్కొన్నారు. మహిళలకు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు రూ.10 లక్షలతో ఆధునిక యంత్రాలను సమకూర్చినట్లు తెలిపారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన, ఆదివాసీ మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రాల ద్వారా ప్రోత్సాహం అందిస్తున్నామని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల అవసరాలకు ఉపయోగపడే వస్తువులను తయారు చేయడం ద్వారా స్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చని సూచించారు. ములుగు నియోజకవర్గంలో ప్రైవేటు సంస్థల సహకారంతో సుమారు 2,000 మందికి శిక్షణ అందించినట్లు మంత్రి తెలిపారు. శిక్షణ పొందిన మహిళలకు మహిళా సంఘాలు, గ్రామీణాభివృద్ధి శాఖ, ఐటీడీఏ ద్వారా కుట్టు యంత్రాలు అందించే అంశంపై కృషి చేస్తున్నామన్నారు. బీసీ సంక్షేమ శాఖ ద్వారా నియోజకవర్గానికి 1,000 కుట్టు యంత్రాలు అందిస్తామని పేర్కొన్నారు. కుట్టు శిక్షణ పూర్తిచేసిన వారి జాబితాలను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. గిరిజన మహిళలకు ఐటీడీఏ ద్వారా ఉచితంగా కుట్టు యంత్రాలు అందించేందుకు ముఖ్యమంత్రిని కోరుతున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తయిన తర్వాత మహిళలు తమ ఇళ్ల వద్దనే కుట్టు యంత్రాలను ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందేలా ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. పాఠశాలలు, వసతిగృహాల విద్యార్థులతోపాటు అంగన్‌వాడీ పిల్లల ఏకరూప దుస్తుల కుట్టు పనులను మహిళలకు అందించడం ద్వారా ఉపాధి అవకాశాలు పెంపొందిస్తామన్నారు. ఏకరూప దుస్తుల కుట్టు చార్జీలను పెంచాలన్న అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. ఇటువంటి శిక్షణ, తయారీ కేంద్రాలను మరిన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గోనెపల్లిలో తేనె ఉత్పత్తికి సంబంధించిన శిక్షణ అందిస్తున్నారని తెలిపారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానిక వనరులతో సొంత గ్రామాల్లోనే వ్యాపారాలు నిర్వహించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల్లో భోజనాలకు విస్తరాకులను వినియోగించాలని మంత్రి సూచించారు. మేడారం జాతర సందర్భంగా మంత్రులు, సిబ్బంది, పోలీసులతోపాటు వేలాది మందికి భోజనాలు అందించేందుకు కామారం నుంచి సేకరించిన ఆకులను ఉపయోగించినట్లు గుర్తుచేశారు. ఆకులు లభించే చెట్లను, తేనె ఉత్పత్తికి దోహదపడే అటవీ వనరులను సంరక్షించుకోవాలని సూచించారు. జిల్లాలో ఏయే ప్రాంతాల్లో ఎటువంటి అటవీ ఉత్పత్తులు లభిస్తున్నాయి, వాటితో ఎలాంటి వస్తువులు తయారు చేయవచ్చనే అంశాలపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ఇద్దరు లేదా ముగ్గురు యువతకు అధ్యయన బాధ్యతలు అప్పగించి, స్థానిక వనరుల ఆధారంగా ఉపాధి అవకాశాలను గుర్తించాలని సూచించారు. మహిళలకు నైపుణ్య శిక్షణ అందిస్తున్న నిర్వాహకులను మంత్రి అభినందించారు. అనంతరం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి మంత్రి అనసూయ సీతక్క పదిమంది విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను, ఏటూరు నాగారం మండల పరిధిలోని 1,219 మంది లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో తొలిసారిగా ఎంపిక చేసిన 11 ఉత్తమ పాఠశాలలకు సంబంధించిన అవార్డులను ఆయా ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఇన్‌చార్జి ఏపీఓ ప్రతాప్, గిరిజన సంక్షేమ శాఖ డీడీ జనార్థన్, ఆత్మ కమిటీ చైర్పర్సన్ రఘు , డివిజన్ చైర్పర్సన్ రవీందర్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులతో నిరుపేదలకు భరోసా

- పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య



**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** అనారోగ్యంతో బాధపడుతూ ఖరీదైన వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేని నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. వైద్య ఖర్చులతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా చేయూత అందిస్తోందని తెలిపారు. హనుమకొండ కనకదుర్గ కాలనీలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో గురువారం వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 11 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.6.50 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎంపీ డాక్టర్ కడియం కావ్య పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ.. పేద ప్రజలకు అత్యవసర సమయంలో వైద్య సహాయం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వ సహాయం అందేలా తన వంతు కృషి చేస్తానని ఎంపీ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ కేంద్రం ప్రారంభం



**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 3 (జనం సాక్షి) :** మత్తు పదార్థాలకు బానిసలై తమ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టుకుంటున్న యువతను తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో నూతనంగా ఆధునికీకరించిన అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ (ఏటీఎఫ్) కేంద్రాన్ని ఈగల్ ఫోర్స్ వారి సహకారంతో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ఏటీఎఫ్ కేంద్రాన్ని వరంగల్ సిపి శ్వేత, ఐపిఎస్ గురువారం ప్రారంభించారు. మద్యం, పొగాకు, గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వ్యసనం నేడు యువతతో పాటు వారి కుటుంబాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న ప్రధాన సామాజిక సమస్యగా మారింది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వ మరియు విక్రయాలపై డ్రగ్స్ కంట్రోల్ టీమ్ ఆధ్వర్యంలో కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతోంది. అదే సమయంలో మత్తు పదార్థాలకు బానిసలైన యువతను శిక్షించడం మాత్రమే కాకుండా, వారిని వ్యసన విముక్తి చేసి తిరిగి ఆరోగ్యకరమైన జీవితంలోకి తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతోంది. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా, జి.ఓ. ఎం.ఎస్. నెం.4, తేదీ 10-02-2026 ప్రకారం ఎంజీఎం ఆసుపత్రిలో అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ ఏర్పాటు చేయబడింది. సరైన సమయంలో చికిత్స, కౌన్సెలింగ్ మరియు కుటుంబ సభ్యుల సహకారం ద్వారా మత్తు బానిసత్వం నుంచి పూర్తిగా బయటపడే అవకాశం ఉంది. డీ-అడిక్షన్ చికిత్స అవసరమైన వారు ఎంజీఎం ఆసుపత్రిలోని కేంద్రాన్ని సంప్రదించి అవసరమైన సేవలను పొందవచ్చు.అవసరమైన సహాయం కోసం సమీప పోలీస్ స్టేషన్ అధికారులను, ఎంజీఎం మానసిక వైద్య సిబ్బందిని కూడా సంప్రదించవచ్చు . మత్తు పదార్థాల వ్యసనానికి సంబంధించిన ఏదైనా సహాయం, సమాచారం లేదా మార్గదర్శకత్వం కోసం 87125 84473/87126 85299 సంప్రదించాలని కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, ఎస్. బి యం. జి. యం సూపరింటెండెంట్ డా. రాంరెడ్డి, ఆర్.యం.ఓ అశ్వని కుమార్, ఎస్. బి ఇంచార్జి ఏసీపీ మధుసూదన్, డ్రగ్స్ కంట్రోల్ టీం ఇన్స్ స్పెక్టర్ సాయి రాం, ఆర్.ఐ శివ కేశవులు, ఈగల్ టీం ఇన్స్ స్పెక్టర్ రవీందర్, ఐటీ కోర్ ఇన్స్ స్పెక్టర్ కిరణ్ కుమార్, ఈగల్ టీం ఎస్. ఐ శ్రీకాంత్,ఆర్. ఎస్. ఐలు పూర్ణ చందర్ రెడ్డి,మనోజ్ రెడ్డి, నాగరాజు, పోలీస్ మరియు యం.జి.యం హాస్పటల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## అంబులెన్స్‌లో ప్రసవం

- తల్లీ-బిడ్డ క్షేమం

**రేగొండ(కొత్తపల్లి గోరి),సెప్టెంబర్ 03( జనం సాక్షి):** అంబులెన్సులోనే మహిళ ప్రసవించిన ఘటన ఉమ్మడి రేగొండ మండలంలో జరిగింది.వివరాల్లోకి వెళితే రేగొండ మండలం నుండి విడిపోయి నూతన మండలంగా ఏర్పడిన కొత్తపల్లి గోరి మండలం బాలయ్యపల్లి గ్రామానికి చెందిన గుండెబోయిన రజిత గురువారం పురిటి నొప్పులతో బాధపడుతుంది. విషయం తెలుసుకున్న ఆశా వర్కర్ రజిత అంబులెన్స్‌కి సమాచారం అందించారు.గర్భిణీ మహిళను ప్రభుత్వ అంబులెన్స్‌లో దవాఖానాకు తీసుకెళు ్తండగా పురిటినొప్పులు ఎక్కువవ్వడంతో మార్గమధ్యలోనే డెలివరీ చెయ్యాల్సి వచ్చిందని అంబులెన్స్ సిబ్బంది టెక్నీషియన్ శంకర్ రావు, పైలెట్ రవి తెలిపారు.డెలివరీ అనంతరం తల్లీ,బిడ్డ క్షేమంగా ఉన్నారని,పరకాలలోని ఏరియా హాస్పిటల్ కు తరలించినట్లు వారు తెలిపారు.

## నాణ్యమైన విద్య, వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

- విద్యార్థులు క్రమశిక్షణతో చదివి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలి
- జిల్లా కలెక్టర్ రాజర్షిషా
- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య



**బజార్హత్నూర్( జనం సాక్షి):** ఆదిలాబాద్ జిల్లా బజార్హత్నూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ బాలుర వసతి గృహాన్ని స్థానిక శాసన సభ్యులు అనిల్ జాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధికారులు అతిథులకు శాలువాతో సత్కరించి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బజార్‌హత్నూర్‌లో ఎస్సీ, బీసీ హాస్టళ్ల నూతన భవనాల నిర్మాణానికి త్వరలోనే పరిపాలనాపరమైన అనుమతులు రానున్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించే లక్ష్యంతో త్వరలోనే బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభిస్తామని, కొల్హారిలో హరిరామ్, హరికృష్ణ అందజేసిన గోడౌన్‌ను ఇందుకు సద్వినియోగం చేసుకుంటున్నట్లు వెల్లడించారు. అలాగే ఆరోగ్య పాఠశాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు చక్కటి వ్యక్తిగత వికాసం, మంచి అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో సమాచార మార్పిడి నైపుణ్యాలను పెంపొందించేందుకు స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులతో పాటు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, ఖాన్ అకాడమీ ద్వారా డిజిటల్ విద్యనభ్యసించాలని సూచించారు. తల్లితండ్రులు విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. బజార్హత్నూర్ మండలంలో పెండింగ్లో అభివృద్ధి పనులను పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు గ్రంథాలయాల్లో పుస్తక పఠనం అలవాటుగా మార్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సునీతకుమారి, ఎంఆర్ఓ శ్యాంసుందర్, ఎంపిడిఓ మహేందర్, సర్పంచ్ సాయన్న, ఏంఈఓ రాంకిషన్, ఏఏపిసి చైర్మన్ నవనీత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూమన్న, వార్డెన్ చైతన్య, ఇతర అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పతనం ఖాయం

- రైతుల పట్ల కాంగ్రెస్ పార్టీ సవితి తల్లి ప్రేమ చూపుతుంది
- బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు
- ములుగు నియోజకవర్గ ఇన్చార్జ్ బడే నాగజ్యోతి



**ములుగు,సెప్టెంబర్03(జనం సాక్షి):** రైతు లేనిదే రాజ్యం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల సవతి తల్లి ప్రేమను చూపుతోందని బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు, ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు చేపడుతున్న నిరసన కార్యక్రమంలో భాగంగా గురువారం ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రంలో బిఆర్ఎస్ నాయకులు రైతులతో కలిసి నిర్వహించిన నిరసన కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు, నియోజకవర్గ ఇన్చార్జ్ బడే నాగజ్యోతి ముఖ్యఅతిథిగా హాజరై ర్యాలీ పాల్గొన్నారు. గోవిందరావుపేటలోని తహసిల్దార్ కార్యాలయం నుంచి ఎద్దుల బండ్ల తో మొదలైన ర్యాలీ గోవిందరావుపేట శివారులోని ఫంక్షన్ హాల్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు సమావేశంలో లక్ష్మీ నరసింహారావు,నాగజ్యోతి మాట్లాడారు. బిఆర్ఎస్ పార్టీ రైతుల సంక్షేమ ధ్యేయంగా రెండు గోపాలుగా పాలన అందించిందని అన్నారు. ములుగు ప్రాంత రైతాంగానికి లక్నవరం జలాశయం అత్యంత కీలకమైన సాగునీటి వనరని,దాని కింద ఉన్న పంట పొలాలకు అవసరమైన సమయంలో నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో లక్నవరం సమస్యను పదే పదే ప్రస్తావించిన మంత్రి సీతక్క నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత దాని పరిష్కారానికై ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని ప్రశ్నించారు. మేడారం సమ్మక్క-సారలమ్మ తల్లుల సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్నవరం నీటిని జంపన్నవాగుతో అనుసంధానం చేసేందుకు రూ.36 కోట్లతో చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని,ఆ హామీ అమలుపై ఇప్పటికీ స్పష్టత లేకపోవడం రైతాంగాన్ని నిరాశకు గురిచేస్తోందని అన్నారు.రైతుకు ప్రాజెక్టుల పేర్లు,హామీలు కాకుండా పంట కాలంలో పొలానికి చేరే నీరే ముఖ్యమని,అందువల్ల లక్నవరం సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే కార్యాచరణను ప్రభుత్వం ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ములుగు జిల్లాలో సాగునీటి సమస్యను పరిష్కరించేందుకు గతంలో చేపట్టిన దేవాదుల, సమ్మక్క బ్యారేజ్ వంటి ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు గోవింద నాయక్, మల్క రమేష్, భూక్యా జంపన్న,లకవత్ నరసింహ, సుడి శ్రీనివాస్ రెడ్డి,లకావత్ చందులాల్, తాటికొండ శ్రీనివాసచార్యులు, గజ్జి ఎలేందర్, పెన్నిటి మధుసూదన్ రెడ్డి, అక్కనపల్లి రమేష్, మెర్గుల వెంకన్న,వర్ధన్ చందర్, చర్ల పాండు,ప్రవీణ్ గౌడ్,బి.శీను, శ్యామ వెంకట్ రెడ్డి,ఎడవెల్లి వెంకటరెడ్డి,నామ పూర్ణచందర్,అజ్మీర సురేష్,మాలోత్ గాంధీ,పోరిక కిరణ్, కుమార్ లావుడియా, రామచందర్ సరూప,లకావత్ మమత, చందులాల్, తదితరులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**భీమిని సెప్టెంబర్ 3 (జనంసాక్షి) :** భీమిని మండలంలో గురువారం జిల్లా కలెక్టర్ ఆకస్మిక పర్యటన నిర్వహించారు ఈ పర్యటనలో భాగంగా కస్తూర్బా గాంధీ మండల పరిషత్ తాసిల్దార్ కార్యాలయాలను తనిఖీ చేశారు పలు అభివృద్ధి పనులను సమీక్షించారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ మండలంలోవిద్యాభివృద్ధిలో భాగంగా విద్యా సంస్థలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని అన్నారు భీమిని మండల కేంద్రంలో ని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంను సందర్శించి అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన సకల సదుపాయాలు కల్పిస్తూ నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నాణ్యమైన విద్యా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో విద్యారుల సంఖ్య పెంపొందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని అన్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో నోటీసుల జారీ, ఓటర్లు సమర్పించిన వివరాల పరిశీలన అంశాలను పరిశీలించారు. మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలో ఓటర్లకు అందించిన నోటీసులకు సంబంధిం చి వారు సమర్పించిన ధృవపత్రాలను పరిశీలించి పారదర్శకంగా చర్యలు తీసుకొా ని, ప్రక్రియ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు.

## భూభారతి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం వద్దు

- కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ బ్యూరో, సెప్టెంబర్ 3:( జనంసాక్షి) :** జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూభారతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షలో మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తులపై ఆరా తీశారు. ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకోవాలని సూచించారు. సాంకేతిక లేదా ఇతర కారణాలతో దరఖాస్తులను తిరస్కరిస్తే, అందుకు గల స్పష్టమైన కారణాలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. 22ఏ నిషేధిత జాబితా భూములకు సంబంధించిన సమస్యలను ప్రత్యేకంగా పరిశీలించి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీవో దేవీదాస్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## చేపల పెంపకం ద్వారా ఉపాధి అవకాశాలు

- జిల్లా కలెక్టర్ కె.హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 03(జనంసాక్షి ):** స్వయం సహాయక సంఘాల మహిళలు, ఉపాధి కూలీలు చేపల పెంపకం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకుని అదనపు ఆదాయం పొందవచ్చని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలోని వి బి జి రామ్ జి పథకం క్రింద చేపట్టిన పంట కుంట, నీటి కుంట, ఊట కుంటలలో ప్రధానమంత్రి కె.ఎ.ఎస్.వై. ద్వారా జల్ జీవిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి హాజరై జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావుతో కలిసి లబ్ధిదారులకు చేప పిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల కుటుంబాలు, ఉపాధి కూలీలు తమ వ్యవసాయ భూములలో ఊట కుంటలు, నీటి కుంటలు, పంట కుంటల నిర్మాణాలు చేపట్టి వాటిలో చేపల పెంపకం ద్వారా అదనపు ఆదాయం పొంది ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవచ్చని తెలిపారు. చేప పిల్లలను జల్ జీవిక స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చి అందించడం అభినందనీయమని, లబ్ధిదారులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి ఆంజనేయులు, జల్ జీవిక స్వచ్ఛంద సంస్థ సంచాలకులు పద్మాకర్, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
04 సెప్టెంబర్ 2026

# 60 రోజులు కష్టపడండి.. లక్ష్యాన్ని సాధించండి
## మంత్రి పొంగులేటి

### ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత శిక్షణను ప్రారంభించిన మంత్రి పొంగులేటి




**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్- 3( జనంసాక్షి )**
స్థానిక రామకృష్ణ ఫంక్షన్ హాల్లో మధ్యతరగతి, పేద కుటుంబాలకు చెందిన యువత ఉన్నత స్థాయికి ఎదగాలనే ఆశయంతో పీఎస్ఆర్ ట్రస్ట్, రైట్ చాయిస్ అకాడమీ ల ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత ఎస్సై, కానిస్టేబుల్ శిక్షణా కార్యక్రమాన్ని గురువారం రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల కుటుంబాల్లో కనిపించే ఆనందం, వారు చూపే కృతజ్ఞత వర్ణించలేనిదని పేర్కొన్నారు. గతంలో సెలెక్ట్ అయిన అభ్యర్థులతో కలిసి భోజనం చేసిన క్షణాలు తన జీవితంలో అత్యంత మధురమైన జ్ఞాపకాలని గుర్తు చేసుకున్నారు. భవిష్యత్తులో ఉన్నత పదవులు సాధించిన తర్వాత, మీ వద్దకు సహాయం కోసం వచ్చే పేదలను, బాధితులను మనుషుల్లా గౌరవించి, ప్రేమ ఆప్యాయతలతో న్యాయం చేయాలన్నారు. కష్టపడకుండా ఏదీ రాదని, ఒకవేళ అయాచితంగా లభించినా అది శాశ్వతంగా నిలవదని మంత్రి అన్నారు. మన సొంత కష్టంతో సాధించిన విజయమే మనకు నిజమైన తృప్తిని, శాశ్వత స్థానాన్ని ఇస్తుందని తెలిపారు. అధికారాలు, పదవులు శాశ్వతం కావని, జీవితంలో పదవులు, డబ్బు ఎప్పుడూ ఒకేలా ఉండవని, జీవితం ఒడుదుడుకులతో కూడుకున్నదన్నారు. ఉచిత శిక్షణకు సుమారు 2,200 నుండి 2,300 మంది నమోదు చేసుకున్నారని, అందులో 1,500 మంది రోజూ క్రమం తప్పకుండా వచ్చే వారుంటారని, అభ్యర్థులందరికీ మంచి ఫ్యాకల్టీతో పాఠాలు, నాణ్యమైన స్టడీ మెటీరియల్ అందిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సొంత ఖర్చులతో మధ్యాహ్న భోజన వసతి కూడా ఏర్పాటు చేస్తున్నామని మంత్రి ప్రకటించారు. రాబోయే 60 రోజుల కాలాన్ని అభ్యర్థులు క్రమశిక్షణతో ఉపయోగించుకుని, అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని, తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని ఆకాంక్షిస్తూ, అందరికీ ఆల్ ది బెస్ట్" అని మంత్రి ఆశీర్వదించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ జీవితంలో అనుకున్న లక్ష్యాలను, పోటీ పరీక్షల్లో విజయం సాధించడంలో సబ్జెక్ట్ పరిజ్ఞానంతో పాటు సరైన మానసిక దృక్పథం అత్యంత కీలకమైనదని అన్నారు. విద్యార్థుల విజయంలో 90% పాత్ర వారి మైండ్‌సెట్‌పైనే ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు. సబ్జెక్టు నేర్పించడానికి నిపుణులు, పుస్తకాలు, టెస్ట్ సిరీస్‌లు అందుబాటులో ఉంటాయని, కానీ మనసులో గెలుపుపై నమ్మకం పెంచుకోవడం అత్యంత ముఖ్యమని కలెక్టర్ తెలిపారు. మనం అనుకున్న కల ను సాధించి గమ్యాన్ని చేరుకోవడానికి రెండు కీలక గుణాలు అవసరం. ఆత్మవిశ్వాసం, పట్టుదల అవసరమని అన్నారు. నాకు ఇంగ్లీష్ రాదు, తెలుగు మీడియంలో చదివాను, పేదరికంలో పుట్టాను వంటి ఆలోచనలను పక్కన పెట్టాలన్నారు. పుట్టుకతో ఎవరికీ ఏ విద్య రాదని, సమయం కేటాయించి నేర్చుకుంటే ఏదైనా సాధించవచ్చు అనే నమ్మకం మనపై మనకు ఉండాలని కలెక్టర్ తెలిపారు. చదువుకునే క్రమంలో నిద్రపోవడం, ఆర్థిక సమస్యలు, పరిసరాల ప్రభావాలు వంటి అనేక అడ్డంకులు వస్తాయన్నారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా అనుకున్న లక్ష్యం పూర్తయ్యే వరకు ఆగకుండా ముందుకు సాగడమే నిజమైన పట్టుదల అని, ఈ రెండింటినీ అలవర్చుకొని ఉపాధ్యాయులు చెప్పే సలహాలను పాటిస్తూ, రాబోయే పరీక్షల్లో విద్యార్థులందరూ అద్భుత విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు డీసీపీ రామానుజం, నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, ఎదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పొకబతిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## జుక్కల్ నియోజకవర్గంలో
# రహదారుల అభివృద్ధికి పెద్దపీట

- రూ.63.41 కోట్లతో ఊంఓ రోడ్ల పనులకు త్వరలో శంకుస్థాపన
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు భేటీ



**నిజాంసాగర్, సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** జుక్కల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జుక్కల్ నియోజకవర్గంలో చేపట్టనున్న పలు రహదారి అభివృద్ధి పనులతో పాటు కీలకమైన ప్రాజెక్టులపై మంత్రి, ఎమ్మెల్యే సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా రూ.63.41 కోట్ల అంచనా వ్యయంతో హెచ్ఏఎం పద్ధతిలో చేపట్టనున్న 54.31 కిలోమీటర్ల రహదారుల అభివృద్ధి పనులకు త్వరలో శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రితో ఎమ్మెల్యే చర్చించారు.

**54.31 కి.మీ. రహదారులకు రూ.63.41 కోట్లు**
హెచ్ఏఎం మొదటి దశలో మంజూరైన రహదారి పనుల్లో భాగంగా అన్నసాగర్ – పిట్లం రోడ్డు 10.50 కి.మీ.కు రూ.12.16 కోట్లు మద్దెలచెరువు – మెదక్ జిల్లా సరిహద్దు (పిట్లం మీదుగా) 19.40 కి.మీ.కు రూ.21.49 కోట్లు బాన్సువాడ – బిచ్కుంద రోడ్డు 24.41 కి.మీ.కు రూ.29.76 కోట్లువెరసి మొత్తం 54.31 కిలోమీటర్ల రహదారుల అభివృద్ధికి రూ.63.41 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులకు త్వరలోనే శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

**చెందేగాం రోడ్డుకు కొత్త బీటీ రోడ్డు**
అదేవిధంగా ఎన్‌హెచ్-161 నుంచి ఏక్లార, జి.మద్నూర్ మీదుగా చెందేగాం వరకు ఉన్న రహదారిని పంచాయతీరాజ్ శాఖ పరిధి నుంచి రోడ్లు, భవనాల శాఖ పరిధిలోకి బదిలీ చేయాలని ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. రహదారిని త్వరలోనే ఆర్అండ్‌బీ శాఖకు బదిలీ చేసి, నూతన బీటీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన అనుమతులు తక్షణమే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఆర్అండ్‌బీ శాఖ చీఫ్ ఇంజనీర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలతో పాటు స్థానిక రాజకీయ పరిస్థితులపైనా సుదీర్ఘంగా చర్చించి, మంత్రి పలు సూచనలు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. జుక్కల్ నియోజకవర్గం లోని గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రహదారి సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడి, ప్రజలకు మరియు రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు పేర్కొన్నారు.



### సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్..
### రైల్వే కారిడార్ సాధనోద్యమం ఉధృతం చేయాలి

**సూర్యాపేట (జనంసాక్షి):**
జాతీయ రహదారికి సమాంతరంగా బుల్లెట్ ట్రైన్, రైల్వే కారిడార్ సాధన కోసం జరుగుతున్న ఉద్యమంలో భాగస్వాములవుతూ ఉద్యమాన్ని ఉధృతం చేయాలని సూర్యాపేట పట్టణ వాణిజ్య వ్యాపార సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు,విద్యా సంస్థల యాజమాన్యాలు, పౌర సంఘాలు, మీడియా ప్రతినిధులు సంయుక్తంగా నిర్ణయించారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్, రైల్వే కారిడార్ సాధన పోరాట కమిటీ ఆహ్వానం మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. లయన్స్ ఐ హాస్పటల్ ఉపాధ్యక్షులు తోట శ్యామ్ అధ్యక్షత వహించగా పలువురు మాట్లాడుతూ రైల్వే రంగంలో సూర్యాపేట మొదటి నుండి నిర్లక్ష్యం చేయబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజ అభివృద్ధిలో ట్రాన్స్ పోర్ట్ రంగం కీలకమైందని పేర్కొన్నారు. అందులో రైల్వే పాత్ర ముఖ్యమని, ఆ రైల్వే సాధన కోసం స్థానికంగా ఉద్యమంతో పాటు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద దీక్షకు సిద్ధం కావాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో సమావేశంలో పెద్దిరెడ్డి గణేష్,గండూరి శంకర్, సంకినేని గోపాల్ రావు, హరి, పగడాల ఉపేందర్, వజ్జె వీరయ్య, శ్రీకాకులం రాము పొనుగోటి నిర్మల, ఇరిగి కొటేశ్వరి, బండారి రాజా,బెలిదే శ్రీను, సాజిద్ ఖాన్, దూలం నగేష్, చీడేటి సత్తిరెడ్డి, విద్యాసాగర్, గంగయ్య, భవాని శ్రీనివాస్, మొరిశెట్టి కోటేశ్వర్ రావు వెంపటి సురేష్, మాధశాంతయ్య, ఆరుట్ల జానకిరెడ్డి, రమణచారి, మల్లు నాగార్జున్ రెడ్డి, ధర్మార్జున్, డేవిడ్ కుమార్, చల్లమల నర్సింహా,వెలుగు వనిత, భూపతి రాములు,కర్నాటి కిషన్,సట్టు నాగయ్య,యాదగిరి రావు, మట్టిపల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

### ధ్రువీకరణ పత్రాలు తెచ్చినవారి పేర్లను
# నమోదు చేయాలి
### కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**పెన్ పహాడ్,సెప్టెంబర్ 03 (జనంసాక్షి) :**
పెన్ పహాడ్ మండలం లో సర్ ప్రక్రియ పరియటన ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న వారిలో సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన వారి పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. గురువారం పెనపహాడ్ మండల పరిధిలోని అనంతారం గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమగ్ర ఓటర్ సవరణ సర్ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్‌లో మ్యాపింగ్‌కాని ఓటర్లతోపాటు వివరాలు తప్పుగా ఉన్న ఓటర్లకు సక్రమంగా నోటీసులు అందుతున్నాయా? లేదా? అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నోటీసులు అందుకున్న వారు సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించినప్పుడే వారిని ఓటర్ లిస్టులో చేర్చాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజశేఖర్ రెడ్డి, ఆర్ ఐ రంజిత్ రెడ్డి, బి ఎల్ వో లు, సర్పంచ్ శోభ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



- గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి
- డాక్టర్లు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి
- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట (జనంసాక్షి):**
సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. గురువారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పురుషుల, మహిళల ఓపి రూమ్ లను సందర్శించి ఔట్ పేషెంట్ రిజిస్టర్లు పరిశీలించి, ఎంతమంది అవుట్ పేషంట్స్ రిజిస్ట్రేషన్ చేయించు కున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తదుపరి ఏఎంసి వార్డును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డ్యూటీ డాక్టర్లను, పేషెంట్లకు వైద్య సేవ అందించే రౌండ్స్ పూర్తయ్యాయని అడిగి తెలుసుకున్నారు. పీఎంజేవై, ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పేషెంట్ రిజిస్ట్రేషన్ కౌంటర్ ను, డ్రగ్స్ స్టోర్ రూమ్ ను, జనరల్ మెడిసిన్ డాక్టర్ రూమ్ ను తనిఖీ చేశారు. డయాగ్నస్టిక్ రూమ్, బ్లడ్ శాంపిల్ కౌంటర్ ను తనిఖీ చేసి పేషెంట్లకు ఏమేమి పరీక్ష నిర్వహించారు,రిపోర్టు ఎలా ఉన్నాయని రిపోర్ట్స్ పరిశీలించారు. డయాగ్నస్టిక్ కెమికల్స్ వివరాలు తెలుసుకున్నారు. జనరల్ వార్డును తనిఖీ చేసి పేషంట్ల వివరాలను డ్యూటీ డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అక్కడే మెడిసిన్ రియాక్షన్ వలన చికిత్స పొందుతున్న తిరుమలగిరికి చెందిన రహీమా బేగంను పరామర్శించి, రియాక్షన్ కు గల కారణాలను అడిగి తెలుసుకుని ఆమెకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆర్ఎంఒను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కావడంతో డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, మెడికల్ వార్డులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతిరోజూ ఫీవర్ కేసులు, అడ్మిషన్లు, డిశ్చార్జ్ వివరాలను అప్‌డేట్ చేయాలని చెప్పారు. మందుల కొరత లేకుండా బఫర్ స్టాక్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు, అత్యాధునిక శస్త్రచికిత్సల కోసం ఉపయోగించు మందులు, పరికరాల కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే పేద ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరిస్తూ,వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని పేర్కొన్నారు. విధుల పట్ల అలసత్వం ప్రదర్శించరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వాణి,జనార్ధన్, అనిత, శ్రీలత, ఉపేందర్, యశ్వంత్, వినయ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాల శీతలీకరణ కేంద్రం ప్రారంభం

- రైతులకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే వేముల వీరేశం
- పరిశ్రమను అభివృద్ధి చేసి రాష్ట్రాన్ని స్వయం సమృద్ధిగా మారుస్తాం
- విజయ డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి





**చిట్యాల, సెప్టెంబర్ 3 (జనంసాక్షి):**
చిట్యాల పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన విజయ డైరీ పాల శీతలీకరణ కేంద్రమును నకిరేకల్ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ వేముల వీరేశం విజయ డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజయ డెయిరీని లాభసాటిగా మలచి రైతులకు భరోసా కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని నకిరేకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం స్పష్టం చేశారు. స్థానిక ప్రాంతంపై ఉన్న మమకారంతోనే నియోజకవర్గంలో విజయ చిల్లింగ్ సెంటర్ మరియు పాల సిద్ధీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం రోజువారీగా 19,800 లీటర్లుగా ఉన్న పాల సేకరణను 20,000 లీటర్లకు పెంచేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు. వ్యవసాయం తర్వాత పాడి పరిశ్రమకే రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన 1,000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా అన్ని రంగాల్లోనూ ప్రగతి సాధిస్తున్నామని వెల్లడించారు. రాబోయే రోజుల్లో నకిరేకల్‌లో రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల, రూ. 10 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి సీఎం చేతుల మీదుగా శంకుస్థాపనలు చేయిస్తున్నట్లు ప్రకటించారు. గుజరాత్ లోని అముల్ సంస్థ స్ఫూర్తితో తెలంగాణను కూడా స్వయం సమృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. యాదగిరిగుట్ట ఆలయ ప్రసాదం అయిన అరిసెలు తయారీకి ప్రతి నెలా 30 టన్నుల నెయ్యిని విజయ ఫెడరేషన్ నుంచే సరఫరా చేస్తున్నామని గుత్తా అమిత్ రెడ్డి వివరించారు. అనంతరము పలు గ్రామాల రైతులకు 20 లక్షల రూపాయల చెక్కులు అందజేయడం జరిగింది తదనంతరం రైతులు ఎమ్మెల్యే వేములకు చైర్మన్ అమిత్ కు గజమాలతో సత్కారం చేయడం జరిగిందిఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి,చిట్యాల మున్సిపల్ చైర్మన్ పందిరి గీతా రమేష్, జిల్లా కాంగ్రెస్ నాయకులు పోకల దేవదాస్,సీనియర్ నాయకులు నర్రా మోహన్ రెడ్డి వైస్ చైర్మన్ గుండెబోయిన శ్రీ లక్ష్మీ సైదులు, కనకదుర్గ ఆలయ చైర్మన్ మారగోని ఆంజనేయులు, కౌన్సిలర్లు కుక్కల మోహన్ ఏర్పుల పరమేష్ దేశపాకలత రాజేష్ బొబ్బలి సందీపా రామిరెడ్డి,గాలి యాదమ్మ లింగయ్య, కోనేటి ఎల్లయ్య,బెల్లి సభ్యులు బెల్లి సత్తయ్య ఎస్.కె షబానా ఇబ్రహీం,ఇమ్రాన్, మండల పట్టణ పార్టీ అధ్యక్షులు చిన్న మల్లయ్యా,ఎద్దులపురి కృష్ణ,సర్పంచులు ఫోరం అధ్యక్షులు కాటం వెంకటేష్, నాయకులు వనమా వెంకటేశ్వర్లు,కొనసమ్ అశోక్, రెమడాల నరసింహ, రంగ వెంకన్న, విజయ డైరీ అధికారులు మార్కెటింగ్ జనరల్ మేనేజర్ మోహన్ మురళి,ఇన్స్టిట్యూషన్ జనరల్ మేనేజర్ శ్రీనివాసరాజు,దేవేందర్ కుమార్,ధనరాజ్,ప్రదీప్ రైతులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నిజమైన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల గురించే నా ఆలోచన
### మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి..



**సంస్థాన్ నారాయణపురం. సెప్టెంబర్ 3(జనంసాక్షి ):**
పదేళ్లపాటు బిఆర్ఎస్ అరాచక పాలనపై వీరోచితంగా పోరాడిన నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు ఎట్టి పరిస్థితులలో అన్యాయం జరగనివ్వనని, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ కోసం రక్తం చిందించిన వారికి తగిన గుర్తింపు రావాలన్నదే నా ఉద్దేశం అని అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని సర్వేల్ గ్రామంలో గురువారం ఆయన 76.20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రహదారి విస్తరణ పనుల కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 32.90 కోట్లతో గుడిమల్కాపురం నుంచి చల్మెడ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం తో పాటు సర్వే నుంచి పలివెల వరకు 32.30 కోట్లు, నారాయణపూర్ నుంచి సల్వేర్ వరకు 11 కోట్లు, జయంతో రోడ్ల అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు వివరించారు గ్రామీణ ప్రాంతాలలో గతంలో ఉన్న 3.75 మీటర్ల వెడల్పు రోడ్లు నేటి రవాణా అవసరాలకు సరిపోవడం లేదని చెప్పారు వాహనాల సంఖ్య విపరీతంగా పెరిగినందున రోడ్లను 5.5 మీటర్ల వెడల్పు చేయాలని తాను ప్రతిపాదించగానే ప్రజా ప్రభుత్వం తక్షణమే స్పందించి నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ అభివృద్ధి పనుల సాధనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రత్యేక సహకారం అందించారని గుర్తు చేశారు. మంత్రివర్గ విస్తరణ పదవుల కేటాయింపు అంశాలపై స్పందిస్తూ ఎవరికి ఏ పదవి ఇవ్వాలనేది పూర్తిగా కాంగ్రెస్ అధిష్టానం పరిధిలోని అంశమని తెలిపారు ఏ నాయకుడికి ఎలాంటి బాధ్యతలు అప్పగించాలో పార్టీ పెద్దలు చూసుకుంటారని, స్పష్టం చేశారు. అధినేత రాహుల్ గాంధీ నాయకత్వం పై పూర్తి నమ్మకం ఉందని ఆయన ఏ నిర్ణయం తీసుకున్న వారి మాట శిరోధార్యం అని అన్నారు. ఇటీవల కొండ సురేఖ అంశం కూడా అధిష్టానం పరిశీలన లో ఉందని అన్నారు. అధిష్టానం తీసుకునే నిర్ణయమే అందరికీ శిరోధార్మని ఉద్ఘటించారు. రీజనల్ రింగ్ రోడ్ నిర్మాణం వల్ల భూములు కోల్పోతున్న రైతుల ప్రయోజనాల పరిరక్షణకు నిరంతర నిరంతరం కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. బాధితులకు ప్రభుత్వం నుంచి అత్యధిక నష్టపరిహారం ఇచ్చేందుకు ఇప్పటికే ప్రత్యేక చొరవ తీసుకున్నానని రైతులకు మద్దతుగా ఉంటానని హామీ ఇచ్చారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి పనులు అధికారులు మీడియా ప్రతినిధులు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. పదవుల కంటే పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తల సంక్షేమమే తనకు ముఖ్యమని పునరుద్ఘటించారు. సుదీర్ఘకాలం ప్రతిపక్షంలో ఉంటూ కేసులు అణిచివేతలను తట్టుకొని పార్టీని కాపాడుకున్న పాత కార్యకర్తలకు ప్రభుత్వ పథకాలు పదవులలో ప్రాధాన్యం దక్కేలా చూస్తానని హామీ ఇచ్చారు. ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా మునుగోడును మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## విపణి

# టెక్ ప్రియుల చూపంతా.. సెప్టెంబర్ 9 పైనే!

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**యాపిల్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తోన్న ఈవెంట్ దగ్గరప డుతోంది సెప్టెంబర్ 9న 'సర్‌ప్రైజ్ అండ్ షైన్' పేరిట ఈవెంట్ నిర్వహిం చనున్నట్టు యాపిల్ ప్రకటించింది. భారత కాలమానం ప్రకారం సెప్టెంబర్ 9న రాత్రి 10.30 గంటలకు అమెరికాలోని యాపిల్ పార్క్ క్యాంపస్ వేదికగా ఈవెంట్‌ను నిర్వహించనుంది. యాపిల్ వెబ్‌సైట్, యాపిల్ టీవీ ద్వారా కార్యక్రమాన్ని వీక్షించొచ్చు. ఆ రోజు ఏయే ఉత్పత్తులను విడుదల చేయబోతుందో అని టెక్ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇంతకీ ఏయే ఐఫోన్లు విడుదలయ్యే అవకాశం ఉందో ఇప్పుడు చూద్దాం.సెప్టెంబర్ 9న ఐఫోన్ 18 ప్రో, ఐఫోన్ 18 ప్రో మాక్స్ విడుదల చేయనున్నట్లు టెక్ వర్గాలు భావిస్తున్నాయి. యాపిల్ వాచ్ సిరీస్ 12, యాపిల్ వాచ్ అల్ట్రాను పరిచయం చేసే అవకాశం ఉంది. స్మార్ట్‌హోమ్ విభాగంలో కొత్త పరికరాలను కూడా తీసుకురావచ్చని అంచనాలు ఉన్నాయి. ఐఫోన్ 18, ఐఫోన్ 18ఈ విడుదలను వచ్చే ఏడాదికి వాయిదా వేసినట్లు తెలుస్తోంది.

ఫోల్డబుల్ ఐఫోన్‌పై ఆసక్తి

మరోవైపు, యాపిల్ తొలి ఫోల్డబుల్ ఐఫోన్‌ను విడుదల చేస్తుందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన రానప్పటికీ.. సెప్టెంబర్ 9న భారీ ఆవిష్కరణ ఉండబోతోందని యాపిల్ నూతన సీఈఓ జాన్ టెర్నస్ ఇప్పటికే హింట్ ఇచ్చారు.

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోసారి నష్టాలను చవిచూశాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, చమురు ధరలు పెరగడం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలకు ఆఖర్లో అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. బజాజ్ ఆటో, టెక్ మహీంద్రా షేర్లు దాదాపు 2 శాతం మేర కుంగాయి. దీంతో నాలుగో రోజూ సూచీలకు నష్టాలు తప్పలేదు.

# ఆఖరి గంటలో అమ్మకాలు

## నాలుగో రోజూ తప్పని నష్టాలు

సెన్సెక్స్ ఉదయం 76,724.95 (క్రితం ముగింపు 76,570.35) వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడిన సూచీ.. ఆఖరి గంటలో మాత్రం అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంది. ఇంట్రాడేలో 76,152.86 వద్ద కనిష్ఠాన్ని తాకగా.. చివరికి 417.49 పాయింట్లు పతనమై 76,152.86 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 41 పాయింట్లు కోల్పోయి 23,873.45 వద్ద ముగిసింది. సెన్సెక్స్30లో టైటాన్, ట్రెంట్, ఐటీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్‌ఫిన్‌సర్వ్, హెచ్‌సీఎల్ షేర్లు ప్రధానంగా నష్టాలను చవిచూశాయి. యాక్సిస్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, ఏషియన్ పెయింట్స్, హెచ్‌డీఎఫ్‌సీ, భారతీ ఎయిర్‌టెల్, బీఈఎల్ షేర్ల లాభాలను ఆర్జించాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 96.87 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,427.29 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**ఎఫ్ఐఐ కొనుగోళ్లు: రూ.6,688 కోట్లు**

వరుసగా మూడో రోజూ దేశీయ సూచీల నష్టాలు కొనసాగాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా చమురు ధర పెరుగుతుండటంతో, అంతర్జాతీయ సంకేతాలు ప్రతికూలంగా మారాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 22 పైసలు పెరిగి 94.73 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడిచమురు 1% పెరిగి 95 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లు నష్టాల్లో ముగియగా, ఐరోపా సూచీలు అదే ధోరణిలో ట్రేడయ్యాయి.బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.1.57 లక్షల కోట్లు తగ్గి రూ.486.54 లక్షల కోట్ల (5.12 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. సెన్సెక్స్ ఉదయం 473 పాయింట్ల నష్టంతో (క్రితం ముగింపు 76,944.28 పాయింట్లతో పోలిస్తే) 76,471.32 వద్ద ప్రారంభమైంది. ఆద్యంతం



నష్టాల్లోనే కదలాడిన సూచీ, ఒకదశలో 76,135.72 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడింది. చివరకు కాస్త కోలుకుని 373.93 పాయింట్ల నష్టంతో 76,570.35 వద్ద ముగిసింది. నిఫ్టీ 141.35 పాయింట్లు కోల్పోయి 23,914.45 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 23,786.80- 23,914.45 పాయింట్ల మధ్య కదలాడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 20 నష్టాలు నమోదుచేశాయి. ఏష్టి?న్ పెయింట్స్ 1.61%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.56%, ఎం అండ్ ఎం 1.56%, హెచ్‌సీఎల్ టెక్ 1.49%, బీఈఎల్ 1.33%, ఇన్ఫోసిస్ 1.28%, ఎస్‌బీఐ 1.22%, ఇండిగో 1% నష్టపోయాయి. అదానీ పోర్ట్స్ 1.63%, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.02%, పవర్‌గ్రిడ్ 1%, ఎన్‌టీపీసీ 0.96% లాభపడ్డాయి. రంగాల వారీ సూచీల్లో.. వాహన 1.68%, ఐటీ 1.17%, ఫోకస్డ్ ఐటీ 1.10%, బీమా 1.09%, యంత్ర పరికరాలు 1.08% తగ్గాయి. ఇంధన, యుటిలిటీస్, విద్యుత్, స్థిరాస్తి, సేవలు రాణించాయి. బీఎస్ఈలో 2560 షేర్లు నష్టపోగా, 1799 స్క్రిప్‌లు లాభపడ్డాయి. 225 షేర్లలో మార్పులేదు.

**ఐపీఓ సమాచారం..**

అన్ను ప్రాజెక్ట్స్ షేరు ఇష్యూ ధర రూ.99తో పోలిస్తే, బీఎస్ఈలో 24.24% నష్టంతో రూ.75 వద్ద ప్రారంభమైంది. చివరకు 21.31% నష్టంతో రూ.77.90 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.510.19 కోట్లుగా నమోదైంది.ప్రణవ్ కన్‌స్ట్రక్షన్ రూ.351 కోట్ల ఐపీఓ ఈ నెల 7న ప్రారంభమై 9న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణిగా రూ.118-124 నిర్ణయించారు. రేస్ ఆఫ్ బిలీఫ్ ఐపీఓ రెండో రోజుకు 3.63 రెట్ల స్పందన లభించింది. రిటెయిల్ విభాగంలో 18.63 రెట్ల స్పందన వచ్చింది.దీపా జువెలర్స్ ఐపీఓ రెండో రోజుకు 3.61 రెట్ల స్పందన నమోదైంది. రిటెయిల్ విభాగంలో 4.71 రెట్ల స్పందన కనిపించింది. దేశీయ పత్తి మార్కెట్‌లో ధరల్లో పారదర్శకత పెంచేందుకు, రిస్క్ మేనేజ్‌మెంట్‌ను బలోపేతం చేసేందుకు ఎన్‌సీడెక్స్, కాటన్ అసోసియేన్ ఆఫ్ ఇండియా (సీఏఐ) అయిదేళ్ల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నాయి.

## వాట్సప్‌లో ఇక కరెంటు, క్రెడిట్ కార్డు బిల్లు చెల్లింపులు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**మెటాకు చెందిన ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సప్ తన పేమెంట్స్ సేవలను విస్తృతం చేసింది. ప్రస్తుతం యూపీఐ చెల్లింపులు, మొబైల్ రీఛార్జులు, మెట్రో టికెట్ బుకింగ్ వంటి వాటికే పరిమితం కాగా.. కొత్తగా బిల్ పేమెంట్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. భారత్ కనెక్ట్ నెట్‌వర్క్‌లోని 30 కేటగిరీలకు చెందిన 22,722 బిల్లర్లను వాట్సప్ వేదికపైకి తీసుకొచ్చింది. దీని సాయంతో ఎలక్ట్రిసిటీ, గ్యాస్, వాటర్, ఫాస్టాగ్, ఇన్సురెన్స్, క్రెడిట్ కార్డ్, లోన్ రీపేమెంట్ చెల్లింపులను వాట్సప్‌లోనే చేయొచ్చు.




వివిధ రకాల పేమెంట్ సేవల కోసం వేర్వేరు యాప్స్ వినియోగించే అవసరం లేకుండా వాట్సప్ అన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చిందని మెటా ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ శ్రీనివాస్ తెలిపారు. రాబోయే కొన్ని వారాల్లో ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లకు దశలవారీగా ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెస్తామని తెలిపారు. వాట్సప్ తెరవగానే పైభాగంలో '?' సింబల్ దర్శనమిస్తుంది. దానిపై క్లిక్ చేశాక మీకు కావాల్సిన బిల్లు కేటగిరీ, బిల్లర్‌ను ఎంచుకోవచ్చు. అకౌంట్ వివరాలు ఇవ్వగానే చెల్లింపు ఆప్షన్లు దర్శనమిస్తాయి. యూపీఐ, డెబిట్‌కార్డు, క్రెడిట్ కార్డు వంటి వాటిల్లో ఒకదాన్ని ఎంచుకుని చెల్లింపులు పూర్తి చేయొచ్చు. పాత చెల్లింపులు, రాబోయే బిల్లు పేమెంట్లనూ చూసుకోవచ్చు.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| ₹ 1,60,754 | ₹ 1,75,370 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,50,000

## హెచ్‌సీఎల్ గ్లోబల్ టెక్నాలజీ డైరెక్టర్‌గా వరుణ్ పారుపల్లి




**హైదరాబాద్:** ప్రముఖ ఐటీ సేవల సంస్థ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ తమ గ్లోబల్ టెక్నాలజీ డైరెక్టర్‌గా వరుణ్ పారుపల్లిని నియమించింది. హైదరాబాద్‌కు చెందిన వరుణ్ పారుపల్లికి టెక్నాలజీ డెలివరీ, ప్రోగ్రామ్ గవర్నెన్స్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ వంటి రంగాల్లో రెండు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. హెచ్‌సీఎల్‌లో చేరడానికి ముందు ఆయన ఈపీఏఎం సిస్టమ్స్, సీజీఐ, వెల్స్ ఫార్గో, ఇన్ఫోసిస్, హాల్సియాన్ టెక్నాలజీస్, వెర్టెక్స్ కంప్యూటర్ సిస్టమ్స్ వంటి సంస్థల్లో కీలక నాయకత్వ బాధ్యతలు నిర్వహించారు. కాకతీయ యూనివర్సిటీలో ఎంసీఏ చేశారు.

## ఏటీఎం ఉచిత లావాదేవీలపై ఎస్‌బీఐ కొత్త రూల్స్

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాలరీ ప్యాకేజీ ఖాతాదారులకు షాకిచ్చింది ఎస్‌బీఐ డెబిట్ కార్డును ఉపయోగించి ఇతర బ్యాంకుల ఏటీఎంల నుంచి చేసుకునే ఉచిత నగదు ఉపసంహరణల పరిమితిని సవరించింది. దీన్ని 10 నుంచి 5కు తగ్గించింది. ఈ కొత్త నిబంధనలు అక్టోబర్ 1 నుంచే అమల్లోకి రానున్నాయి. ప్రస్తుతం ఎస్‌బీఐ శాలరీ ప్యాకేజీ ఖాతాదారులు ఇతర బ్యాంకుల ఏటీఎంలు, డిపాజిట్ కమ్ విత్‌డ్రా మెషిన్ల ద్వారా నెలకు మొదటి 10 లావాదేవీలను ఉచితంగా పొందుతున్నారు. కానీ, అక్టోబర్ 1 నుంచి ఉచిత పరిమితి కేవలం 5 లావాదేవీలకే పరిమితం కానుంది. ఆ తర్వాత జరిపే ఆరో ట్రాన్సాక్షన్ నుంచి ఛార్జీలు వసూలు చేయనుంది. ఇది ఆర్థిక, ఆర్థికేతర లావాదేవీలకూ వర్తిస్తుందని ఎస్‌బీఐ పేర్కొంది. అదనంగా చేసే ప్రతి ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్స్‌పై రూ.23 వసూలు చేయనుంది. దీనికి జీఎస్‌టీ అదనం. నాన్ ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్లపై రూ.11+




జీఎస్‌టీ ఛార్జీలు ఉండనున్నాయి. ఈ కొత్త నిబంధనలు కేవలం ఎస్‌బీఐ శాలరీ ప్యాకేజీ ఖాతాదారులకు మాత్రమే. ఇతర ఎస్‌బీఐ ఖాతాదారులకు మాత్రం వర్తించదు. అదేవిధంగా ఎస్‌బీఐకి చెందిన సొంత ఏటీఎం/ఏడీడబ్ల్యూలలో జరిపే డెబిట్ కార్డ్ లావాదేవీలపై ప్రస్తుత కొనసాగుతున్న పరిమితులు, ఛార్జీలే వర్తిస్తాయి. అందులో ఎలాంటి మార్పూ చేయలేదు.

# తగ్గినట్టే తగ్గి..

### బంగారం యూటర్న్.. తగ్గినట్లే తగ్గి మళ్లీ రూ.1.60 లక్షల స్థాయికి



దిల్లీ: తగ్గినట్లే తగ్గిన బంగారం ధరలు అనూహ్యంగా మళ్లీ పెరిగాయి. గత ఆరు రోజులుగా తగ్గుతూ వస్తున్న పసిడి ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. ఒక్క రోజులోనే 10 గ్రాముల మేలిమి పసిడి ధర దాదాపు రూ.4 వేలు పెరిగింది. దీంతో మళ్లీ రూ.1.60 లక్షల మార్కును చేరుకుంది. బుధవారం 10 గ్రాముల బంగారం ధర రూ.1,56,100గా ఉంది. హైదరాబాద్‌లో స్పాట్‌గోల్డ్ 10 గ్రాముల ధర గురువారం సాయంత్రం 7 గంటల సమయానికి రూ.1.60 లక్షల వద్ద కొనసాగుతోంది. వెండి సైతం దాదాపు రూ.5వేలు మేర పెరిగి రూ.2.41 లక్షలు వద్ద ట్రేడవుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ఔన్సు 4,477 డాలర్ల కొనసాగుతుండగా.. వెండి 66 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.పశ్చిమాసియాలో పెరిగిన ఉద్రిక్తతలు, చమురు ధరల భయాలతో ఇటీవల బంగారం ధరలు భారీగా క్షీణించిన సంగతి తెలిసిందే. దీంతో బంగారం ధరలు మరింత తగ్గుముఖం పడతాయని అంతా ఊహించారు. ఈ క్రమంలోనే అమెరికా ట్రెజరీ బాండ్లపై రాబడి క్షీణించడంతో బంగారం, వెండికి మళ్లీ డిమాండ్ ఏర్పడింది. ప్రైవేటు ఉద్యోగాల కల్పనకు సంబంధించిన డేటా అంచనాలు కంటే తక్కువ రావడం ఇందుకు కారణం. దీనివల్ల వడ్డీ రేట్ల పెంచాలన్న ఫెడ్ నిర్ణయానికి బ్రేక్‌పడినట్లయ్యింది. దీంతో అమెరికా డాలర్‌తో పాటు, ట్రెజరీ బాండ్ల రాబడులు సైతం తగ్గుముఖం పట్టాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ పేర్కొన్నారు.

### బౌద్ధ సన్యాసిగా మారేందుకు.. రూ.47 కోట్ల కంపెనీ అమ్మకానికి!

థాయ్‌లాండ్‌కు చెందిన ఓ వ్యాపారవేత్త అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. బౌద్ధ సన్యాసిగా మారే ప్రణాళికల్లో భాగంగా తన ఐస్‌క్రీమ్ కంపెనీని రూ.47 కోట్లకు అమ్మకానికి పెట్టారు. కొనుగోలుదారుని పరిచయం చేసిన వారికీ సుమారు రూ.1.4 కోట్లు ఫీజుగా చెల్లిస్తానని ఆయన ప్రకటించినట్లు స్థానిక మీడియా తెలిపింది. సిరిపాంగ్ అకారశ్రీయుక్ అనే వ్యాపారవేత్త 1999లో 'హావెల్స్' పేరుతో ఐస్‌క్రీమ్ కంపెనీని స్థాపించారు. ఒకప్పుడు ఎంతో పేరు పొందిన ఈ బ్రాండ్.. పోటీ మార్కెట్ వంటి కారణాలతో వెనుకబడిపోయింది.ఈ క్రమంలోనే సంసార జీవితాన్ని విడిచిపెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు సిరిపాంగ్ ఇటీవల ప్రకటించారు. బౌద్ధ సన్యాసిగా మారాలని 15 ఏళ్లుగా ప్రణాళిక వేసుకుంటున్నట్లు చెప్పారు. దీనికి ఇంకా రెండేళ్ల సమయం ఉందని.. ఆ లోపు ఓ ఆశ్రమాన్ని స్థాపించి, అక్కడ ధ్యానం సాధన చేస్తానని చెప్పారు. జ్ఞానోదయం పొందడం కోసం ఆధ్యాత్మిక సాధనకు తనను తాను అంకితం చేసుకోవడమే దీర్ఘకాలిక లక్ష్యమని వెల్లడించారు. బౌద్ధమతంపై అనేక రచనలు చేశారు. బుద్ధుని బోధనలపై ప్రసంగాలూ ఇచ్చారు.



## 1,75,000కు పైగా టెక్ ఉద్యోగాల కోత

### ఈ ఏడాదిలో ఇప్పటికే

టెక్ సంస్థల్లో లేఆఫ్‌లు సాధారణమే అయినా దిగ్గజ సంస్థల్లో భారీగా ఉద్యోగుల తొలగింపు జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అమెరికాలో పెద్దస్థాయి ఉద్యోగాలు కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు దొరకడం చాలా కష్టంగా ఉందని చెబుతున్నారు. ట్రూఅప్ సంస్థ ప్రకారం 2026లో ఇప్పటివరకు 1,75,000కు పైగా టెక్ ఉద్యోగాలు కోతకు గురయ్యాయి. 2025 మొత్తంమీద 2,45,000కు పైగా టెక్ ఉద్యోగులు ఉపాధి కోల్పోయారు.టెక్నాలజీలో వస్తున్న మార్పులు, సంస్థల పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలోనే కంపెనీలు ఉద్యోగాల కోత విధిస్తున్నాయి. లేఆఫ్స్‌కు ప్రధాన కారణాల్లో ఏఐ (కృత్రిమమేధ)తో పాటు ఐటీ సేవలకు డిమాండ్ తగ్గడం, సంస్థల పునర్వ్యవస్థీకరణ, వ్యాపార ప్రణాళికల్లో మార్పులు, ఖర్చుల తగ్గింపు, కొన్ని విభాగాల్లో బలహీన పనితీరు వంటి కారణాలతో కూడా కంపెనీలు ఉద్యోగులను తగ్గిస్తున్నాయి. కొత్త టెక్నాలజీలు, ముఖ్యంగా ఏఐ వ్యవస్థలపైకి నిధులు మళ్లించేందుకూ కొన్ని కంపెనీలు ఉద్యోగాలపై కోత విధిస్తున్నాయి.అత్యంత భారీగా ఉద్యోగాలను తగ్గించిన సంస్థల్లో ఒరాకిల్ ఒకటి. గత ఏడాది కాలంలో సుమారు 21,000 ఉద్యోగాలపై కోత విధించింది. సంస్థ మొత్తం ఉద్యోగుల సంఖ్యలో దాదాపు 13 శాతానికి సమానం. ఈనెలలో యాపిల్ సంస్థ కూడా విజన్ ప్రో హెడ్‌సెట్‌ను అభివృద్ధి చేసిన విజన్ గ్రూప్ నుంచి కనీసం 60 మంది ఉద్యోగులను తొలగించింది. మైక్రోసాఫ్ట్ 4,800 ఉద్యోగులకు లేఆఫ్ ఇస్తున్నట్లు గత నెలలో ప్రకటించింది. ఎక్స్‌బాక్స్‌లో 3,200 మంది



ఉద్యోగులను 2027 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి తొలగించనున్నారు. తన మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 7 శాతాన్ని (సుమారు 2,600 ఉద్యోగాలను) వీసా సంస్థ తగ్గిస్తోంది. ఈ కోతలు టెక్నాలజీ, ప్రొడక్ట్ టీమ్‌లపై ప్రభావం చూపుతున్నాయి. ఉబర్ సంస్థ తన కస్టమర్ సర్వీస్ విభాగంలోని 10% (సుమారు 3400) ఉద్యోగాలను తగ్గించినట్లు సమాచారం. అమెజాన్ కూడా తన ఏఐ విభాగంలో ఉద్యోగాలను తగ్గిస్తోంది. అమెరికాలో గూగుల్, మెటా, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ సంస్థల్లో 2 లక్షల డాలర్ల వార్షిక వేతనంపై పనిచేసి, లేఆఫ్‌నకు గురైన పెద్ద ఉద్యోగులు కూడా ప్రత్యామ్నాయ ఉపాధి లభించడం చాలా కష్టంగా ఉందని చెబుతున్నారు. ఉద్యోగ కోతలు తమ కెరీర్లను పూర్తిగా మార్చేశాయని, ఆర్థిక పరిస్థితులతో పాటు మానసిక ఆరోగ్యమూ దెబ్బతింటోందని తెలిపారు. ఉద్యోగ సంస్థ అందించే ఆరోగ్య బీమా కోల్పోయిన తర్వాత, తన కుటుంబం వైద్య బీమా కోసం నెలకు సుమారు 2,600 డాలర్లు చెల్లించాల్సి వస్తోందని వివరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కొందరు వ్యక్తిగత బ్రాండ్‌లను నిర్మించుకుంటుండగా, మరికొందరు కన్సల్టింగ్ వ్యాపారాలు లేదా స్టార్టప్‌లను ప్రారంభిస్తున్నారు. ఒరాకిల్ మరోసారి ప్రపంచవ్యాప్తంగా 7,000-10,000 వరకు ఉద్యోగులను తొలగించేందుకు సన్నాహాలు చేస్తోందని వార్తలు వస్తున్నాయి.

# బ్యాంకింగ్‌లో రూ.7.77 లక్షల కోట్ల మిగులు నిధులు


### రూ.12.01 లక్షల కోట్ల ఎఫ్‌సీఎన్‌ఆర్(బి) డిపాజిట్ల అండ ద్రవ్యోల్బణానికి దారితీసే అవకాశం లేదు: ఆర్థికవేత్తలు




దేశ బ్యాంకింగ్ వ్యవస్థలో నగదు లభ్యత (లిక్విడిటీ) అనూహ్యంగా పెరిగింది. ప్రస్తుతం బ్యాంకుల్లో సుమారు రూ. 7.77 లక్షల కోట్ల మేర అదనపు నిధులు ఉన్నాయి. 2022 ఏప్రిల్‌లో రూ.7.93 లక్షల కోట్ల తర్వాత, దాదాపు నాలుగున్నరేళ్లలో ద్రవ్య లభ్యత ఈ స్థాయికి చేరడం ఇప్పుడే. ఆర్‌బీఐ ప్రవేశపెట్టిన ఎఫ్‌సీఎన్‌ఆర్(బి) డిపాజిట్ స్వాప్ సదుపాయం ద్వారా వచ్చిన విదేశీ కరెన్సీ ప్రవాహం దీనికి ప్రధాన కారణం. దీనికితోడు నెలాఖరున పింఛన్లు, జీతాల చెల్లింపుల కోసం ప్రభుత్వం చేసిన వ్యయాలూ తోడవడంతో బ్యాంకుల వద్ద నిధుల నిల్వలు పెరిగాయి. ఈ భారీ గణాంకాలు తాత్కాలికమేనని, ఈ పరిస్థితి ఎంతో కాలం కొనసాగే అవకాశం లేదని ఆర్థిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు.బ్యాంకింగ్ వ్యవస్థలో నేడు ఉన్న నిధుల ప్రవాహం రేపు ఉండకపోవచ్చు. రానున్న రోజుల్లో ముందస్తు పన్ను చెల్లింపులు ప్రారంభం కానున్నాయి. ఐపీఓల్లో పెట్టుబడుల కోసం మదుపర్ల బ్యాంకు ఖాతాల్లో తాత్కాలికంగా నిలుపుదల చేసే నిధులు, షేర్లు మంజూరవ్వగానే బ్యాంకుల నుంచి బయటకు వెళ్తాయి. దీనివల్ల ప్రస్తుత మిగులు క్రమంగా తగ్గిపోతుంది. విదేశీ కరెన్సీని భారీగా ఆకర్షించిన ఎఫ్‌సీఎన్‌ఆర్(బి) పథకం ఇప్పటికే ముగిసింది. కాబట్టి, కొత్తగా భారీగా నిధులు రావు. 'ప్రస్తుతం బ్యాంకుల రుణ వృద్ధి రేటు 17-18 శాతంగా ఉంది. ఇంత వేగంగా రుణాలు పెరుగుతున్నప్పుడు బ్యాంకులకే నగదు అవసరం ఎక్కువగా ఉంటుంది. ఈ భారీ గిరాకీ కారణంగానే, రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) నిర్వహించిన తాజా వీఆర్ఆర్ఆర్ వేలంలో బ్యాంకుల నుంచి ఆశించిన స్పందన రాలేదు. ప్రస్తుత మిగులు నిధులు ఇప్పటికే వివిధ రుణాల కోసం కేటాయించినవే' అని కెనరా బ్యాంక్ గ్రూప్ ముఖ్య ఆర్థిక సలహాదారు మాధవన్‌కుట్టి వివరించారు. వ్యవస్థలో నిధులు ఎక్కువగా ఉన్నప్పటికీ ద్రవ్యోల్బణం పెరిగే అవకాశాలు లేవని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఆర్థికవేత్త గౌర సేన్‌గుప్తా అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశంలో డిపాజిట్ల వృద్ధితో పోలిస్తే, రుణాల వృద్ధి బలంగా ఉండటమే ఇందుకు కారణమన్నారు. కాబట్టి, ప్రస్తుత మిగులు నిధులు మార్కెట్లో అదనపు ద్రవ్య లభ్యతగా మారి, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను సృష్టించలేవని స్పష్టం చేశారు. బాండ్ల రాబడి పెరగడం, ఈక్విటీ మార్కెట్ల పతనం వంటి పరిణామాల వల్ల ఆర్థిక పరిస్థితులు ఇప్పటికే కఠినతరంగా మారాయని, అందువల్ల ద్రవ్యోల్బణ ప్రభావం ఉండదని గౌర సేన్‌గుప్తా వివరించారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రిన్సిపల్ ఎకనమిస్ట్ సాక్షి గుప్తా స్పందిస్తూ.. అవసరాన్ని బట్టి, ఆర్‌బీఐ తాత్కాలికంగా నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్)ని పెంచే అవకాశముందని పేర్కొన్నారు. దీనివల్ల నగదు సమతుల్యత దెబ్బతినదని అభిప్రాయం వ్యక్తం చేశారు.విదేశాల్లో నివసిస్తున్న భారతీయుల నుంచి దేశీయ బ్యాంకులు రికార్డు స్థాయిలో విదేశీ కరెన్సీని ఆకర్షించాయి. ఆర్‌బీఐ ప్రవేశపెట్టిన ప్రత్యేక ఎఫ్‌సీఎన్‌ఆర్(బి) డిపాజిట్ల పథకం ఆగస్టు 31న ముగిసింది. స్వాప్ సదుపాయం కింద దాదాపు రూ.12.01 లక్షల కోట్ల (127.23 బిలియన్ డాలర్ల) విదేశీ కరెన్సీ నాన్ రెసిడెంట్ డిపాజిట్ల (ఎఫ్‌సీఎన్‌ఆర్-బి)ను ఇవి సమీకరించాయి. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి మధ్య, విదేశీ మారకపు నిల్వలను బలోపేతం చేసేందుకు జూన్ 8న ఆర్‌బీఐ ఈ పథకాన్ని తీసుకొచ్చింది. వాస్తవానికి ఈ గడువు సెప్టెంబరు 30 వరకూ ఉంది. కానీ, ప్రవాసుల నుంచి అనూహ్య స్పందన లభించడంతో ఆగస్టు 31 వరకే పరిమితం చేసింది. బ్యాంకులు ఆకర్షణీయ వడ్డీ రేట్లను అందించడంతోనే ప్రవాసుల నుంచి ఇంతటి భారీ స్థాయిలో నిధులు తరలివచ్చాయని ఆర్‌బీఐ వెల్లడించింది.

## పదేళ్ల కిందటే మోదీ ఏఐ గురించి మాట్లాడారు: ఎన్విడియా సీఈవో

ప్రధాని నరేంద్ర మోదీ దశాబ్దం క్రితమే దూరదృష్టితో ఆలోచించి ఏఐ గురించి మాట్లాడారని ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ అన్నారు. ప్రపంచ ఐటీ రంగంలో భారత్ తిరుగులేని శక్తిగా ఎదిగిందని.. ఇప్పుడు ఏఐ రూపంలో కొత్త టెక్నాలజీ వైపు దూసుకుపోతోందన్నారు. భారతీయ కంపెనీలు, స్టార్టప్‌లు ఏఐ సాంకేతికతను మరింతగా అందిపుచ్చుకోవడంతోపాటు.. దాని అభివృద్ధిలోనూ భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు. బలమైన ఏఐ (ఐఎ) ఆర్థిక వ్యవస్థను నిర్మించేందుకు భారత్‌కు చాలా మంచి అవకాశాలు ఉన్నాయని హువాంగ్ తెలిపారు. నార్త్ కరోలినాలోని చాపెల్ హిల్‌లో జీ20 ఇన్నోవేషన్ మినిస్టీరియల్ సమావేశం సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఏఐ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని.. అందుకనుగుణంగా



దేశాలు మరింత వేగంగా ముందుకు సాగాలని హువాంగ్ సూచించారు. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ.. కోటి మంది యువతకు ఏఐ నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. హువాంగ్ 2023లో భారత్‌లో పర్యటించినప్పుడూ ప్రపంచంలో ఇండియా అతిపెద్ద ఏఐ హబ్‌గా ఎదగాలని ఆకాంక్షించారు.

## సంక్షిప్తంగా..



### 'సర్'నోటీసులు.. ధ్రువీకరణ పత్రాలతో ఓటర్ల బారులు

**కమాన్‌పూర్, సెప్టెంబర్ 03 (జనంసాక్షి):** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటర్ల వివరాల్లో పొంతన లేని లేదా తప్పుడు పొంతన ఉన్నట్లు గుర్తించిన కొంతమంది ఓటర్లకు అధికారులు నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న కమాన్‌పూర్ ఓటర్లు గురువారం గ్రామపంచాయతీ కార్యాలయానికి చేరుకుని సంబంధిత ధ్రువీకరణ పత్రాలను సమర్పించి తమ వివరాలను నిర్ధారించుకున్నారు. సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ధ్రువీకరణ ప్రక్రియను సజావుగా నిర్వహించారు. నోటీసులు అందుకున్న ఓటర్లకు అవసరమైన సూచనలు అందిస్తూ, పత్రాల పరిశీలనలో అధికారులు సహకరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వాసంతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ స్రవంతి, పంచాయతీ కార్యదర్శి రాము, ఉపసర్పంచ్ రఫీక్ సోహెల్, వార్డు సభ్యులు, రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ కిరణ్, బీఎల్ఓలు, రెవెన్యూ, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొని ఓటర్లకు అవసరమైన సహకారం అందించారు.

### అలరించిన విద్యార్థులు ఆటపాటలు

**బాలికల కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ వేడుక**



**మంథని, సెప్టెంబర్ 03, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం ఫ్రెషర్స్ డే వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ బాలోజీ మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత ఫలితాలు సాధించాలని సూచించారు. ఇటీవలే విద్యార్థులకు ప్రభుత్వం అల్పాహారం కూడా అందించడం జరుగుతుందన్నారు. తర్వాత మధ్యాహ్న భోజనం కూడా ఉంటుందని వెల్లడించారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ విశేషంగా అలరించాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జాన్సీ, తిరుపతి, రావుల తిరుమల్, శశాంక్, శ్రీదేవి, నగేష్, ఎల్ ఆర్ కే రెడ్డి, మౌనిక, సబిత, అతిథి అధ్యాపకులు సురేష్, దీపారాణి, సిబ్బంది బియ్యబాని, రాజయ్య, అర్జయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

### ఇంకుడు గుంతలను పరిశీలించిన కేంద్ర బృందం



**కమాన్ పూర్, సెప్టెంబర్ 03, (జనంసాక్షి)** పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం పేరపల్లి గ్రామంలో చేపడుతున్న ఇంకుడు గుంతల నిర్మాణాలను కేంద్ర బృందం ప్రతినిధులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణాలు, నిర్వహణ తీరుపై బృందం సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ విధిగా ఇంకుడు గుంతలు నిర్మించుకొని భూగర్భ జలాల పెంపునకు సహకరించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొంగోని సదయ్య, పంచాయతీ కార్యదర్శి సాయిశ్రీ, ఫీల్డ్ అసిస్టెంట్ పోల్దసరి రవి, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# పేదలకు కార్పొరేట్ విద్య

**రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్**



**వెల్గటూర్,సెప్టెంబర్3(జనంసాక్షి):** రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య, సౌకర్యాలు కల్పించడమే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ. 67 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు గురువారం మంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసిన మంత్రి విద్యార్థులకు బూట్లతోపాటు బ్యాగులను అందజేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ మండలంలోని తహసిల్దార్, ఎంపీడీవోలు వారంలో ఒకరోజు ప్రభుత్వ పాఠశాలను, సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు పరిశీలించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు చదువులో రాణించాలని మంత్రి ఈ సందర్భంగా కోరారు. రాష్ట్రంలోని సంక్షేమ శాఖ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య తో పాటు పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి తెలిపారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం అని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. కుమ్మర్ పల్లి కస్తూర్బా వసతి గృహాన్ని ప్రతి నెలకు ఒకసారి సందర్శిస్తానని మంత్రి తెలిపారు. విద్యార్థులకు అవసరమైన క్రీడా మైదానం ఏర్పాటుకు చొరవ తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు చదువులో రాణిస్తూ మంచి మార్కులు సాధించినందుకు పాఠశాల ఉపాధ్యాయులను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జక్కుల ఆమని, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, వెల్గటూర్ తహసీల్దార్ శేఖర్, పలువురు అధికారులు,ప్రజా ప్రతినిధులు వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.



## అందరి ఓట్లు నమోదయ్యేలా చూడాలి

**బీఎల్‌వోలకు సూచించిన హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సర్ ఇంచార్జ్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**

**వీణవంక సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** వీణవంక మండలంలో సర్ 2 ప్రక్రియ ఏ విధంగా జరుగుతుందో తెలుసుకోవడానికి హుజూరాబాద్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ సర్ ఇంచార్జి కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి వీణవంక మండలంలోని కొండపాక గ్రామంలో 97,98 బూతులలో నోటీసులు వచ్చిన వారి ఇండ్లకు బిఎల్ఏ,బిఎల్ ఓ లతో కలిసి వెళ్లి వారితో మాట్లాడి సంబంధిత ఆధారాలు సేకరించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎక్కువ శాతం నోటీసులు వచ్చినవారిలో 2002 లో ఓటు వేసిన దానికి వాళ్ళ వారసుల వయస్సు తేడా వచ్చిన వారున్నారని తండ్రి పేరు ఇంటి పేరులో తేడా ఉన్నవాళ్ళు 2002 ఓటర్ లిస్టు మ్యాపింగ్ కు సంబంధించి సరియయిన సమాచారం ఇవ్వని వాళ్ళు ఉన్నారని అన్నింటికీ దగ్గరుండి ఆధారాలు సేకరించి తుది జాబితాలో వీరందరి ఓట్లు నమోదు అయ్యే విధంగా పని చేయాలని బిఎల్ఏ లకు నరేందర్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమం లో మండల సీనియర్ నాయకుడు ఎండీ సాహెబ్ హుస్సేన్, నియోజకవర్గ ఈఆర్వో కోఆర్డినేటర్ మొలుగూరి సదయ్య,గ్రామ సర్పంచ్ దాట్ల వీరాస్వామి,ఈదునూరి పైడి కుమార్, మ్యాడగొని శ్రీనివాస్, మహమ్మద్ సజ్జు,బిఎల్ఏ లు రామకృష్ణ,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**బీఆర్టీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా**

**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 03,(జనంసాక్షి):** భవన నిర్మాణ, హమాలీ రంగ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్టీయూ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో భవన నిర్మాణ, హమాలీ రంగాలకు చెందిన కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రమాదవశాత్తు మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు ఎల్ఐసీ ద్వారా కాకుండా బీఓసీ సంక్షేమ బోర్డు ద్వారా రూ.10 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. 55 ఏళ్లు దాటిన కార్మికులకు నెలకు రూ.5 వేల పెన్షన్, కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందించాలని కోరారు. అలాగే కార్మికుల పిల్లల వివాహాలు, ప్రసవ ఖర్చుల కోసం అందిస్తున్న రూ.30 వేల సహాయాన్ని రూ.60 వేలకు పెంచాలని, సహజ మరణం చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. హమాలీ కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. రైస్ మిల్లులు, మార్కెట్ యార్డులు, ఐకేపీ కేంద్రాల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికులను సంక్షేమ పథకాల పరిధిలోకి తీసుకురావాలని కోరారు. అర్హులైన హమాలీ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, పని ప్రదేశాల్లో ప్రమాదవశాత్తు మృతి చెందితే వారి కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి, వారికి సామాజిక భద్రత కల్పించాలని నాయకులు కోరారు. ధర్నా అనంతరం అదనపు కలెక్టర్‌ను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, భవన నిర్మాణ రంగం జిల్లా అధ్యక్షుడు ఆకుల మల్లేశం, హమాలీ రంగం జిల్లా అధ్యక్షుడు కొమిరే రాఘవులు, నాయకులు ఇరుకుల్ల బాబు, ఇరుకుర్ల రవి, కందుల రాజమల్లు, కులాని కుమారస్వామి, కొత్త రాజేందర్, పప్పు సత్తయ్య, రామగిరి సంపత్, కే.మల్లయ్య, డి.గోపాల్, శంకర్, అరుణ్, అనిల్, సురేందర్‌తో పాటు సుమారు 70 మంది కార్మికులు పాల్గొన్నారు.

### రోడ్డులో ప్రమాద సంఘటన స్థలాన్ని పరిశీలించిన సీపీ

**బోధన్, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):** బోధన్ బైపాస్ రోడ్డులోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనను గురువారం నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య పరిశీలించి ప్రమాదానికి గల కారణాలు , పరిస్థితులను పరిశీలించారు. ప్రమాద స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించి , ట్రాఫిక్ నియంత్రణ , ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత పోలీసు అధికారులకు సూచనలు చేశారు. రహదారిపై వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని , ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ సూచించారు. ఆయన వెంట బోధన్ ఎసిపి శ్రీనివాస్, బోధన్ రూరల్ సీఐ విజయబాబు, బోధన్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.



## హామీలన్నీ అమలు చేయాలి

**ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**



**వీణవంక సెప్టెంబర్ 3:(జనంసాక్షి)** వీణవంక కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు హుజూరాబాద్ నియోజకవర్గంలోని వీణవంక మండల కేంద్రంలో గురువారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,ప్రజా ప్రతినిధులు,రైతులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలు,420 హామీల అమలులో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ నాయకులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. కాంగ్రెస్ బాకీ కార్డు ను ప్రజలకు పంపిణీ చేస్తూ అమలు కాని హామీలపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బండ శ్రీనివాస్,వాల బాలకిషన్ రావు, ముసిపట్ల తిరుపతి రెడ్డి,మాడ సదావ రెడ్డి,సింగిల్ విండో చైర్మన్ విజయ భాస్కర్ రెడ్డి,కామిడి శ్రీనివాస్ రెడ్డి, పింగిలి రమేష్,స్థానిక సర్పంచ్ దాసరపు సరోజన రాజేంద్ర ప్రసాద్, నీల కుమారస్వామి, తాళ్లపల్లి మహేష్ కాసర్ల సుధాకర్,వడ్డేపల్లి భూమయ్య, జక్కు నారాయణ,ముత్యాల శంకర్, నాగిడి సంజీవ రెడ్డి,కాంత రెడ్డి జనార్ధన్ రెడ్డి, అడిగిప్పుల సత్యనారాయణ,ఎండి యాసిన్,వివిధ గ్రామాల సర్పంచులు,ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలను ప్రారంభించిన పోలీస్ కమిషనర్



**బోధన్, సెప్టెంబర్ 3 (జనంసాక్షి) :** బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెగడాపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మన ఊరు మన భద్రత మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా 15 సీసీ కెమెరాలను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడము ఎంతో సంతోషమని, ఒక్క సీసీ కెమెరా అనేది 100 మంది పోలీసులతో సమానమని, సీసీ కెమెరాల ద్వారా గ్రామంలో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలను సులభంగా గుర్తించి తక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని, నేరాల నివారణలో సీసీ కెమెరాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణలో కూడా ఈ కెమెరాలు పోలీసులకు సహాయపడతాయని వివరించారు. ప్రతి ఒక్కరు వారి భద్రత కోసం సి సి కెమెరా లను పెట్టాలని చెప్పారు. ఇది వారి భాద్యత గా తీసుకోవాలి. దుకాణాల యజమానులు తప్పనిసరిగా సి. సి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. పెగడాపల్లి గ్రామంలో 15 కెమెరాలు పెట్టి సహకరించిన శాలిమర్ హచరీస్ కంపెనీ మేనేజర్ పోలీస్ కమిషనర్ అభినందించారు. విద్యార్థినిలు గ్రామంలో గల మహిళలు మరియు ద్వాక్రా గ్రూపు మహిళలతో వారి యొక్క బాగోగుల గురించి చర్చించి విద్యార్థులు ఎలాంటి ఆకర్షణలకు గురికాకుండా ఇంట్లో తల్లిదండ్రులకు అన్ని రకాలుగా సహకరిస్తూ విద్యను చక్కగా అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఎసిపి. శ్రీనివాస్, బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు, రూరల్ ఎస్ఐ రాజశేఖర్ , ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ, గ్రామ సర్పంచ్ మద్ది రచన సుదర్శన్ షాలిమార్ ఆచరిస్ మేనేజర్ ఇమ్రాన్ ముళ్ళ, గ్రామ వైస్ ప్రెసిడెంట్ పోతు రెడ్డి, ఉపసర్పంచ్ ఎండి షబ్బీర్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కారడి సాయిబాబా, కృష్ణారెడ్డి, వేణు, సాయిలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


### టీయూసీఐ తెలంగాణ రాష్ట్ర జనరల్‌ను విజయవంతం చేయండి



**బోధన్, సెప్టెంబర్ 3 (జనంసాక్షి) :** నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని రాకాసిపేటులో గురువారం మునిసిపల్ వాటర్ ఫిల్టర్ బెడ్ వద్ద మున్సిపల్ కార్మికులతో ఈ నెల 6వ తేదీన ఖమ్మం జిల్లాలో నిర్వహిస్తున్న టి యు సి ఐ తెలంగాణ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టియుసిఐ రాష్ట్ర కమిటీ నాయకుడు బి. మల్లేష్ మాట్లాడుతూ, ఈనెల 6వ తేదీన ఖమ్మం నగరంలో జరిగే ఖమ్మం నగరంలో జరిగే టి యు సి ఐ తెలంగాణా రాష్ట్ర జనరల్ కౌన్సిల్ కు ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నేడు దేశంలోనే కార్మిక వర్గం కేవలం బ్రతకటానికి గౌరవప్రదమైన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మికులు పనిచేస్తున్న స్థలాల్లో వేధింపులను మానుకోవాలని, 12 గంటలు పని చేయించుకునే విధానాన్ని మార్చాలని ఉద్యమిస్తుంటే నేడు దేశంలోని పాలకవర్గాలు కార్మిక వర్గంపై భాషా వాయు ప్రయోగాలు అరెస్టులను, లాఠి చార్జ్ లను ప్రయోగిస్తున్నదని దుయ్యబట్టారు. కార్మికులు సంఘటితమై పోరాటాలను చేయడం మూలంగా కొన్ని హక్కులను మాత్రమే సాధించుకోగలిగారని తెలిపారు. పాలకులు నామ మాత్రపు వేతనాల పెంపుదలని మాత్రమే చేశాయన్నారు. వీటితో కార్మికుడి కుటుంబం వారి జీవనం గౌరవప్రదంగా బతికే వేతనాలు లేకపోవడంతో నేడున్న ధరల పరిస్థితుల్లో మరింత పేదరికంలోకి నెట్టి వేయడంతో దేశంలోనే కార్మిక వర్గం నిత్య సంఘర్షణతో జీవిస్తుందన్నారు. వేతనాల్లో కోతలు పెరిగాయని, బీడీ కార్మికులకు జీవన భృతి పెంచాల్సింది పోయి ఇటీవల చేయూత పథకంలో ఆ కార్మికులకు అప్లై చేసుకునే అవకాశం కల్పించలేదని ఇందులో భాగంగానే మన తెలంగాణా రాష్ట్రంలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సవాళ్ళని అధిగమించి, సంఘటితమై మరింత ఉత్తేజవంతమైన, ప్రభావవంతమైన ఉద్యమాలను నిర్మించుకోవడానికి విశాల ఐక్య ఉద్యమాలను నిర్మించడంతోపాటు టియుసిఐ కార్మిక వర్గం లో మరింత లోతుగా వెళ్లే కర్తవ్యాలను రూపొందించుకోవడానికి ఈ నెల 6వ తేదీన ఖమ్మంలో నిర్వహిస్తున్న రాష్ట్ర జనరల్ కౌన్సిల్ కు హాజరై విజయవంతం చేయాలని బి. మల్లేష్ పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ టీ యూ సీ ఐ రాష్ట్ర కమిటీ నాయకుడు మక్కయ్య, నారాయణ, జి.రాజు, గంగారాం, దరి తదితరులతో పాటు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల విధ్వంసం

- **కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం**
- **మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు**



**కథలాపూర్ సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** పదేండ్ల కేసీఆర్ పరిపాలనలో.. రైతన్నలు సుభిక్షంగా ఉన్నారని, ఇప్పుడు కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో రైతన్నలు గోసపడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు మండిపడ్డారు. నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ " రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దాకా బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తాం. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రైతన్న కంట్లో నేడు కన్నీరుకు కారణమవుతుంది కాంగ్రెస్ ప్రభుత్వం. వేములవాడ రాజన్న ఆలయం ముందు 2023 నవంబర్ 28న ఎన్నికల సమయంలో ఆది శ్రీనివాస్ బాండ్ పేపర్ రాసి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కేవలం వంద రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టే ఆరు గ్యారెంటీ కచ్చితంగా నేను అమలు చేస్తానని రాజన్న సాక్షిగా చెప్పి నేటికీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి1000 రోజులు కావస్తున్న 6 గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమయ్యారు. ఎమ్మెల్యే అయ్యాక నియోజకవర్గ అభివృద్ధి చేస్తానని ప్రజలను మోసం చేశాడు ఆది శ్రీనివాస్. వేములవాడ రాజన్న ఆలయం ముందు 2023 నవంబర్ 28న ఎన్నికల సమయంలో ఆది శ్రీనివాస్ బాండ్ పేపర్ రాసి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కేవలం వంద రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టే ఆరు గ్యారెంటీ కచ్చితంగా నేను అమలు చేస్తానని రాజన్న సాక్షిగా చెప్పి నేటికీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి1000 రోజులు కావస్తున్న 6 గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమయ్యారు. ప్రజలు మిమ్మల్ని ఎన్నుకుంటే, మాకు ప్రతిపక్ష నేత కేసీఆర్ వచ్చి దారి చూపుతేనే ప్రభుత్వం నడుపుతానీ అన్నట్లు ఉంది మీ తీరు. అధికారంలో ఉండి కూడా, ర్యాలీలు చేయడం సిగ్గుచేటువెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో కేసీఆర్ ను తిట్టడమే తప్ప.. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసింది ఏమీ లేదు. ముందు మీరు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చండి తెలియజేశారు ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జగిత్యాల జిల్లా పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్పర్సన్ తులాభా మార్కెట్ సీనియర్ నాయకులు మనోహర్ రెడ్డి కథలాపూర్ మండల్ రైతు అధ్యక్షుడు గడ్డం భూమారెడ్డి మాజీ ఎంపీపీలు రేవతి స్వరూప మండల అధ్యక్షులు సీనియర్ నాయకులు రవికుమార్ అజిత్ రావు దేవయ్య మేకలు ఎల్లయ్య దోస్కుల రవి డైరెక్టర్ హరి చరణ్ రావు ఆకుల గంగవరం మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు మాజీ ఎంపిటిసిలు సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ విజయానికి క్షేత్రస్థాయి పునర్నిర్మాణమే కీలక పునాది

**టీపీసీసీ ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్ర వైస్ చైర్మన్ సేడ్మకి ఆనంద్**




**కరీంనగర్ క్రైమ్ , సెప్టెంబర్ 03 (జనంసాక్షి):** కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ ఎస్టి సెల్ అధ్యక్షులు బానోతు శ్రావణ్ నాయక్ ఆధ్వర్యంలో టీపీసీసీ ఆదివాసి కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్ సేడ్మకి ఆనంద్ రావు మాట్లాడారు. ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ విజయానికి, ప్రజాస్వామ్య పరిరక్షణకు క్షేత్రస్థాయి నిర్మాణం అత్యంత కీలకమని అన్నారు. కేవలం రాష్ట్ర, జాతీయ నాయకత్వంతో మాత్రమే ఎన్నికల్లో గెలవలేమని, ఏఐసీసీ సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం ద్వారా గ్రామ, వార్డు, పోలింగ్ బూత్ స్థాయి, వరకు పటిష్టమైన నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రతి బూత్ కు ఒక అధ్యక్షుడితో కమిటీ వేసి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో పరిశీలించాలని, గ్రామ, డివిజన్, వార్డు కమిటీలు పార్టీ విధానాలను అట్టడుగు ప్రజలకు చేరవేయాలని అన్నారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ టీపీసీసీ ఆదివాసి కాంగ్రెస్ చైర్మన్ తేజావత్ శంకర్ నాయక్ ఆదేశాల మేరకు కరీంనగర్, జగిత్యాల జిల్లాల్లో ఆదివాసి కాంగ్రెస్ జిల్లా కమిటీ నిర్మాణం కోసం దరఖాస్తులు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుర్ర పోచయ్య, లావుడియా రంగా నాయక్, రాజలింగం సూర్య, గుగులోతు గోపి, లావుడియా సుధాకర్, మాలోతు మహాలక్ష్మి, సాయి నాయక్ తదితర ఆదివాసి నాయకులు పాల్గొన్నారు.

## డిజిటల్ కీ చోరీ కేసులో నలుగురి అరెస్ట్




**బయ్యారం సెప్టెంబర్ 3(జనంసాక్షి) :** మండల పరిషత్ కార్యాలయం నుంచి డిజిటల్ కీలను దొంగిలించి నకిలీ సర్టిఫికెట్లు జారీ చేసిన నలుగురిని పోలీసుల అరెస్ట్ చేశారు. గార్ల బయ్యారం సీఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గతంలో మండల పరిషత్ కార్యాలయంలో భద్రపరిచిన బర్త్,డెత్ సర్టిఫికెట్ల, జారీ కోసం కార్యదర్శులు ఉపయోగించే డిజిటల్ కీలు చోరీకి గురై వాటి ద్వారా సుమారు 200 బర్త్ సర్టిఫికెట్లు,19 డెత్ సర్టిఫికెట్ లు జారీ అయ్యాయి. దీనిపై అప్పటి ఎం పి ఓ చంద్రమోహన్ ఫిబ్రవరి మూడో తారీకు న స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రత్యేక విచారణ చేపట్టగా బయ్యారం గ్రామపంచాయతీ కార్యాలయంలో పనిచేసే మల్టీపర్పస్ వర్కర్ కుంజ ప్రతాప్ డిజిటల్ కీలను తస్కరించి ఇట్టి అక్రమ సర్టిఫికెట్ల జారీకి పాల్పడినాడని నిర్ధారణ అయిన నేపథ్యంలో అతని తోపాటు అతనికి సహకరించిన మహబూబాబాద్ పట్టణానికి చెందిన చెవిటి సతీష్, షేక్ అలీమ్, కోట సుధాకర్ లను కూడా అరెస్టు చేసినట్లు సి ఐ తెలిపారు. తప్పుడు పద్ధతిలో డెత్ సర్టిఫికెట్లు పొందినవారిని, ఇతర అవసరాలకు వాడుకున్న వ్యక్తులను కూడా త్వరలోనే అరెస్టు చేయడం జరుగుతుందని తెలిపారు.

## రైతుల సమస్యలపై బీఆర్ఎస్ మహా పాదయాత్ర, మహాధర్నా



**రాయపర్తి,సెప్టెంబర్ 03 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం రాయపర్తి మండలంలో రైతుల మహా పాదయాత్ర, మహాధర్నా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ కమిటీ పిలుపు మేరకు,రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాలతో సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు చేపడుతున్న పోరాట కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాయపర్తి మండలం విద్యానగర్ తండా దుర్గమ్మ గుడి నుంచి ఎస్ఆర్ఎస్పి కెనాల్ వెంబడి తిర్మలాయపల్లి,రాయపర్తి మంచినీళ్ల చెరువు మీదుగా రాయపర్తి బస్టాండ్ వరకు రైతులు, బీఆర్ఎస్ శ్రేణులతో మహా పాదయాత్ర నిర్వహించారు. వ్యవసాయం, నీటిపారుదల, యూరియా సరఫరా,రైతు బీమా తదితర అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం జాతీయ రహదారిపై మహాధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి,రాయపర్తి మండలానికి చెందిన పార్టీ ముఖ్య నాయకులు, రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యతపై అవగాహన

- టీకా అనంతరం వివరాలన్నీ యు - విన్ పోర్టల్ లో నమోదు చేయాలి
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 03(జనంసాక్షి) :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సమావేశ మందిరంలో, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల లో పనిచేస్తున్న ఆరోగ్య కార్యకర్తలకు ఒక్కరోజు "యు-విన్" పోర్టల్ మీద శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. గురువారం హాజరైన ఆరోగ్య కార్యకర్తలను ఉద్దేశించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు మాట్లాడుతూ, వ్యాక్సినేషన్ అనంతరము వివరాలను యు-విన్ పోర్టల్ లోనమోదు చేయడం ద్వారా, జాతీయస్థాయిలో వ్యాక్సినేషన్ అమలు విధానంను గుర్తించడానికి, తదుపరి వాక్సినేషన్ అనగా 'డ్యూ -డేట్ 'వ్యాక్సిన్ బుకింగ్ మరియు వ్యాక్సిన్ తీసుకునే సెంటర్ను నమోదు చేసుకోవడానికి నమో మరియు వ్యాక్సిన్ అనంతరము 'యు - పోర్టల్ 'ద్వారా వ్యాక్సినేషన్ సర్టిఫికెట్ను కూడా పొందవచ్చని వివరించారు.గర్భిణీ స్త్రీలకు, పాలిచ్చు తల్లులకు గ్రామాలలో ఏఎన్సి క్లినిక్ లలో, అంగనవాడీ కేంద్రాల ద్వారా పోషకాహార పంపిణీ చేసే వి హెచ్ యన్ డే కార్యక్రమాలలో వ్యాధి నిరోధక టీకాలను షెడ్యూల్ ప్రకారము పిల్లలకు టీకాలు వేసినప్పుడు భవిష్యత్తులో వచ్చే వ్యాధుల నుండి రక్షింపబడి, ఆరోగ్య భారతావనిని నిర్మించవచ్చునని, పుట్టిన నాటి నుండి 17 సంవత్సరాల వరకు అన్ని రకాల టీకాలు నేషనల్ వ్యాధి నిరోధక టీకాల పట్టిక ద్వారా పిల్లలకు వేయాలని వివరించారు. స్టేట్ మానిటరింగ్ మరియు ఎవల్యూషన్ ఆఫీసర్ డాక్టర్ పనింద్ర యువిన్ పోర్టల్ నమోదు గురించి శిక్షణ ఇచ్చినారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల నియంత్రణ అధికారి డాక్టర్ నాగ అనేష్, మాస్ మీడియా అధికారి సంపత్, జిల్లా ప్రోగ్రాం మానిటరింగ్ పర్యవేక్షకులు వెంకట్రెడ్డి సురేష్ బాబు, యువిన్ పోర్టల్ కోఆర్డినేటర్ జోష్న, వీసీ సీఎం దివ్య మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ టౌన్ (జనంసాక్షి) :** బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎయిడ్ ఎన్జీఓ ఆధ్వర్యంలో బాల్య వివాహ ముక్త భారత్ కు సంబంధించిన వాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... ఆడపిల్లల రక్షణ, సంరక్షణ కోసం జేజేబీ కోర్టు, చైల్డ్ లైన్, ఐసీపీఎస్, ఎయిడ్ ఎన్జీవో పని చేస్తున్నాయని తెలిపారు. ఆపదలో ఉన్న వారు డయల్ 1098, 100 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కే.మిల్కా, డిఆర్డిఏపిడి రాథోడ్ రవీందర్, జిల్లా పంచాయతీ అధికారి గుడిపెళ్ళి రమేష్, పంచాయతీరాజ్ డిఈ శివరాం, ఐసిడిఎస్ సిడిపిఓ ఎం.ఉమాదేవి, సూపర్వైజర్లు, వివిధ శాఖ కు చెందిన అధికారులు, ఎయిడ్ స్వచ్ఛంద ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ కే. వినోద్, కమ్యూనిటీ మొబిలైజర్లు సంపత్ కిరణ్, కే. శంకర్ లు ఉన్నారు.

## గుడుంబా విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

- ఐదు లీటర్ల గుడుంబా స్వాధీనం

**చిట్యాల, సెప్టెంబర్ 03 (జనం సాక్షి):** మండల కేంద్రంలో అక్రమంగా కుటుంబ విక్రయిస్తున్న ఒక మహిళను పట్టుకొని ఆమె వద్ద నుండి ఐదు లీటర్ల గూడెం స్వాధీనం చేసుకున్నట్లు చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గురువారం మధ్యాహ్నం సమయంలో హెడ్ కానిస్టేబుల్ వి చంద్రమౌళి తమ సిబ్బందితో కలిసి చిట్యాల గ్రామ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఒక మహిళ ప్లాస్టిక్ క్యాన్ లో ఐదు లీటర్ల నిషేధిత నాటుసారా లభ్యమయింది విచారణలో సదరు మహిళ పాచిగడ్డ తండ గ్రామానికి చెందిన జార్పుల విశాఖ గుర్తించారు. ఆమె వద్ద ఉన్న సుమారు 2000 విలువ గల ఐదు లీటర్ల గుడుంబాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామాల్లో ఎవరైనా గుడుంబా తయారుచేసిన అక్రమంగా నిల్వచేసిన విక్రయించిన వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారి సమాచారాన్ని వెంటనే పోలీస్ స్టేషన్ కు అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# రైతు రక్షణ పాదరక్షలతో చాలా లాభాలు

- అన్నం పెట్టే రైతన్నకు ఎంతో ఉపయోగం
- పాద సంరక్షణ నిపుణులు డాక్టర్ వి. నరేష్ కుమార్





**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 03 (జన సాక్షి) :** రైతన్న పొలంలో పనిచేసేటప్పుడు తన ఆరోగ్యం, ముఖ్యంగా పాదాల భద్రతపై కూడా శ్రద్ధ తీసుకోవాలి. పొలాల్లో మట్టి, నీరు, ముళ్లు, పదునైన రాళ్లు, గాజు ముక్కలు, పురుగులు, పాములు, తేళ్లు వంటి అనేక ప్రమాదాలు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. అందువల్ల పొలంలో పనిచేసేటప్పుడు కాళ్లను పూర్తిగా కప్పి ఉంచే, బలమైన అడుగు భాగం కలిగిన రక్షణ పాదరక్షలు ధరించడం చాలా ఉపయోగకరం అని డాక్టర్ వి. నరేష్ కుమార్, జనరల్ సర్జన్ పాద సంరక్షణ నిపుణులు చెబుతున్నారు.

పొలాల్లో కనిపించకుండా ఉన్న ముళ్లు, గాజు ముక్కలు, ఇనుప ముక్కలు, రాళ్లు వంటి పదునైన వస్తువులు పాదాలకు గుచ్చుకోవచ్చు.రక్షణ పాదరక్షలు కాళ్లను పూర్తిగా కప్పి ఉంచడం వల్ల ఇలాంటి గాయాల ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. గడ్డి లేదా బురదలో దాగి ఉన్న ముల్లు పాదంలో గుచ్చుకోవచ్చు. పంట కోత తర్వాత పొలంలో మిగిలిన గాజు లేదా ఇనుప ముక్కలు పాదానికి గాయం చేయవచ్చు. పొలాల్లో పాములు, తేళ్లు మరియు ఇతర విషపూరిత జీవులు ఉండే అవకాశం ఉంటుంది. కాళ్లను మోకాళ్ల కింద వరకు కప్పి ఉంచే మందమైన పాదరక్షలు పాదాలకు, దిగువ కాళ్లకు కొంత రక్షణ కల్పిస్తాయి. అయితే ఏ పాదరక్షలూ పాము కాటును పూర్తిగా అడ్డుకోలేవు. పొలాల్లో జాగ్రత్తగా నడవడం, పొదల్లో లేదా రంధ్రాల్లో చేతులు, కాళ్లు పెట్టకుండా ఉండడం కూడా చాలా ముఖ్యం. మధుమేహం ఉన్న కొంతమంది వ్యక్తుల్లో పాదాల స్పర్శ తగ్గడం, రక్తప్రసరణ తగ్గడం, గాయాలు ఆలస్యంగా మానడం వంటి సమస్యలు ఉండవచ్చు.అందువల్ల మధుమేహం ఉన్నవారు చెప్పులు లేకుండా లేదా పాదాలను పూర్తిగా కప్పని చెప్పులతో పొలంలో పనిచేయడం మంచిది కాదు.సరైన రక్షణ పాదరక్షలు ధరించడం వల్ల ముళ్లు, రాళ్లు, చిన్న గాయాలు వంటి వాటి నుంచి పాదాలను కాపాడుకోవచ్చు.మధుమేహం ఉన్న రైతులు ప్రతిరోజూ తమ పాదాలను పరిశీలించాలి. చిన్న గాయం కనిపించినా నిర్లక్ష్యం చేయకూడదు. చర్మవ్యాధులు, కణజాల వాపు వంటి సమస్యలను తగ్గించడంలో సహాయంపొలాల్లో మట్టి, నీరు, చెత్త మరియు వివిధ రకాల సూక్ష్మజీవులతో కాళ్లకు ఎక్కువగా సంబంధం ఉంటుంది. పాదాలకు చిన్న గాయం ఏర్పడితే దాని ద్వారా సూక్ష్మజీవులు శరీరంలోకి ప్రవేశించి చర్మం మరియు లోపలి కణజాలాల్లో తీవ్రమైన వాపు, ఇన్ఫెక్షన్ కలిగించవచ్చు. పాదాలను కప్పి ఉంచే రక్షణ పాదరక్షలు చిన్న గాయాలు, ముళ్ల గుచ్చుకోవడం, చర్మం కోసుకుపోవడం వంటి వాటిని తగ్గించడం ద్వారా ఇలాంటి సమస్యల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి.

### బురద, కలుషిత నీటి నుంచి రక్షణ



వరి పొలాల్లో ఎక్కువసేపు నీటిలో లేదా బురదలో పనిచేయాల్సి ఉంటుంది. దీనివల్ల పాదాల చర్మం ఎక్కువసేపు తడిగా ఉండి చర్మం మెత్తబడటం, పగుళ్లు రావడం, దురద, శిలీంధ్ర సంబంధిత సమస్యలు ఏర్పడే అవకాశం ఉంటుంది.నీరు లోపలికి రాకుండా ఉండే రక్షణ పాదరక్షలు పాదాలను తడి మట్టి, బురద మరియు నీటి నుంచి రక్షించడంలో ఉపయోగపడతాయి. "చిన్న గాయమే కదా" అని రైతన్న నిర్లక్ష్యం చేయడం మంచిది కాదు. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారిలో చిన్న గాయం కూడా కొన్నిసార్లు తీవ్రమైన సమస్యగా మారవచ్చు.ముల్లు గుచ్చుకోవడం.. చిన్న గాయం.. సూక్ష్మజీవుల సంక్రమణ.. చర్మం, కణజాలాల్లో వాపు.. తీవ్రమైన ఇన్ఫెక్షన్ అనే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది.అందుకే పొలానికి వెళ్లేటప్పుడు రక్షణ పాదరక్షలు ధరించడం ఒక చిన్న జాగ్రత్త అయినప్పటికీ, దాని ప్రయోజనం చాలా పెద్దది.

## రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

- కలెక్టర్ రాహుల్ శర్మ
- భద్రతా చర్యలపై రోడ్డు భద్రతా కమిటీ సమీక్ష




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (జనంసాక్షి) :** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా రోడ్డు భద్రతా కమిటీ చైర్మన్ రాహుల్ శర్మ ఆదేశించారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్‌తో కలిసి ఆయన పోలీస్, రవాణా, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, జాతీయ రహదారులు, మున్సిపల్, వైద్య తదితర శాఖల అధికారులతో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ, డిస్ట్రిక్ట్ హైవే టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో రోడ్డు ప్రమాదాల పరిస్థితి, బ్లాక్ స్పాట్లు, ప్రమాదకర ప్రాంతాలు, ట్రాఫిక్ నియంత్రణ, హైవే పెట్రోలింగ్, అత్యవసర వైద్య సేవలపై సమీక్షించారు. జిల్లాలో ప్రమాదాలు అధికంగా జరుగుతున్న 10 బ్లాక్ స్పాట్లను గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. గుర్తించిన బ్లాక్ స్పాట్లను రెవెన్యూ, పోలీస్, ఆర్అండ్‌బీ, ఎన్‌హెచ్ఏఐ, పంచాయతీరాజ్ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన భద్రతా చర్యలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. క్రాష్ బ్యారియర్లు, రిఫ్లెక్టర్లు, హెచ్చరిక బోర్డులు, రోడ్ మార్కింగ్స్, లైటింగ్ తదితర సదుపాయాలను మెరుగుపరచాలని సూచించారు. ఎస్పీ సంకీర్త్ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగిన వెంటనే స్పందించేలా హైవేలపై పెట్రోలింగ్ వాహనాలు, క్రేన్లు, అంబులెన్స్‌లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. 1033 హెల్ప్‌లైన్‌పై ప్రజలకు అవగాహన కల్పించేలా హైవేల వెంట ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. రహదారులపై పశువుల సంచారం వల్ల ప్రమాదాలు జరగకుండా పశువుల యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని, నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. సమావేశంలో చర్చించిన అంశాలపై శాఖల వారీగా బాధ్యతలు, కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేసి పురోగతి నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించకపోవడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్‌ఫోన్ వినియోగించడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. ఈ సమావేశంలో డీఎస్పీ సంపత్‌రావు, జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్, ఆర్అండ్‌బీ ఈఈ మనోహర్, పీఆర్ ఈఈ విద్యాసాగర్, జాతీయ రహదారుల ఈఈ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఉదయ్‌కుమార్, ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. శ్రీదేవి, ఈ-డార్ డీఆర్ఎం లక్ష్మణ్, పంచాయతీరాజ్, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో మూడు గేదెలు మృతి

**కుబీర్, సెప్టెంబర్ 3 (జనంసాక్షి):** కుబీర్ మండలంలోని చోండి గ్రామం వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడు మూగజీవాలు (గేదెలు) అక్కడికక్కడే మృతి చెందగా, ఒక ఆవు తీవ్రంగా గాయపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... చోండి గ్రామానికి చెందిన గుడాల గజ్జారం, భూమేష్ గేదెలను మేపడానికి తోలుకెళ్లారు. ఈ క్రమంలో భైంసా వైపు అతివేగంగా వెళ్తున్న ఒక ఫోర్ వీలర్ వాహనం రోడ్డుపై వెళ్తున్న గేదెల మందను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మూడు గేదెలు ప్రాణాలు కోల్పోగా, ఒక ఆవుకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అయితే, గేదెలను ఢీకొట్టిన సదరు వాహనంలో కలప ఉన్నట్లు గుర్తించారు. బీట్ ఆఫీసర్ రాజేష్, శివకుమార్ అక్కడికి చేరుకుని కలపతో పాటు వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు.

## అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 03(జనంసాక్షి ):** జిల్లాలో వివిధ పథకాల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ- ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి మంద మకరందు, జిల్లా అటవీ అధికారి బాలమణి, కాగజ్ నగర్, ఆసిఫాబాద్ డివిజన్ అటవీ అధికారులు భార్గవ్, అప్పయ్య లతో కలిసి జిల్లాలో వివిధ శాఖల ద్వారా చేపడుతున్న పనులు, అటవీశాఖ అనుమతుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ సర్వేలో రెవెన్యూ, అటవీ శాఖల మధ్య వివాదాలు గల భూములను జాయింట్ సర్వే నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో చేయబడుతున్న ఇందిరమ్మ ఇండ్లు, ప్రధానమంత్రి జన్ మన్ పథకం క్రింద మంజూరైన ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, అటవీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. టి.డబ్ల్యు.ఐ.డి.సి. ఆధ్వర్యంలో లింగాపూర్ మండలంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ప్రహరీ గోడ నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పలు మండలాలలో బిటి రహదారులు, వంతెనలు, కల్వర్టు పనులు మంజూరయ్యాయని, సంబంధిత అటవీ శాఖ అనుమతులు త్వరగా పొంది పనులు చేపట్టాలని తెలిపారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో చేపడుతున్న రహదారులు, గ్రామపంచాయతీ భవనాలు, మండల సమాఖ్య భవనాలు, సి సి రహదారుల పనులు త్వరగా చేపట్టాలని తెలిపారు. బిఎస్ఎన్ఎల్, జియో సంస్థల సెల్ టవర్ల నిర్మాణాల కొరకు అవసరమైన అనుమతులు పొంది పనులు వేగవంతంగా పూర్తి చేసి నెట్వర్క్ సేవలను మారుమూల గ్రామాలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు.

## కాంగ్రెస్ 1000 రోజుల ప్రజాపాలనపై సంబరాలు



**కెరమెరి, సెప్టెంబర్ 3(జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల ప్రజాపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ సుజాయిత్ ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రధాన రహదారి గుండా భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జెండాలు చేతబట్టి, నినాదాలు చేస్తూ నాయకులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రభుత్వ పాలనకు మద్దతుగా నినాదాలు చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ పాలన సాగిస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు , సర్పంచులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులుపాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ కులాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత

- అర్హత కలిగిన వారికి బెస్ట్ అవైలబుల్, ఉన్నత విద్య అమలు
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్
- ఎస్సీ,ఎస్టీల కేసుల పరిష్కారంలో వేగవంతంగా చర్యలు : జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్



**మహబూబాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 03(జనం సాక్షి):** జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం గురువారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో కమిటీ చైర్పర్సన్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు హాజరయ్యారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల పురోగతి, బాధితులకు అందాల్సిన పరిహారం, కేసుల దర్యాప్తుపై సమీక్షించారు. ఎస్సీ, ఎస్టీ చట్టం కింద నమోదైన కేసుల్లో బాధితులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందాల్సిన నష్టపరిహారం, పెన్షన్ , ఇతర సంక్షేమ ఫలాలను ఆలస్యం లేకుండా వెంటనే అందించాలని, రెవెన్యూ, పోలీస్, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి కేసుల పరిష్కార వేగాన్ని పెంచాలని , క్షేత్రస్థాయిలో ఎస్సీ, ఎస్టీ వర్గాలు , ఇతర అన్ని వర్గాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారికి ప్రభుత్వం అందిస్తున్న చట్టపరమైన రక్షణలపై అవగాహన సదస్సులు నిర్వహించాలనీ, జిల్లాలో 51 శాతం ఎస్సీ, ఎస్టీల జనాభా ఉందని జనాభా ప్రాతిపదికన వారికి అందాల్సిన అభివృద్ధి సంక్షేమ పథకాలు, సబ్సిడీ రుణాలు, కొత్తగా నోటిఫికేషన్లు జారీ చేసిన అంగన్వాడీ పోస్టులు, తదితర విభాగాలలో ఆర్ఓఆర్ రోస్టర్ పాయింట్ కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ మాట్లాడుతూ వేగవంతమైన నమోదైన కేసుల్లో ఎస్డీపివో/డిఎస్పీ స్థాయి అధికారులు దర్యాప్తును నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, సంబంధిత న్యాయస్థానాల్లో సకాలంలో ఛార్జిషీట్ దాఖలు చేయాలని సూచించారు.

# జనంసాక్షి 16వ వార్షికోత్సవం

## ప్రత్యేక అనుబంధం

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
4 సెప్టెంబర్ 2026






































Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370